సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 245

శనివారం 26-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి రైతూ పట్టణ ప్రాంత వ్యక్తితో సమానంగా ఆదాయం పొందాలన్నదే నా అభిమతం'



బోణీ కొట్టిన బ్రెజిల్

ప్రపంచకప్ ఫుట్‌బాల్‌లో బ్రెజిల్ 2–0 గోల్స్‌తో సెర్బియాపై గెలిచింది - 12లో



విజేత తల్లి

టాప్ 100 హెల్త్ కేర్ లీడర్స్ కేటగిరీలో చేరిన నీనారావుతో ఇంటర్వ్యూ - 11లో



ఢిల్లీ మద్యం కేసులో చార్జిషీట్

ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో 10,000 పేజీలతో కూడిన తొలి చార్జిషీట్‌ను సీబీఐ శుక్రవారం దాఖలు చేసింది.

వివరాలు 6లో



కేజ్రీవాల్ హత్యకు బీజేపీ కుట్ర

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ హత్యకు బీజేపీ కుట్ర పన్నిందని ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఆరోపించారు.

వివరాలు 6లో



అనుమతి లేకుండా వాడొద్దు

అమితాబ్ పేరు, స్వరం, ఫొటోలు, మరే ఇతర క్లిప్పింగ్‌లను అనధికారికంగా వాడరాదంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశాలిచ్చింది.

వివరాలు 6లో



డిసెంబర్‌లో రెండు ప్రయోగాలు

డిసెంబర్ నెలలో రెండు రాకెట్లను ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నట్లు ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు.

వివరాలు 2లో

పారదర్శక సేవలు

నిర్మాణాత్మక వ్యవస్థ ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్

- నెల రోజుల్లో 'ఏపీ సీఎం ఎంఎస్' యాప్
- రోడ్ల మరమ్మతులు, గుంతలు, ట్రాఫిక్ తదితర సమస్యలపై దృష్టి
- ఎవరైనా సరే ఫొటో అప్‌లోడ్ చేయగానే నిర్దిష్ట వ్యవధిలోగా పరిష్కారం
- 4,119 వార్డు సచివాలయాల పరిధిలో నిరంతర పర్యవేక్షణ
- మున్సిపల్ విభాగాల్లో వేగవంతమైన సేవల కోసం చర్యలు



" నగరాలు, పట్టణాల్లోని ప్రజలకు అవసరమైన సేవలు సత్వరం అందాలి. ఆయా విభాగాల అధికారులు నిర్దేశిత సమయంలోగా అనుమతులు మంజూరు చేయాలి. అన్ని సేవలు త్వరితగతిన అందేలా పాలనలో మార్పులు తీసుకురావాలి. ప్లాన్ అప్రూవల్ తదితర ప్రజా సేవలు సత్వరమే అందించడం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై నిశితంగా సమీక్షించి, తగిన ప్రణాళికను రూపొందించాలి.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: నగరాలు, పట్టణాల్లో కనీస మౌలిక సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ అవసరమని, సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించి దీర్ఘకాలంలో నిర్మాణాత్మక వ్యవస్థ ఏర్పాటుపై దృష్టి పెట్టామని చెప్పారు. ఇందుకోసం 'ఏపీ సీఎం ఎంఎస్' (ఏపీ కన్సిస్టెంట్ మానిటరింగ్ ఆఫ్ మున్సిపల్ సర్వీసెస్) పేరిట ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తున్నామని తెలిపారు. నెల రోజుల్లో సిద్ధమయ్యే ఈ యాప్ ద్వారా నగరాలు, పట్టణాల్లో ఎవరైనా సరే రోడ్ల సంబంధిత సమస్యలపై ఫొటో తీసి అప్‌లోడ్ చేయగానే, నిర్దిష్ట వ్యవధిలోగా మరమ్మతులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..

మిగతా 2వ పేజీలో ▶

వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు సీఎం గ్రీన్ సిగ్నల్

రాజమండ్రిలో 7.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటు నిర్మాణ ప్రతిపాదనకు సీఎం వైఎస్ జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ కార్పొరేషన్ పరిధితో పాటు సమీపంలోని మరో 28 అర్బన్ లోకల్‌బాడీల నుంచి వచ్చే చెత్తను ఇక్కడ ప్రాసెస్ చేసేలా ప్లాంట్ నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

మోసాల 'మార్గదర్శి'

చిట్‌ఫండ్స్ డబ్బులు చట్టవిరుద్ధంగా అనుబంధ సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్‌లోకి మళ్లింపు: అంబటి రాంబాబు

- స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, డీఆర్‌ఐ అధికారుల సోదాల్లో రామోజీ అక్రమాలు బట్టబయలు
- చివరకు ఫిల్మ్ సిటీ ఉద్యోగుల జీతాలూ చిట్ ఫండ్స్‌లో ప్రజల డబ్బుతోనే..
- పైసా పెట్టుబడి పెట్టకుండా ప్రజల సొమ్ముతో రూ.వేల కోట్ల అక్రమార్జన
- అక్రమంగా డిపాజిట్లు సేకరించానని.. ఇకపై సేకరించబోనని గతంలో హైకోర్టులో అఫిడవిట్.. కానీ ఇప్పటికీ అక్రమ పద్ధతిలోనే డిపాజిట్లు సేకరణ
- రామోజీ ఓ వైట్ కాలర్ క్రిమినల్.. అతి పెద్ద ఆర్థిక నేరగాడు
- చిట్‌ఫండ్ సభ్యులకు ముప్పు కలిగించేలా రామోజీ వ్యవహారాలు
- మార్గదర్శి విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి
- మార్గదర్శి అక్రమాలను ప్రశ్నిస్తే కక్ష సాధింపా?.. ప్రజల ప్రయోజనాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- అందుకే 18 చిట్‌ఫండ్స్‌లో సోదాలు.. అందులో మార్గదర్శి ఒకటి



సాక్షి, అమరావతి: 'ఈనాడు' అధినేత రామోజీరావు చిట్ ఫండ్ చట్టాన్ని ఉల్లంఘించి మార్గదర్శిలో అక్రమాలకు పాల్పడినట్లు రెండు నెలలుగా స్టాంపులు రిజిస్ట్రేషన్లు, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు సంయుక్తంగా నిర్వహించిన సోదాలలో బయట పడిందని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్‌ఫండ్, ఫైనాన్స్ కంపెనీల ద్వారా డిపాజిట్లు సేకరించానని.. ఇకపై అలాంటి అక్రమాలకు పాల్పడబోనని గతంలో రామోజీ రావు హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారని గుర్తు చేశారు. కానీ ఆయన ఇప్పటికీ అదే రీతిలో చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. మార్గదర్శి చిట్‌ఫండ్‌లో అంతా చీటింగ్‌కు

మిగతా 2వ పేజీలో ▶

ఏది నిజం?

చేపల చెరువుల్లో...

మళ్లీ ఓట్లకు బాబు గాలం

- తన పాలనలో నాలుగున్నరేళ్లూ యూనిట్‌కు రూ.3.86 వసూలు
- గత ఎన్నికలకు 6 నెలల ముందు యూనిట్ ధర రూ.2గా నిర్ణయం
- జీవో ఇచ్చినా.. విద్యుత్ కంపెనీలకు సబ్సిడీ మాత్రం బకాయే
- అధికారంలోకి వస్తూనే యూనిట్ రూ.1.50కు నిర్ణయించిన వైఎస్ జగన్
- మూడున్నరేళ్లలో ఆక్వా రైతులకు రూ.2,687 కోట్ల విద్యుత్ సబ్సిడీ
- సీడ్, ఫీడ్ ధరలను నియంత్రిస్తూ ఏకంగా చట్ట సవరణ
- సిండికేట్లను నియంత్రిస్తూ రొయ్యల ధరల్లోనూ ప్రభుత్వం జోక్యం.. కోవిడ్‌లోనూ ఈ రంగం దెబ్బతినకుండా చర్యలు
- మళ్లీ ఎన్నికలు వస్తుండటంతో తన వర్గాన్ని రెచ్చగొడుతున్న బాబు
- బాబుకు వంత పాడుతున్న 'ఈనాడు' రామోజీ.. రాష్ట్రం దెబ్బతింటుందని తెలిసినా.. ఎన్నికలే లక్ష్యంగా డేంజర్ గేమ్

4లో

నేరేడు ఆకూ ఔషధమే



- మధుమేహం, క్యాన్సర్ నియంత్రణకు ఉపయోగం
- ఏయూ ఫార్మసీ విద్యార్థుల పరిశోధనల్లో వెల్లడి
- కొర్సిటిన్, రూటిన్.. ఫ్లావనాయిడ్స్ గుర్తింపు

3లో

పారిశ్రామిక ప్రగతిలో దేశానికే దిక్సూచి

త్వరలో 10 పోర్టుల రాష్ట్రంగా ఏపీ

- రూ.90 కోట్లతో కాకినాడ యాంకరేజ్ పోర్టులో మౌలిక సదుపాయాలకు మంత్రుల భూమి పూజ
- 8 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో తయారైన భారీ ఓడ జల ప్రవేశం

- వివరాలు 10లో



కాకినాడలో మంత్రులు ప్రారంభించిన ఓడ



జేఈఈ మెయిన్.. ఇక రెండుసార్లే

- కరోనా సమయంలో నాలుగు సార్లు నిర్వహణ
- గత ఏడాది విద్యార్థులు డిమాండ్ చేసినా 2 దఫాలకే పరిమితం
- భవిష్యత్తులో కూడా అదే విధానం అమలు.. ఎక్కువసార్ల నిర్వహణతో అడ్మిషన్లపై ప్రభావం
- జనవరి, ఏప్రిల్లో నిర్వహణకు వీలుగా బోర్డులతో సంప్రదింపులు.. బోర్డు పరీక్షలకు అంతరాయం లేకుండా మెయిన్
- వచ్చేవారం విడుదల చేయనున్న ఎన్టీఏ

2లో

కానిస్టేబుల్ పోస్టుల్లో హోంగార్డులకు రిజర్వేషన్



- సీఎం జగన్ చరిత్రాత్మక నిర్ణయం
- నియామకాల నిబంధనలు సవరించిన రాష్ట్ర ప్రభుత్వం..
- నేడో రేపో నోటిఫికేషన్‌కు ముందు కీలక ప్రకటన
- అధికారంలోకి రాగానే జీతాల పెంపు.. ఇప్పుడు మరింత మేలు

2లో

ఇదండీ సంగతి



..మనుషుల్లాగా మాకు గంజాయి తాగే అలవాటులేద్సార్!



ఏపీ స్ఫూర్తి.. మేఘాలయలో

ప్రకృతి సాగు

కుదిరిన త్రైపాక్షిక అవగాహన ఒప్పందం

3లో

■ ప్రకృతి వ్యవసాయంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తితో ఈశాన్య రాష్ట్రమైన మేఘాలయ ప్రకృతిసాగు వైపు అడుగులేస్తోంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇటీవలే మేఘాలయ రాష్ట్ర అధికారులు, గ్రామీణ జీవనోపాధి సంస్థ ప్రతినిధుల బృందం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించింది. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి ఇక్కడ గిరిజనులు పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలపై అధ్యయనం చేసింది.

క్లుప్తంగా

నేడు సీఎం వైఎస్ జగన్ విజయవాడ పర్యటన

సాక్షి,అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శనివారం విజయవాడలో పర్యటించనున్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో సీఎం పాల్గొననున్నారు. ఉదయం 11.10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 11.20 గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రం చేరుకుని రాజ్యాంగ దినోత్సవ వేడుకలలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

29,30 తేదీల్లో కేంద్ర కార్యదర్శి ఏపీ పర్యటన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామ పంచాయతీల్లో అమలవుతోన్న వివిధ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ఈ నెల 30న కేంద్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి సునీల్‌కుమార్, సహాయ కార్యదర్శి ఏపీ నగర్‌లు ఈ నెల 29,30 తేదీల్లో రాష్ట్రానికి రానున్నారు. 30న కొన్ని గ్రామాల్లో క్షేత్ర స్థాయి పర్యటనలోనూ పాల్గొననున్నారు.

ఏపీకి రూ.682 కోట్లు జీఎస్టీ పరిహార నిధులు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత ఏడాదిలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు చెల్లించాల్సిన జీఎస్టీ పరిహార నిధులను కేంద్రం విడుదల చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కలిపి మొత్తంగా రూ.17,000 కోట్ల పరిహార నిధులను శుక్రవారం విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు జీఎస్టీ పరిహారం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.682 కోట్లు, తెలంగాణకు రూ.542 కోట్లు విడుదల చేసినట్లు కేంద్రం వెల్లడించింది.

6న కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ

సాక్షి, అమరావతి: కృష్ణా నదీ జలాల పంపిణీ అజెండాగా కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ డిసెంబర్ 6వ తేదీన భేటీ కానుంది. ఖరీఫ్, రబీలలో సాగు, తాగునీటి అవసరాలపై చర్చించి, వాటాల మేరకు నీటిని పంపిణీ చేయాలని కృష్ణా బోర్డుకు సిఫార్సు చేయనుంది. ఈ సిఫార్సుల ఆధారంగా రెండు రాష్ట్రాలకు నీటిని విడుదల చేయాలని బోర్డు ఉత్తర్వులు జారీ చేస్తుంది. నైరుతి రుతుపవనాల వల్ల సమృద్ధిగా వర్షాలు కురవడంతో కృష్ణా, ఉప నదులు వరద ప్రవాహంతో పరవళ్లు తొక్కాయి. వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతుండటంతో అవసరాలకు నీటిని వినియోగించుకోవాలని, వరద ప్రవాహం తగ్గాక అప్పటి వరకు వాడుకున్న నీటి లెక్కలను తేల్చి, మిగిలిన వాటాలు లెక్కగట్టి లభ్యత ఆధారంగా పంపిణీ చేస్తామని రెండు రాష్ట్రాలకు ప్రారంభంలోనే బోర్డు సూచించింది. కృష్ణాలో వరద ప్రవాహం కనిష్ట స్థాయికి చేరుకోవడంతో ఖరీఫ్, రబీలలో సాగు, తాగునీటి అవసరాలపై చర్చించి, కేటాయింపులు చేయడానికి త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసినట్లు రెండు రాష్ట్రాల ఈఎన్సీలకు శుక్రవారం కృష్ణా బోర్డు లేఖ రాసింది.

పోలవరంను సందర్శించిన జీఎస్ఐ డైరెక్టర్



ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జీఎస్ఐ డైరెక్టర్

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ స్థలాన్ని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) డైరెక్టర్ బి.అజయ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతంలో గ్యాప్ 1, గ్యాప్ 2 మధ్య ఉన్న కొండ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఆ ప్రాంతం నిర్మాణానికి అనువుగా ఉందా లేదా, అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన అధికారులు, మేఘా ఇంజనీరింగ్ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. గ్యాప్ 1, 2 మధ్య జియో టెక్నికల్ మ్యాపింగ్‌ను వారు చేశారు.

సారా, అక్రమ మద్యం, గంజాయి దందాపై ఉక్కుపాదం

- ఏపీలో సెబ్ విస్తృత దాడులు

సాక్షి, అమరావతి: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా దాడులు చేస్తూ సారా, అక్రమ మద్యం, గంజాయి దందాపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ నెల 18 నుంచి 24వ వరకు ఏకంగా 674 కేసులు నమోదు చేసింది. ఈ కేసుల్లో 782 మందిని అరెస్ట్ చేసి 92 వాహనాలను జప్తు చేసింది. వారం రోజుల్లోనే సారా తయారీ, అక్రమ మద్యం తరలింపుపై 640 కేసులు నమోదు చేసి, 701 మందిని అరెస్ట్ చేసింది. మొత్తం 3,622 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుంది. 64,320 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసింది. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలిస్తున్న 3,300 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుంది. కేవలం సారా, అక్రమ మద్యం కేసుల్లోనే 78 వాహనాలను జప్తు చేసింది. గత వారం రోజుల్లో ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తరలిస్తున్న వాహనాలపై దాడులు చేసి 34 కేసులు నమోదు చేయడంతోపాటు 81మందిని అరెస్ట్ చేసింది. వారి నుంచి 858 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని 14 వాహనాలను జప్తు చేసింది.

జేఈఈ మెయిన్.. ఇక రెండుసార్లే

కరోనా సమయంలో నాలుగుసార్లు నిర్వహణ

సాక్షి, అమరావతి : ఐఐటీ తదితర జాతీయ విద్యా సంస్థల్లో ప్రవేశానికి సంబంధించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఇక నుంచి ఏడాదికి రెండుసార్లు మాత్రమే నిర్వహించనుంది. గతంలో కరోనా సమయంలో నాలుగుసార్లు నిర్వహించిన ఎన్టీఏను ఏటా అలాగే అవకాశం కల్పించాలని విద్యార్థుల నుంచి డిమాండ్ ఉన్నా కేవలం రెండుసార్లు మాత్రమే ఈ పరీక్షను చేపట్టాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో.. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి వచ్చే ఏడాది నిర్వహించాల్సిన జేఈఈ మెయిన్ పరీక్ష షెడ్యూళ్లను వచ్చే వారం విడుదల చేయనుంది. బోర్డుల పరీక్షలతో సమస్య రాకుండా ఉండేందుకు ఆయా రాష్ట్రాలతో కూడా ఎన్టీఏ సంప్రదిస్తోంది. బోర్డు పరీక్షలు, జేఈఈ పరీక్షలు ఒకే తేదీల్లో కాకుండా వేర్వేరుగా కొంత వ్యవధితో నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకుంటోంది.

కరోనా వేళలో నాలుగుసార్లు నిర్వహణ

గతంలో జేఈఈ మెయిన్‌ను ఏడాదికి ఒకసారి మాత్రమే నిర్వహిస్తుండగా 2019 నుంచి రెండు సార్లకు పెంచారు. ఒకే దఫా కారణంగా విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని నష్టపోతున్నారని భావించి ఏడాదికి రెండుసార్లు జనవరి, ఏప్రిల్ నెలల్లో నిర్వహిస్తున్నారు. అయితే, కరోనా సమయంలో పరీక్షలకు తీవ్ర ఆటంకం ఏర్పడడంతో



2021లో మెయిన్‌ను నాలుగు దఫాలుగా నిర్వహించారు. విద్యార్థులు ఈ నాలుగు దఫాల్లో దేనిలోనైనా పాల్గొని జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందేలా అవకాశమిచ్చారు. 2022లో కూడా రెండుసార్లే నిర్వహించినా అవి చాలా ఆలస్యం కావడం, బోర్డు పరీక్షల సమయంలో వాటిని నిర్వహించేలా ముందు షెడ్యూళ్లు ఇవ్వడంతో గందరగోళం ఏర్పడింది. పైగా.. కరోనా అనంతరం రెగ్యులర్ తరగతులు ఆ ఏడాది చాలా ఆలస్యంగా ప్రారంభమైనందున తాము మరోసారి పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించాలని విద్యార్థులు కోరారు. అయితే, జనవరి, ఏప్రిల్ మాసాల్లో నిర్వహించాల్సిన ఆ పరీక్షలు జూన్, జూలైకు వాయిదా పడడం, ఫలితాల విడుదల కూడా చాలా జాప్యం కావడంతో ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియ కూడా ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో.. విద్యాసంవత్సరం నష్టపోకుండా కొనసాగాలంటే ఇకపై జనవరి, ఏప్రిల్ మాసాల్లో ఏడాదికి రెండుసార్లు మాత్రమే నిర్వహించి అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ముందుకెళ్లేలా ప్రవేశ పరీక్షలను నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని ఎన్టీఏ భావిస్తోంది. అందుకనుగుణంగా ఇంటర్మీడియెట్ బోర్డులు, సీబీఎస్ఈ పరీక్షల షెడ్యూళ్లకు ఇబ్బంది రాకుండా చూసేందుకు ఎన్టీఏ కసరత్తు చేస్తోందని వివిధ కోచింగ్ సంస్థల అధ్యాపకులు చెబుతున్నారు.

ఏటా 10 లక్షలకు పైగా అభ్యర్థులు..

మరోవైపు.. జేఈఈ పరీక్షలకు ఏటా పది లక్షల మందికి పైగా అభ్యర్థులు రిజిస్టర్ అవుతున్నారు. ఈ పరీక్షల్లో అర్హత మార్కులు సాధించి మెరిట్‌లో ఉన్న టాప్ 2.50 లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తున్నారు. గత ఐదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే 2019లో అత్యధికంగా 12.37 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు రిజిస్టరయ్యారు.

జేఈఈ మెయిన్‌కు ఏటా రిజిస్టరయ్యే విద్యార్థులు..అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధిస్తున్న వారి సంఖ్య ఇలా..

ఏడాది	రిజిస్టర్ అయిన వారు	హాజరు అర్హత	అడ్వాన్స్‌కు
2018	11,48,000	10,43,000	2,31,024
2019	12,37,892	11,47,125	2,45,000
2020	11,74,000	10,23,000	2,50,681
2021	10,48,012	9,39,008	2,50,186
2022	10,26,799	9,05,590	2,62,175

డిసెంబర్‌లో రెండు ప్రయోగాలు

- ఇస్రో చైర్మన్ సోమనాథ్
- పీఎస్ఎల్‌వీ సీ–54 రాకెట్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం



పీఎస్ఎల్‌వీ సీ-54 ఉపగ్రహ వాహక నౌక

సూళ్లూరుపేట : డిసెంబర్‌లో రెండు ప్రయోగాలకు సిద్ధమవుతున్నట్లు ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం 11.56 నిమిషాలకు సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి పీఎస్ఎల్‌వీ సీ54 ప్రయోగం నేపథ్యంలో శుక్రవారం ఆయన చెంగాళమ్మను దర్శించుకున్నారు. ఈవో శ్రీనివాసులురెడ్డి ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ డిసెంబర్‌లో అగ్నికుల్ అనే ప్రయివేట్ సంస్థకు చెందిన ప్రయోగాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. గత నెలలో విఫలమైన ఎస్ఎస్ఎల్‌వీ డీ–1 రాకెట్ ప్రయోగాన్ని డిసెంబర్ నెలాఖరులోగా చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. 2023వ సంవత్సరం ఫిబ్రవరిలో పీఎస్ఎల్‌వీ మార్క్–3 రాకెట్ ద్వారా వన్ వెబ్ కంపెనీకి చెందిన 36 ఉపగ్రహాలను మరోసారి ప్రయోగిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా, పీఎస్ఎల్‌వీ సీ–54 రాకెట్‌కు శుక్రవారం ఉదయం 10.26 నిమిషాలకు ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్, లాంచ్ ఆథరైజేషన్ బోర్డు చైర్మన్ ఆర్ముగం రాజరాజన్‌లు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం రాకెట్‌లోని నాల్గో దశలో ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం రాకెట్‌కు సంబంధించిన అన్ని పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి 10 గంటల తర్వాత రాకెట్‌లోని రెండో దశకు ద్రవ ఇంధనాన్ని నింపనున్నారు. ఈ ప్రయోగం ద్వారా 9 ఉప గ్రహాలను భూమికి 720 కిలోమీటర్ల ఎత్తులో సన్‌సింక్రోనస్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టేందుకు అంతా సిద్ధం చేశారు.

పారదర్శక సేవలు



సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

నగరాలు, పట్టణాల్లోని సమస్యలపై రియల్ టైం మానిటరింగ్ ద్వారా దృష్టి సారించాలని చెప్పారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

వార్డుల్లో రోజూ 2 గంటలు తనిఖీలు

- రాష్ట్రంలోని 4,119 వార్డు సచివాలయాల పరిధిలో మౌలిక సదుపాయాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలి. వార్డు సెక్రటరీలు తమ పరిధిలో ప్రతి రోజూ ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ ప్రజా సమస్యలపై తనిఖీలు చేపట్టాలి. తమ పరిధిలోని సుమారు 6– 7 కి.మీ మేర రోడ్లపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.
- తమ పరిధిలో రోడ్లు ఎలా ఉన్నాయి.. గుంతలు, కంకర కొట్టుకు పోవడం, పచ్చదనం తదితర వాటిని పరిశీలించడంతో పాటు వీధి లైట్లు, ఫుట్‌పాత్‌లు, ట్రాఫిక్ జంక్షన్ల పని తీరునూ గమనించాలి. వార్డు సచివాలయ పరిధిలో ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి వెళుతుంది.
- సిబ్బంది మాత్రమే కాకుండా కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, సామాన్య ప్రజలు కూడా తమ దృష్టికి వచ్చిన ఈ సమస్యలను యాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు.
- యాప్ ద్వారా అందిన సమస్యలు సంబంధిత విభాగాలకు వెళ్లగానే నిర్ణీత వ్యవధిలోగా వాటిని పరిష్కరించాలి. అందుకు అనగుణంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. నివేదించిన ప్రతి సమస్య పరిష్కారంపై ఉన్నత స్థాయిలో పర్యవేక్షణ ఉండాలి.

గ్రామాలకు ఇదే తరహా యాప్

- నగరాలు, పట్టణాల్లో తీసుకువస్తున్న ఈ యాప్‌ను గ్రామాల్లో కూడా అందుబాటులోకి తీసుకురావాలి. నగరాలు, పట్టణాల్లో రోడ్లు, మురుగునీటి కాల్వలు సహా.. ఇతర మౌలిక సదుపాయాల నిర్వహణ బాగుండాలి. వర్షాకాలం సహా అన్ని కాలాల్లోనూ బాగుండేలా మెరుగైన రోడ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని ఉపయోగించుకోవాలి. దీర్ఘకాలం మన్నేలా రోడ్ల నిర్మాణం చేపట్టాలి.

ఈ సమావేశంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్.గుల్జార్, ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ డాక్టర్ పి.సంపత్ కుమార్, ఏపీజీబీసీఎల్ ఎండీ బి.రాజశేఖరరెడ్డి, మెప్మా ఎండీ విజయలక్ష్మి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'సంకల్ప సిద్ధి' స్కాం విచారణ వేగవంతం

- ఐదు బృందాలు ఏర్పాటు చేసిన పోలీసులు
- పోలీసుల అదుపులో చైర్మన్, ఎండీ, జిల్లా ఇన్‌చార్జిలు, కోఆర్డినేటర్లు!

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సంకల్పసిద్ధి మార్ట్ చెయిన్‌లింక్, మల్టీలెవల్ మార్కెటింగ్ మోసాలపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే.రాణా స్వయంగా రంగంలోకి దిగి, కేసు మూలాలను శోధిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి ప్రత్యేకంగా ఐదు బృందాలు పనిచేస్తున్నాయి. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి, 12 గంటల్లోనే సంస్థ మోసాన్ని బట్టబయలు చేశారు. సంస్థ చైర్మన్ గుత్తా వేణుగోపాల్, మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ స్కాంలో కీలకంగా ఉన్న బోర్డు ఆఫ్ డైరెక్టర్లు 14 మంది నుంచి వివరాలు సేకరిస్తున్నారు. దీంతోపాటు డిపాజిటర్లకు నమ్మకం కలుగజేసి, పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించిన జిల్లాకు చెందిన ఇన్‌ఛార్జిలు, చీఫ్ కోఆర్డినేటర్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వీరు మొదట కొంత తక్కువ పెట్టుబడి పెట్టి, రూ.కోటికి పైగా లాభం పొందినట్లుగా డిపాజిటర్లను నమ్మించినట్లు పోలీసులు తెలిపారు. రెండురోజుల్లో కేసు కొలిక్కి వస్తుందని చెబుతున్నారు.

అనుమతుల్లేకుండానే డిపాజిట్ల సేకరణ

నంస్థకు డిపాజిట్ల సేకరణకు ఆర్బీఐ నుంచి ఎలాంటి అనుమతులూ లేవు. ప్రైజ్ మనీ అండ్ చిట్ ఫండ్ యాక్టు ప్రకారం ఎటువంటి అనుమతి తీసుకోలేదు. దీంతోపాటు ఏపీ డిపాజిటర్ యాక్టు ప్రకారం సేకరించిన డిపాజిట్లను సొంత బిజినెస్‌కు వాడుకో కూడదు. సంస్థలో కుటుంబ సభ్యులే బోర్డు డైరెక్టర్లుగా ఉండకూడదు. అయితే ఈ సంస్థలో కుటుంబ సభ్యులే బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మల్టీ లెవల్ మార్కెటింగ్, మనీ సర్క్యులేషన్ స్కీంను ఆర్బీఐ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్నట్లు గుర్తించారు. అందుకు అనుగుణంగా కేసు నమోదు చేసి, విచారణను వేగవంతం చేశారు. నిందితులు పలు రకాల స్కీంలతో ప్రజల్లో నమ్మకం కలిగించారని, ఆ తర్వాత లక్షల రూపాయలు డిపాజిట్లు తీసుకొని, వాటిని రొటేట్ చేశారని, ఎక్కువ మంది డిపాజిటర్లు అయ్యాక మొఖం చాటేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మోసాన్ని త్వరితగతిన గుర్తించి ఉండకపోతే బాధితులు పెద్ద సంఖ్యలో ఉండేవారని చెబుతున్నారు.

అంతా మోసమే..

రూ.2.5 లక్షలు కడితే 35 ఎర్రచందనం మొక్కలు, 15 ఏళ్లలో రూ.1.75 కోట్ల స్కీంకు సంబంధించి వీరికి ఎక్కడా భూమి లేదని, అదంతా మోసమని పోలీసులు గుర్తించారు. బంగారం పథకం కూడా మోసమేనని తేల్చారు. డిపాజిట్ల ద్వారానే దాదాపు రూ.240 కోట్లు సేకరించినట్లు తెలుస్తోంది. డిపాజిటర్ల డబ్బుతో వీరు దాదాపు 15 ప్రాంతాల్లో ఆస్తులు కొన్నారని, కొన్నింటికి అడ్వాన్స్ ఇచ్చారని సమాచారం. వాటి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. తెలంగాణ, కర్ణాటకలో కూడ ఈ సంస్థకు సంబంధాలు ఉన్నట్లు తెలిసింది. వీరి లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు రికార్డులను కూలంకషంగా పరిశీలిస్తున్నారు. బ్యాంకు డిపాజిట్ల వివరాలు సేకరిస్తున్నారు. డిపాజిటర్లకు న్యాయం చేసేలా అన్ని చర్యలు తీసుకొంటున్నట్లు నగర పోలీసు కమిషనర్ టీకే రాణా చెప్పారు.

కానిస్టేబుల్ పోస్టుల్లో హోంగార్డులకు రిజర్వేషన్

సీఎం జగన్ చరిత్రాత్మక నిర్ణయం

సాక్షి, అమరావతి: హోంగార్డులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీపికబురు అందించారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా పోలీసు నియామకాల్లో హోంగార్డులకు రిజర్వేషన్లు కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు పోలీసు నియామక ప్రక్రియ నిబంధనలు సవరించి మరీ హోంగార్డులకు రిజర్వేషన్లు కల్పించడం విశేషం. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్), ఏపీఎస్పీ, ఎస్ఏఆర్ సీపీఎల్, కానిస్టేబుళ్ల పోస్టులతోపాటు పోలీసు శాఖలో కమ్యూనికేషన్స్, ఫిట్టర్ – ఎలక్ట్రీషియన్, మెకానిక్స్, డ్రైవర్ పోస్టుల నియామకాల్లో హోంగార్డులకు రిజర్వేషన్లు కల్పించారు. సివిల్, ఏఆర్, కమ్యూనికేషన్స్ విభాగాల్లో మహిళా, పురుష కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో రిజర్వేషన్లు వర్తింపజేశారు. ఏపీఎస్పీ, ఎస్ఏఆర్ సీపీఎల్, ఫిట్టర్ ఎలక్ట్రీషియన్, మెకానిక్స్, డ్రైవర్ కేటగిరీల్లో పురుష కానిస్టేబుల్ పోస్టులే భర్తీ చేస్తారు. కాబట్టి ఆ విభాగాల పోస్టుల భర్తీలో పురుష హోంగార్డులకు రిజర్వేషన్లు కల్పించారు. కానిస్టేబుల్ నియామకాల్లో కేటగిరీలవారీగా 5 శాతం నుంచి 25% వరకు హోంగార్డులకు రిజర్వేషన్లు కల్పించడం విశేషం. ఈమేరకు 'ఆంధ్రప్రదేశ్ పోలీస్ రూల్స్ 1999'కి సవరణ చేస్తూ హోంశాఖ ఉత్తర్వులిచ్చింది. ఇక నుంచి కానిస్టేబుల్ నియామకాల్లో ఈ రిజర్వేషన్లను అమలు చేస్తారు. త్వరలో 6,500 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధమవుతున్న తరుణంలో హోంగార్డులకు రిజర్వేషన్లు కల్పించడం ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. దీనివల్ల రాష్ట్రంలో 15 వేల మంది హోంగార్డులకు ప్రయోజనం కలగనుంది.

హోంగార్డులకు ముఖ్యమంత్రి వరం

హోంగార్డులకు ప్రయోజనం కలిగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన సమయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. దీర్ఘకాలంగా పని చేస్తున్నప్పటికీ పోలీసు శాఖలో హోంగార్డులు తగిన గుర్తింపునకు నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హోంగార్డుల జీతాలు పెంచింది. అప్పటివరకు నెలకు రూ.18 వేలు మాత్రమే ఉన్న హోంగార్డుల జీతాన్ని రూ.21,300కి పెంచుతూ 2019 అక్టోబరులో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు వారికి మరింత మేలు చేకూరుస్తూ కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో రిజర్వేషన్లు కల్పిస్తూ సీఎం జగన్ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. పోలీసు నియామకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేయనుంది. అంతకంటే ముందే హోంగార్డులకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం చట్ట సవరణ చేయడం వారికి వరంగా మారనుంది.

హోంగార్డులకు రిజర్వేషన్లు ఇలా..

కానిస్టేబుల్ (సివిల్):	15 శాతం
కానిస్టేబుల్ (ఏఆర్) :	15 శాతం
కానిస్టేబుల్ (ఏపీఎస్పీ):	25 శాతం
కానిస్టేబుల్ (ఎస్ఏఆర్ సీపీఎల్):	25 శాతం
కానిస్టేబుల్ (కమ్యూనికేషన్స్):	10 శాతం
కానిస్టేబుల్ (ఫిట్టర్–ఎలక్ట్రీషియన్):	5 శాతం
కానిస్టేబుల్ (మెకానిక్స్):	10 శాతం
కానిస్టేబుల్ (డ్రైవర్) :	20 శాతం

విభజన హామీలు అమలు చేయాలి

- ప్రీ బడ్జెట్ సమావేశంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన తర్వాత ఆర్థికంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలు అమలు చేయాలని కేంద్రాన్ని ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కోరారు. పోలవరం ప్రాజెక్టు, వెనకబడిన ప్రాంతాలకు నిధులు ఎప్పటికప్పుడు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో నిర్వహించిన ప్రీ బడ్జెట్ సమావేశానికి ఏపీ తరపున ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రాథామ్యాలు, అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి బుగ్గన మీడియాతో మాట్లాడారు. విద్య, వైద్యం, సామాన్య ప్రజలకు అండగా ఉండడంపైనే రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలను ఆమోదించాలని కేంద్ర ఆర్థికమంత్రిని కోరామన్నారు. మూలధన వ్యయంపై ఇచ్చే స్వల్పకాలిక రుణాలను వచ్చే ఏడాదికి కూడా పొడిగించాలన్న ప్రతిపాదనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ సుజల స్రవంతికి నిధులివ్వాలని కోరినట్లు చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భాగంగా గృహ నిర్మాణాలకు నిధులిస్తున్నప్పటికీ మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్ర భాగస్వామ్యం లేనందున ఈ అంశాన్ని కూడా పీఎంఏవైలో చేర్చాలని సూచించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, ఆస్పత్రి ఏర్పాటు చేయడంలో కేంద్రం చొరవతీసుకోవాలని కోరామన్నారు. యువతకు ఉపాధి కల్పించే పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధిలో కేంద్రం మరింత సహకరించాలని కోరినట్లు చెప్పారు. కేంద్రానికి రాష్ట్రాల ద్వారా 62% ఆదాయం వస్తుంటే.. రాష్ట్రాలకు అదే 62% ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉన్నందున జీఎస్టీ వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం సమస్యకు పరిష్కారం చూపాలని కోరినట్లు తెలిపారు.

మోసాల 'మార్గదర్శి'

▶ మొదటి పేజీ తరువాయి



పాల్పడుతున్నారన్నారు. ఒక్క పైసా పెట్టుబడి పెట్టకుండా ప్రజల డబ్బుతో రూ.వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించిన వైట్ కాలర్ క్రిమినల్, అతి పెద్ద ఆర్థిక నేరగాడు రామోజీరావు అని ధ్వజమెత్తారు. చట్టాన్ని ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడుతున్న రామోజీరావుపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. ప్రజల ప్రయోజనాలు పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని.. దాన్నే నిర్వర్తిస్తున్నామని.. నేరాలకు పాల్పడినవారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రశ్నే లేదన్నారు. దొంగతనం చేసిన దొంగను పట్టుకుంటే కక్ష సాధింపు ఎలా అవుతుందని నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో అంబటి శుక్రవారం మీడియాతో మాట్లాడారు.

రామోజీ సంస్థలన్నీ చట్టవ్యతిరేకమైనవే..

- చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘించిన మార్గదర్శిపై సీనియర్ నేత ఉండవల్లి అరుణ్ కుమార్ దివంగత వైఎస్సార్ హయాం నుంచి న్యాయ పోరాటం చేస్తున్నారు. చిట్‌ఫండ్ చట్టాలను ఉల్లంఘించి రామోజీరావు విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడుతున్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీకి ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా బెంగళూరు, చెన్నైలో అనేక శాఖోపశాఖలు ఏర్పడ్డాయి. వ్యాపారం చట్టబద్ధంగా చేయాలి. చిట్‌ఫండ్ యాక్ట్‌ను రామోజీరావు దుర్వినియోగం చేస్తున్నారని, చట్టవ్యతిరేకంగా వ్యాపారం చేస్తున్నారని ఇటీవల జరిగిన సోదాల్లో తేటతెల్లమైంది.
- చిట్టీలు కట్టే సభ్యుల నుంచి వసూలు చేసిన సొమ్మును ఏ చిట్ ఫండ్ కంపెనీ అయినా ప్రత్యేక అకౌంట్లో జమ చేయాలి. ప్రతి చిట్‌కి ఒక ప్రత్యేకమైన అకౌంట్ ఓపెన్ చేయాలి. మార్గదర్శి చిట్‌ఫండ్ అన్నిటికీ కలిపి ఒకే అకౌంట్ ఓపెన్ చేసింది. చిట్ పాడుకున్న తర్వాత చెల్లించాల్సిన డబ్బులను సైతం సరైన ష్యూరిటీలు చూపలేదంటూ సభ్యులకు సక్రమంగా ఇవ్వడం లేదు. ఆ డబ్బంతా మార్గదర్శి యాజమాన్యమే నెలల తరబడి తమ దగ్గరే దాచుకోవడం వల్ల రిజర్వ్ ఫండ్స్ ఏర్పడుతున్నాయి.
- రూ.వేల కోట్ల రిజర్వ్ ఫండ్‌ను వారికున్న ఇతర సంస్థలకు డైవర్ట్ చేస్తున్నారు. రామోజీకే చెందిన ఈనాడు, ఈటీవీ, ఉషాకిరణ్ మూవీస్, రామోజీ ఫిలింసిటీ, ఉషోదయ పబ్లికేషన్స్, కళాంజలి, డాల్ఫిన్ హోటల్స్, కలోరమా ప్రింటర్స్, రామోజీ ఫౌండేషన్, ప్రియా ఫుడ్స్, ప్రియా పచ్చళ్లు.. ఇలా పలు సంస్థలకు ఆ నిధులు మళ్లించి రిజర్వ్ ఫండ్‌ను వాటిల్లో పెట్టుబడులుగా పెడుతున్నారు. మీడియా కింగ్‌గా పేరు పొందిన రామోజీరావు నడిపే సంస్థలన్నీ చట్టవ్యతిరేకంగానే ఏర్పడ్డాయని దీన్నిబట్టి స్పష్టమవుతోంది.
- రామోజీరావు పైసా పెట్టుబడి పెట్టకుండా చిట్‌దారుల డబ్బును ఉపయోగించి ఇతర వ్యాపారాలు చేస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా చట్టవిరుద్ధంగా ఆయన ఇలా వ్యాపారం చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే కక్ష సాధింపు చర్యలంటూ వారి పత్రికల్లో దుమ్మెత్తి పోస్తున్నారు. అక్రమ పద్ధతుల్లో చిట్‌దారులకు అన్యాయం చేస్తున్నారు.
- ఎవరైనా చట్టానికి అనుకూలంగా నడుచుకోవాలే కానీ వ్యతిరేకంగా ప్రవర్తించడానికి వీల్లేదు. ప్రభుత్వాలు వీళ్ల తప్పులను చూస్తూ ఊరుకోవడం సరైన విధానం కాదు. అందుకే మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

అక్రమాలను ప్రశ్నిస్తే కక్ష సాధింపా..?

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం నుంచి తెల్లారేసరికి దిగిపోయి టీడీపీ రావాలని రామోజీ కలలు కంటుంటారు. వైఎస్సార్‌సీపీకి తాను వ్యతిరేకమని.. అందుకే మేం ఆరోపణలు చేస్తున్నామని అనడం సరికాదు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకోవడం కక్ష సాధింపు ఎలా అవుతుంది?

- చిట్‌ఫండ్ నడిపే వ్యక్తి వేరే వ్యాపారాలు చేయకూడదు. రామోజీరావు మార్గదర్శి చిట్స్ నిర్వహిస్తూ వేరే వ్యాపారాలు కూడా చేయడం చట్ట విరుద్ధం. దీనివల్ల ఎప్పుడైనా ఏమైనా జరిగి కుప్పకూలిపోవచ్చు. ఎన్నో పెద్ద పెద్ద చిట్ ఫండ్స్ కంపెనీలు ఒక్కసారిగా కుప్పకూలిన సంఘటనలు ఎన్నో చూశాం. చిట్ ఫండ్స్‌పై ఇప్పుడే కాదు.. నిరంతరం సోదాలు జరుగుతాయి. సభ్యులు, ఖాతాదారులు చేతులు కాలాక ఆకులు పట్టుకునేలా కాకుండా ముందుగానే ఆలోచించాల్సిన అవసరం ఉంది.
- రామోజీని ఇలాగే వదిలేస్తే మిగిలిన చిట్‌ఫండ్ కంపెనీలకు మేం ఏం సమాధానం చెప్పాలి? ఒకసారి నేరం చేసిన తర్వాత అలాంటి ప్రవృత్తి కలిగిన వ్యక్తిని విచారించి చర్యలు తీసుకోవాల్సిందే. అక్రమ వ్యాపారాలను ప్రోత్సహించడం సమంజసం కాదు. అది ఎప్పుడైనా నష్టాన్ని తెచ్చి పెట్టే ప్రమాదం ఉందని ప్రజలు గమనించాలి.

రామోజీ ఓ వైట్ కాలర్ క్రిమినల్..

- రామోజీ ఆర్థిక నేరగాడు కాబట్టే ఇంత పెద్ద సామ్రాజ్యాన్ని నిర్మించుకోగలిగాడు. ఒక్క పైసా పెట్టుబడి లేకుండా ఏర్పాటు చేసిన సామ్రాజ్యం రామోజీది.
- 2022 మార్చి 31 నాటి మార్గదర్శి చిట్‌ఫండ్ బ్యాలెన్స్ షీట్ చూస్తే కంపెనీ షేర్ క్యాపిటల్ రూ.2 కోట్లు మాత్రమే ఉండగా రిజర్వ్ ఫండ్ రూ.1,697 కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.768 కోట్లు కాగా ప్రైజ్‌మనీ చెల్లించింది రూ.580 కోట్లు మాత్రమే. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టింది రూ.450 కోట్లు. దీన్నిబట్టి ఫండ్స్ డైవర్ట్ చేసిన అంశం మార్గదర్శి బ్యాలెన్స్ షీట్లోనే స్పష్టంగా కనిపిస్తోంది. అలా మళ్లించడం చట్టవిరుద్ధం. చివరికి రామోజీ ఫిల్మ్‌సిటీ ఉద్యోగులకు కూడా చిట్‌ఫండ్స్‌లో ప్రజల డబ్బు నుంచే జీతాలిస్తున్నారు.
- ఎంత వచ్చింది..? ఎంత వెళ్లింది? అనే వివరాలు బ్యాలెన్స్ షీట్లో చూపించడం లేదు. సోదాలకు వెళ్లిన అధికారులకు సహకరించడం లేదు. తనకు సొంత మీడియా ఉందని అధికారుల ఫొటోలు, వీడియోలు తీసి బెదిరిస్తున్నారు. ఎంతవారైనా చట్టానికి అతీతులు కాదన్న విషయాన్ని రామోజీ గుర్తించాలి.

సంబంధం లేదని తప్పుడు అఫిడవిట్లు

తనకు ఫైనాన్సియర్స్‌తోగానీ, చిట్‌ఫండ్‌తోగానీ సంబంధం లేదని నాడు రామోజీ తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసి తప్పించుకున్నారు. దీంతో ఉమ్మడి రాష్ట్రంలో హైకోర్టు ఆ కేసును కొట్టివేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఇప్పుడు అదే కేసు సుప్రీం కోర్టులో ఉంది. ఆయన మీడియా ఐకాన్ అయితే కావచ్చుగానీ చట్ట ప్రకారం వ్యవహరించాల్సిందేనని గతంలో సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. చట్టానికి ఎవరూ అతీతులు కాదు. చిట్‌ఫండ్స్‌కు సంబంధించి ఫిర్యాదులు అందాయి కాబట్టే మార్గదర్శితో పాటు మిగతా అన్ని కంపెనీలలో అధికారులు సోదాలు చేశారు.

రామోజీ అక్రమాలకు చంద్రబాబే రక్షకుడు

ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పనిచేసిన చంద్రబాబు.. రామోజీరావుకు రక్షకుడు. తనకు అనుకూలంగా రామోజీ వార్తలు రాస్తాడు కాబట్టి ఆయన అక్రమాలను చంద్రబాబు ప్రోత్సహించారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోలేదు. ఇప్పుడు సోదాల్లో బయటపడిన అక్రమాలకు చంద్రబాబు, రామోజీరావు సమాధానం చెప్పగలరా?

- ఇప్పటంలో నాలుగు ఆక్రమణల గోడలు కూలిస్తే అసలు ప్రభుత్వాన్నే కూల్చివేయాలనే స్థాయిలో అనుభవం లేని పవన్ కళ్యాణ్ రెచ్చిపోయి మాట్లాడారు. నిన్న హైకోర్టు తీర్పుతో వారి బండారమంతా బయటపడింది. అక్కడ అంతా చట్టప్రకారమే జరిగినా తప్పుడు అఫిడవిట్‌తో స్టే తెచ్చుకున్నారని హైకోర్టు ఆక్షేపించింది. రాజకీయాల్లో ఒకరిని మోసం చేస్తే పర్లేదు.. చివరికి కోర్టులనూ వీరు మోసగిస్తున్నారు. ఇప్పటంలో ఆక్రమణలకు సంబంధించి పిటీషనర్లకు హైకోర్టు రూ.లక్ష జరిమానా విధించటాన్ని బట్టి రామోజీరావు, పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఈ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయాలని కుట్రలు పన్నితే ఏం జరుగుతుందో స్పష్టమైంది. కాస్తయినా బుద్ధి తెచ్చుకుని ప్రవర్తించాలి.
- దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేయమన్న చందంగా విజయసాయిరెడ్డి సెల్ ఫోన్ గురించి టీడీపీ, ఎల్లో మీడియా చర్చ నిర్వహించడం వారి దీనస్థితిని తెలియజేస్తోంది.

నేరేడు ఆకుల్లోనూ ఔషధాలు

ఏయూ ఫార్మసీ విద్యార్థుల పరిశోధన • కొర్సిటిన్, రూటిన్ ఫ్లావనాయిడ్స్ గుర్తింపు



విద్యార్థులను అభినందిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

సాక్షి, విశాఖపట్నం: ఇప్పటి వరకు నేరేడు పండ్లలోనే ఔషధగుణాలు ఉంటాయని మనకు తెలుసు. కానీ నేరేడు ఆకుల్లోనూ ఔషధ గుణాలున్నట్లు కనుగొన్నారు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల విద్యార్థులు. సమాజానికి ఉపయుక్తంగా నిలిచే అంశంపై అధ్యయన ప్రక్రియలో భాగంగా నేరేడు ఆకుల్లో ఔషధ గుణాలను అన్వేషించే ప్రాజెక్టును వీరు చేపట్టారు. హెచ్‌వోడీ ఎ.కృష్ణ మంజరి పవార్ పర్యవేక్షణలో విద్యార్థులు నందిన, శ్రీదేవి, అనూష, కళ్యాణ్, రాజ్‌సుశితశ్రీ , శిరీష తమ పరిశోధనల్లో నేరేడు ఆకుల్లో రెండు ఫ్లావనాయిడ్స్‌ను గుర్తించారు. దాదాపు 50 గ్రాముల ఆకుల పొడిలో కొర్సిటిన్ 0.342 మైక్రో గ్రాములు, రూటిన్ 1.397 మైక్రో గ్రాములున్నట్లు తేల్చారు. ఈ ఫ్లావనాయిడ్స్ మధుమేహం, క్యాన్సర్ నియంత్రణకు ఉపకరిస్తాయి.

పరీక్ష చేశారిలా..

తొలుత కొన్ని నేరేడు ఆకులను తీసుకుని ఆరబెట్టారు. వాటిలో తేమ పూర్తిగా ఆరిపోయాక పొడి చేసి.. సన్నని జల్లెడతో వడగట్టారు. అనంతరం నేరేడు ఆకుల పొడి ఇథనాల్, మిథనాల్‌లలో కరుగుతోందని గుర్తించారు. ఇన్‌ఫ్రారెడ్ కిరణాలలో ఈ పొడిని పరిశీలించారు. ఈ పరీక్షతో ఆ పొడిలో ఫ్లావనాయిడ్స్ ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. ఇవి యాంటీ ఆక్సిడెంట్‌లుగా నిలుస్తాయి. మలినాలను తొలగించే వ్యవస్థగా పనిచేస్తాయి. తదుపరి దశలో సినోడా టెస్ట్ చేసి దానిలో ఉన్న ఫ్లావనాయిడ్స్ రకాన్ని గుర్తించారు. టీఎల్‌సీ (థిన్ లేయర్ క్రొమెటోగ్రఫీ) చేసి కొర్సిటిన్, రూటిన్‌లు ఉన్న శాతాన్ని గుర్తించారు. విద్యార్థులు తమ రిపోర్టును వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డికి అందజేశారు. సమాజ ఉపయుక్త అంశంపై పనిచేస్తున్న విద్యార్థులను వీసీ అభినందించారు. గతేడాది ఫార్మసీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఫోర్టిఫైడ్ రైస్‌పైన ఇదే విధంగా అధ్యయనం చేశారు. విశ్వవిద్యాలయంలో జరిపే ప్రతి పరిశోధన సమాజానికి ఉపయుక్తంగా ఉండేలా అధికారులు కృషిచేస్తున్నారు.

'పరివర్తన 2.0'తో జీవితాల్లో వెలుగు

- సారా తయారీ మానేసి గౌరవ జీవితం కోరుకునేవారికి రుణాలు
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కప్పరాళ్ల తిప్ప వాసులకు రుణాలు అందిస్తున్న మంత్రి కాకాణి, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(అర్బన్): శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో నాటుసారా తయారీని జీవనోపాధిగా చేసుకున్నవారిని 'పరివర్తన 2.0' కార్యక్రమం ద్వారా ఆ వృత్తి నుంచి బయటకు తీసుకువచ్చి ప్రత్యామ్నాయ ఉపాధి కోసం తగిన సాయం అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్లు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. 'పరివర్తన 2.0' కార్యక్రమం ద్వారా చట్టవ్యతిరేక కార్యకలాపాలను వదిలేసి ప్రత్యామ్నాయ ఉపాధి పొందేందుకు ముందుకు వచ్చిన వారికి శుక్రవారం కలెక్టరేట్‌లో మంత్రి కాకాణి చేతుల మీదుగా రుణాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప గ్రామానికి చెందిన 24 కుటుంబాలకు రూ.21.55 లక్షలు రుణం అందించామని తెలిపారు. నాటుసారా తయారీ, గంజాయి అమ్మకం లాంటివి చట్టవిరుద్ధమని, గతాన్ని వదిలేసి గౌరవప్రదమైన జీవితాన్ని కోరుకునేవారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయరావు మాట్లాడుతూ గంజాయి, నాటు సారా ఉత్పత్తుల అమ్మకాలు అరికట్టేందుకు పూర్తిస్థాయి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మానుగుంట మహీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, సెబ్ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్ల నమోదు ప్రారంభం

సాక్షి, అమరావతి: బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, బీఎస్సీ పారామెడికల్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం రెండో దశ కౌన్సెలింగ్‌కు వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం నుంచి ప్రారంభించింది. కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లలో ప్రవేశాల కోసం నిర్వహించే కౌన్సెలింగ్‌కు విద్యార్థులు ఈ నెల 30వ తేదీ సాయంత్రం నాలుగు గంటలలోగా ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. యూనివర్సిటీ వెబ్ సైట్ ద్వారా ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు.

పర్నపల్లిలో పర్యాటకం అభివృద్ధి

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా పర్నపల్లిలోని చిత్రావతి రిజర్వాయర్ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఏపీటీడీసీ చర్యలు చేపట్టింది. సుమారు రూ.5.60 కోట్ల అంచనాతో అధునాతన రెస్టారెంట్, పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచేలా గార్డెనింగ్, పాత్‌వేలు, మౌలిక సదుపాయాలైన బెంచీలు, టాయిలెట్స్‌ను నిర్మిస్తున్నది. ఇప్పటికే దాదాపు పనులు పూర్తయ్యాయి. మరోవైపు ప్రత్యేకంగా రిజర్వాయర్‌లో బోటింగ్‌ను అందుబాటులోకి తీసుకురానుంది.

ఏపీ స్ఫూర్తితో మేఘాలయలో ప్రకృతి సాగు

సాక్షి, అమరావతి: ప్రకృతి వ్యవసాయంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్ఫూర్తితో ఈశాన్య రాష్ట్రమైన మేఘాలయ ప్రకృతి సాగు వైపు అడుగులేస్తోంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇటీవలే మేఘాలయ రాష్ట్ర అధికారులు, గ్రామీణ జీవనోపాధి సంస్థ ప్రతినిధుల బృందం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించింది. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి ఇక్కడ గిరిజనులు పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలపై అధ్యయనం చేసింది. మేఘాలయలో ప్రకృతి వ్యవసాయ పరివర్తన కోసం కార్యాచరణ ప్రణాళికను రూపొందించే క్రమంలో మేఘాలయ స్టేట్ రూరల్ లైవ్లీ హుడ్ సొసైటీతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రైతుసాధికార సంస్థ, అల్లూరి సీతారామరాజు జిల్లా మాడుగులకు చెందిన నిట్టపుట్టు పరస్పర సహాయ సహకార సంఘం మధ్య త్రైపాక్షిక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం మేరకు మేఘాలయలో ప్రకృతిసాగు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక సహాయం అందించనుంది. మేఘాలయలో ఘరో, ఖాశీ హిల్స్‌లో ఎంపిక చేసిన ఐదుబ్లాకుల్లో 20 గ్రామాల రైతులను ప్రకృతి వ్యవసాయ రైతులుగా తీర్చిదిద్దడంతోపాటు భవిష్యత్ అవసరాలకు తగినట్టుగా బలమైన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ) వ్యవస్థ రూపకల్పనకు చేయూతనిస్తుంది. ఇందుకోసం 10 మంది సీనియర్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ల బృందం మేఘాలయాకు వెళ్లింది. ఈ బృందం అక్కడి కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, ప్రాజెక్టు బృందంతో కలిసి పనిచేస్తుంది. ఎంపికచేసిన బ్లాకుల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రకృతిసాగు చేపట్టడం ద్వారా వాటిని రిసోర్స్ బ్లాకులుగా తీర్చిదిద్దనున్నారు. ఇంగ్లిష్ స్థానిక భాషల్లో ప్రకృతిసాగు విధానాలు, పాటించాల్సిన పద్ధతులపై మెటీరియల్ తయారుచేసి ఇస్తారు. సిబ్బందికి శిక్షణతోపాటు కస్టమ్ హైరింగ్ సెంటర్స్ (సీహెచ్‌సీలు) ఏర్పాటు చేస్తారు. రాష్ట్రస్థాయిలో కోఆర్డినేట్ చేసేందుకు స్టేట్ యాంకర్‌ను నియమిస్తారు. సీజన్ల వారీగా రెండు రాష్ట్రాలకు చెందిన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు రెండు రాష్ట్రాల్లో పర్యటిస్తూ ప్రకృతి వ్యవసాయ అనుభవాలు, ఉత్తమ అభ్యాసాలను పరస్పరం పంచుకోవడానికి కృషిచేస్తారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే అధిక లాభాలు

- రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి



వెదురు మొక్కను ఎంవీఎస్ నాగిరెడ్డికి అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: విత్తు నుంచి పంట కొనుగోలు వరకు రైతులకు నిరంతరం సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) దేశానికి ఆదర్శంగా మారాయని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. వ్యవసాయ మిషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం కలెక్టరేట్‌లో శుక్రవారం వ్యవసాయ అనుబంధ రంగాల భాగస్వామ్య పక్షాల ముఖాముఖీ చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తూ రైతులు ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తే అధిక దిగుబడి, లాభాలు సాధించవచ్చన్నారు. ఉత్తరాంధ్రలో పాడి పరిశ్రమ ద్వారా అధిక ఆదాయం వస్తుందని, దేశీయ ఆవులను పెంచేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ప్రతి జిల్లాలోనూ ధాన్యం సేకరణ పారదర్శకంగా జరగాలని, ఒక్క రైతు కూడా నష్టపోయాననే మాట చెప్పకూడదని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీఏ ప్రసాద్ రాజు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, వ్యవసాయ మిషన్ సభ్యులు రామారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో శ్రీవారి విశేష ఉత్సవాలివి..



సమీర్ శర్మకు స్వామివారి లడ్డూ ప్రసాదాలను అందిస్తున్న టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ నెలలో జరుగనున్న విశేష ఉత్సవాలను శుక్రవారం టీటీడీ పీఆర్‌వో విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. 4న గీతాజయంతి, 5న చక్రతీర్థ ముక్కోటి, 7న కృత్తికా దీపోత్సవం, దత్త జయంతి, 8న శ్రీ తిరుప్పాణాళ్వార్ల వర్ష తిరునక్షత్రం, 16న సాయంత్రం 6.12 గంటల నుంచి ధనుర్మాసం ప్రారంభం, 19న సర్వ ఏకాదశి, 22న శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు ప్రారంభం, శ్రీ తొండరడిప్పొడియాళ్వార్ వర్ష తిరునక్షత్రం జరగనున్నట్లు పేర్కొన్నారు. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంటులే నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 66,072 మందిని దర్శించుకోగా 25,239 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. అదేవిధంగా స్వామివారికి హుండీ కానుకల రూపంలో భక్తులు రూ.4.23 కోట్లు సమర్పించారు. శ్రీవారి దర్శన టోకెన్లు లేని భక్తులకు 16 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి రెండు గంటల సమయం పడుతోంది.

శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో వైస్ చైర్మన్.. ఏపీ సీఎస్

తిరుమల శ్రీవారిని శుక్రవారం ఇస్రో వైస్ చైర్మన్ సంతాను బట్వాదేకర్ ఎస్ఎస్, ఇస్రో టీమ్, ఏపీ చీఫ్ సెక్రటరీ సమీర్ శర్మ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్వాగతం పలికారు.

స్వర్ణరథంపై సిరులతల్లి



స్వర్ణ రథంపై కొలువైన పద్మావతి అమ్మవారు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు శుక్రవారం ఉదయం అమ్మవారు సర్వభూపాల వాహనంపై వెన్న ముద్ద కృష్ణుడి అలంకారంలో దర్శనమిచ్చారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు ఇచ్చారు. సాయంత్రం ఆలయ మాడ వీధుల్లో స్వర్ణరథోత్సవం నిర్వహించారు. స్వర్ణరథంపై శ్రీపద్మావతి అమ్మవారు విశేష స్వర్ణ, వజ్రాభరణాలను ధరించి భక్తులను కనువిందు చేశారు. గోవింద నామస్మరణల మధ్య భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారి రథాన్ని లాగారు. వాహన సేవల్లో పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, చంద్రగిరి ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు రాములు, జేఈవో వీరబ్రహ్మం దంపతులు పాల్గొన్నారు.

హంపీ కుర్రాడు.. బెల్జియం అమ్మాయి..

- వివాహబంధంతో ఒక్కటైన జంట



దండలు మార్చుకున్న వధూవరులు

సాక్షి, బళ్లారి: ప్రేమకు ఎల్లల్లేవని నిరూపించింది విదేశీ యువతి. భారత్‌లో పర్యాటక ప్రదేశాలు వీక్షించేందుకు వచ్చిన ఆమె.. ఇక్కడి యువకుడిపై మనసు పారేసుకుంది. పెద్దలను ఒప్పించి హిందూ సంప్రదాయం ప్రకారం అతడిని మనువాడింది. బెల్జియంకు చెందిన సామాజిక కార్యకర్త కిమిల్ నాలుగేళ్ల కిందట హంపీ వీక్షణకు వచ్చింది. ఈ క్రమంలో హంపీకి చెందిన ఆటో డ్రైవర్ కమ్ గైడ్ అనంతరాజుతో పరిచయమైంది. అనంతరం ఆమె స్వదేశానికి వెళ్లింది. అయితే వారి మధ్య స్నేహం కొనసాగి ప్రేమగా రూపాంతరం చెందింది. విషయాన్ని పెద్దలకు చెప్పి వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే కరోనా విజృంభించడంతో రెండేళ్లపాటు తమ ప్రేమను పెద్దలకు చెప్పలేకపోయారు. ఎట్టకేలకు బెల్జియం నుంచి కిమిల్ తన తల్లిదండ్రులతో కలిసి హంపీకి వచ్చి.. వరుడు తల్లిదండ్రులు అంజినప్ప, రేణుకమ్మలతో చర్చించారు. ఇరు కుటుంబాల వారు సంతోషంగా పెళ్లికి ఒప్పుకోవడంతో గురువారం నిశ్చితార్థం చేసి.. శుక్రవారం హంపీలోనే అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు.

సాక్షి
శనివారం, నవంబర్, 26

పాక్ సైన్యానికి కొత్త బాస్

పాకిస్తాన్‌లో సైనిక దళాల ప్రధానాధికారి పదవి చుట్టూ కొంతకాలంగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. చివరకు ఆ పదవి లెఫ్టినెంట్ జనరల్ ఆసిమ్ మునీర్‌కే దక్కింది. ఈ నెల 29న లాంఛనంగా ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. పాక్ పుట్టుపూర్వోత్తరాలూ, తీరు తెన్నులూ గమనించే వారికి దేశాధ్యక్ష, ప్రధాని పదవులకన్నా సైనిక దళాల ప్రధానాధికారి పదవికి అక్కడుండే ప్రాధాన్యత అసాధారణమైనదని ఇట్టే తెలుస్తుంది. రాజ్యాంగంలో రాసుకున్న దానికి భిన్నంగా అత్యంత శక్తిమంతమైన పదవిగా అదెందుకు మారిందో చెప్పటం అంత సులభం కాదు. కార్యనిర్వాహక వ్యవస్థ చెప్పినట్టు నడుచుకోవటానికి భిన్నంగా దాన్నే శాసించే స్థాయికి సైన్యం రావ టంలో అవినీతి రాజకీయ నేతల బాధ్యతే అధికం. ఆ సంగతలా ఉంచి మూడు దశాబ్దాలుగా సైనిక దళాల ప్రధానాధికారి పదవి ఎంపిక ప్రక్రియ చిన్న చిన్న ఇబ్బందులు మినహా సజావుగానే సాగుతోంది. కానీ ఈసారి మాత్రం పెను వివాదాలు చుట్టుముట్టాయి. లెఫ్టినెంట్ జనరల్ మునీర్‌కు ఆర్మీ చీఫ్ పదవి రాదని కొందరూ, వస్తుందని కొందరూ విశ్లేషణలు చేశారు. ఆయనకు ఆ పదవి దక్కనీయనని ఈమధ్యే మాజీ ప్రధానిగా మారిన ఇమ్రాన్ ఖాన్ ప్రతిజ్ఞలు చేశారు. తమ పార్టీనుంచి ఎన్నికైన దేశాధ్యక్షుడి ద్వారా ఆయన ఎంపికను నిలువరిస్తానన్నారు. కానీ వీటన్నిటినీ దాటుకుని కోటలో పాగా వేయటం లెఫ్టినెంట్ మునీర్‌కి సాధ్యపడిందంటే ఆయనెంత అఖండుడో అర్థం అవుతుంది.

పదవీ విరమణ చేయబోతున్న జనరల్ జావేద్ బజ్వా తర్వాత సైన్యంలో అత్యంత సీనియర్ లెఫ్టినెంట్ జనరల్ మునీరే. ఆ రకంగా ఆ పదవి మునీర్ కే దక్కాలి. కానీ బజ్వా కన్నా రెండు రోజుల ముందు... అంటే ఈ నెల 27తో ఆయన పదవీకాలం ముగియాలి. కానీ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ నేతృత్వంలోని ప్రస్తుత ప్రభుత్వం ఆర్మీ చట్టం కింద 'దేశ భద్రత'ను కారణంగా చూపుతూ మునీర్‌ను సర్వీసులో కొనసాగించాలని నిర్ణయించింది. ఒకసారి ఆర్మీ చీఫ్ అయ్యాక ఆయన పదవీకాలం మూడేళ్లు పెరుగుతుంది. అప్పటికున్న ప్రభుత్వాన్ని ప్రభావితం చేయగలిగితే బజ్వా మాదిరే రెండోసారి పొడిగింపు తెచ్చుకుని మరో మూడేళ్లు ఆర్మీ చీఫ్‌గా కొనసాగవచ్చు. ఇలా జరిగే అవకాశం ఉండబట్టే ఇమ్రాన్ మునీర్‌కు మోకాలడ్డారు. సైన్యం కనుసన్నల్లో నడిచే గూఢచార సంస్థ ఐఎస్ఐకి డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన కాలంలో మునీర్ తన కుటుంబ ఆస్తుల కూపీ లాగటానికి ప్రయత్నించటమే ఇమ్రాన్ ఆగ్రహానికి కారణం. అప్పట్లో బజ్వాతో తన సంబంధాలు బాగుండటంతో మునీర్‌ను ఐఎస్ఐ నుంచి తప్పించగలిగారు. అలాంటి అధికారి ఆర్మీ చీఫ్ కావటం ఇమ్రాన్‌కు కోపం తెప్పించటంలో వింతేమీ లేదు. సాధారణంగా అయితే పొరుగు దేశం ఆంతరంగిక విషయాలు మనల్ని పెద్దగా ప్రభావితం చేయవు. కానీ పాకిస్తాన్ తీరు వేరు. సైన్యంలో ఉండే లుకలుకలూ, సైన్యానికి పౌర ప్రభుత్వంతో ఉండే విభేదాలూ తరచు భారత్‌కు సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. ఎన్నికైన ప్రభుత్వం మన దేశంతో మంచి సంబంధాలు కలిగివుండాలని వాంఛించిన మరుక్షణం ఆ ప్రయత్నాన్ని వమ్ము చేయటానికి అక్కడి సైన్యం ఎత్తులు వేస్తుంది. ఎల్‌ఓసీలో అకారణంగా కాల్పులకు దిగుతుంది. దేశంలో భారత్ వ్యతిరేకత ప్రబలేలా చూడటమే ఈ ఎత్తుగడ వెనకున్న లక్ష్యం. దీనికితోడు ఇమ్రాన్‌పై బజ్వా కయ్యానికి కాలుదువ్విన పర్యవసానంగా అక్కడి సైన్యంలో ఇమ్రాన్ వ్యతిరేక, ఇమ్రాన్ అనుకూల వర్గాలు ఏర్పడ్డాయి. అంతకుముందు ప్రధానిగా ఉన్న నవాజ్ షరీఫ్‌ను చిక్కుల్లో పడేసి, ఇమ్రాన్‌కు అధికారం దక్కటానికి సైన్యం తెరవెనక ఎటువంటి పాత్ర పోషించిందో బహిరంగ రహస్యం. బజ్వా తన వ్యక్తిగత విభేదాలతో ఇమ్రాన్‌ను తొలగించటం వల్ల నవాజ్ షరీఫ్ సోదరుడైన షెహ్‌బాజ్‌ను నెత్తికెక్కించుకోవాల్సి వచ్చిందని సైన్యంలో ఒక వర్గం మండిపడుతోంది. లండన్‌లో మకాం వేసిన నవాజ్ అక్కడినుంచే సలహాలిస్తూ సర్కారును నడిపిస్తున్నారు.

బజ్వా మొదటినుంచీ భారత్ వ్యతిరేకి. నవాజ్ మనతో మంచి సంబంధాలు నెలకొల్పుకోవాలని భావించినప్పుడు దాన్ని వమ్ము చేసిన ఘనుడు బజ్వాయే. ఆ పని కూడా ఇప్పుడు ఆర్మీ చీఫ్ కాబోతున్న మునీర్‌తోనే చేయించారు. పుల్వామాలో మన జవాన్లను పొట్టనబెట్టుకున్న ఉగ్రదాడి మునీర్ ఐఎస్ఐ చీఫ్‌గా ఉన్నప్పుడే చోటుచేసుకుంది. దానికి ప్రతీకారంగా పాక్ ఉగ్రవాద శిబిరాలపై మన దేశం దాడి చేసినప్పుడు మిగ్ యుద్ధ విమానం కూలి పైలెట్ అభినందన్ వర్ధమాన్ అక్కడి సైన్యానికి పట్టుబడ్డారు. ఆ సమయంలో ఆయనకు హాని జరక్కుండా చూడాలని జాతీయ భద్రతా సలహా దారు అజిత్ డోవల్ మాట్లాడింది కూడా మునీర్‌తోనే. అయితే ఆయన రావటంవల్ల మన దేశానికి మరిన్ని సమస్యలొస్తాయని చెప్పలేం. మొదట్లో భారత్ వ్యతిరేకిగా ఉన్న బజ్వా చివరికొచ్చేసరికి ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో మాట్లాడారు. అందుకు కారణం ఉగ్రవాదులకు సాయం అందిస్తున్న కారణంగా పాక్‌కు రావాల్సిన ఆర్థిక సాయం నిలిచిపోవటం. అది సరిచేసుకుని, అమెరికా మెప్పు పొంది ఎఫ్–16 యుద్ధ విమానాలు రాబట్టడంలో బజ్వా విజయం సాధించారు. అయితే పొరుగున అఫ్గాన్‌లో తాలిబన్‌ల హవా వచ్చాక తమ ప్రభ వెలిగిపోతుందనుకున్న పాక్ సైన్యం అందుకు భిన్నమైన పరిస్థితులు ఏర్పడటంతో అయోమయంలో పడింది. తాలిబన్‌లతో సరిహద్దు వివాదం తప్పటం లేదు. ఈ స్థితిలో మునీర్ రాకవల్ల మనకు కొత్తగా సమస్యలు రాకపోవచ్చు. ఏదేమైనా తగిన జాగ్రత్తలో ఉండటం తప్పనిసరి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** శు.తదియ రా.10.51 వరకు, తదుపరి చవితి **నక్షత్రం:** మూల సా.6.38 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** సా.5.10 నుండి 6.40 వరకు, తిరిగి తె.3.37 నుండి 5.04 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.6.15 నుండి 7.43 వరకు **అమృతఘడియలు:** ప.12.35 నుండి 1.42 వరకు.

సూర్యోదయం : 6.14
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

ఇన్‌బాక్స్ | మత సామరస్యానికి ప్రతీక

హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా అంద రికీ పుణ్యక్షేత్రం లతీఫ్ సాహెబ్ దర్గా. సయ్యద్ హజ్రత్ లతీఫుల్లా ఖాద్రి దర్గా నల్లగొండ పట్టణం నడిబొడ్డున గల గుట్టపై ఉంది. ప్రతి శుక్రవారం, ఆదివారం కందూరు నిర్వహించి మేకపోతుల్ని అర్పిస్తారు భక్తులు.

ఇరాక్ రాజధాని బాగ్దాద్‌కు చెందిన లతీ ఫుల్లా ఖాద్రి ప్రజలకు బోధనలు చేయడానికి క్రీస్తు శకం 960–1050 మధ్య జిల్లాలోని దేవర కొండ ప్రాంతానికి వచ్చారు. గుట్టపైనే అనేక ఏండ్లుగా నివాసం ఉండటంతో 'లతీఫ్ సాహెబ్ గుట్ట' అని పేరు వచ్చింది. అక్కడే సమాధి అయ్యారు. ఆయన అన్న కుమారులు అల్లావుద్దీన్, ఫరీద్ కూడా మత బోధనలు చేస్తూ ఆ గుట్ట పైనే సమాధి అయ్యారు.

ప్రతి ఏడాదీ నవంబర్, డిసెంబర్, జన వరి నెలల్లో... ఏదో ఒక నెలలో ఉర్సు ఉత్స వాలు జరుగుతాయి. ఉరుసు ఉత్సవాలు నిర్వహించే సమయంలో దర్గా మెట్ల వద్ద ఖవ్వాలీ ఆలాపిస్తూ కళాకారులు వీనుల విందు చేస్తారు. అలాగే ఉర్సు ప్రారంభం రోజున నల్లగొండ పట్టణంలోని మదీనా మసీదు నుండి గంధమును ఊరేగింపుగా గుట్టపై ఉన్న దర్గా వద్దకు తీసుకువెళతారు. ఈ ఊరేగింపులో ఆనవాయితీగా జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా యంత్రాంగం పాల్గొంటుంది.

– నరేశ్ జాటోతు, నల్లగొండ

చేపల చెరువుల్లో... మళ్లీ ఓట్లకు బాబు గాలం



నాన్ ఆక్వా జోన్లలోని రైతులకూ యూనిట్ రూ.1.50కే ఇస్తానని హామీ


అసలు ఆక్వా- నాన్ ఆక్వా జోనింగ్ నిబంధనలు తెచ్చిందే బాబు

- నాన్ ఆక్వా జోన్లలో రొయ్యల సాగు నియంత్రించడానికే ఇదంతా
- అలా కాక అన్నిచోట్లా చేపల చెరువులొస్తే వ్యవసాయానికి తీరని ముప్పు
- మళ్లీ ఆ ప్రాంతాన్ని మామూలు సాగుకు అనుకూలంగా చేయటం అసాధ్యం
- ఇవన్నీ తెలిసి కూడా... నాన్–ఆక్వా జోన్ల రైతులకూ బాబు తాయిలాలు
- బాబుకు తందానా అంటూ... వంత పాడుతున్న 'ఈనాడు' రామోజీ
- రాష్ట్రం దెబ్బతింటుందని తెలిసినా... ఎన్నికలే లక్ష్యంగా డేంజర్ గేమ్
- ఇంకెన్ని దారుణాలు చూడాలోనంటూ వాపోతున్న ఆక్వా రైతులు

ఈ రాష్ట్రం ఏమైపోయినా పర్వాలేదు... నా చంద్రబాబు అధికారంలో ఉంటే చాలనుకుంటాడు రామోజీ రావు. అందుకే... 'బాబు మాట– బంగారం మూట' అనే రీతిలో నారా వారు చెప్పే పచ్చి అబద్ధాలను కూడా పతాక శీర్షికల్లో అచ్చేస్తుంటాడు. కాస్తయినా ఇంగితజ్ఞానం, పత్రికగా కొంతైనా సామాజిక బాధ్యత ఉండాలి కదా? తన పాఠకులకే కాదు... ఈ రాష్ట్ర ప్రజలకు కూడా జవాబుదారీ అనే స్పృహ అక్కర్లేదా? 'ఆక్వా జోన్– నాన్ ఆక్వా జోన్' అనే పరిమితులు లేకుండా... ఆక్వా రైతులు అందరికీ యూనిట్ విద్యుత్తు రూ.1.50కే ఇస్తానని చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వటం... అదో మహా ప్రసాదంలా 'ఈనాడు' భజంత్రీలు కొడుతూ అచ్చేయటం!!. అసలు ఆక్వా రైతుల పాలిట విలన్ ఎవరు రామోజీ? సీడ్ నుంచి ఫీడ్ వరకూ... చివరకు రొయ్యల ఎగుమతిదారుల వరకూ ఒకే వర్గానికి చెందిన వారు సిండికేట్‌గా ఏర్పడి... రైతుల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్న ముఠాగా మారటం అబద్ధమా? తన వర్గానికి చెందిన వ్యాపారుల దారుణాలకు వత్తాసు పలికింది చంద్రబాబు కాదా? ఫీడ్, సీడ్ ధరలు ఆకాశాన్నంటుతున్నా... రొయ్యల ధరలు పతనమవుతున్నా ఏనాడన్నా బాబు హయాంలో ప్రభుత్వం జోక్యం చేసుకుందా? ఇప్పటి మాదిరిగా కనీస మద్దతు ధరలు నిర్ణయించి వ్యాపారుల చేత కొనిపించే సాహసం చేసిందా? అప్పుడెందుకు పెన్నెత్తలేదు రామోజీ మీరు? బాబు అధికారంలో ఉంటే ఎన్ని దారుణాలు జరిగినా మీకు 'సమ్మ'తమేనా? మరీ ఈ స్థాయి పాత్రికేయమా?

ఏది నిజం?

అసలు ఆక్వా – నాన్ ఆక్వా జోన్లను తెచ్చిందే చంద్రబాబు నాయుడు కదా? ఆక్వా జోన్లలోని వారికే విద్యుత్తు, ఇతర సబ్సిడీలని నిబంధనలు పెట్టిందే చంద్రబాబు నాయుడు కదా? అప్పుడెందుకు ఈ నిబంధనలు పెట్టారు... ఇప్పుడెందుకు తొలగిస్తామంటున్నారని అడిగే బాధ్యత 'ఈనాడు'కు లేదా? తాను అధికారంలో ఉంటూ ఏకంగా నాలుగున్నరేళ్ల పాటు యూనిట్ విద్యుత్తు ఆక్వా జోన్ల రైతులకు కూడా రూ.3.86 చొప్పున ఇచ్చింది చంద్రబాబు కాదా? ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి ఏదో మాయ చేయాలన్న ఉద్దేశంతో ఎలక్షన్లకు 6 నెలల ముందు దాన్ని యూనిట్ రూ.2కు తగ్గించాడు. అది కూడా ఆక్వా జోన్లలోని రైతుల వరకే!!. ఆ నాలుగున్నరేళ్లూ యూనిట్‌కు రూ.3.86 చొప్పున చెల్లిస్తూ ఆక్వా రైతులు పడ్డ బాధలు 'ఈనాడు'కు కనిపించలేదు... వినిపించలేదు. ఎందుకంటే అధికారంలో ఉన్నది చంద్రబాబు మరి!!. కానీ అప్పట్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తూ ఆక్వా రైతుల వెతలు చూశారు. తాను అధికారంలోకి వస్తే ఆక్వా జోన్లలోని రైతులకు విద్యుత్తు చార్జీలు తగ్గిస్తానని హామీ ఇచ్చారు. దీంతో బాబుకు గుబులు పెరిగి... ఎన్నికల ముందు ధర తగ్గించి తన జబ్బలు తానే చరుచుకున్నారు. రామోజీ కూడా శక్తివంచన లేకుండా చంద్రబాబు నిర్ణయాన్ని శ్లాఘించారు. కానీ... ఈ ఎన్నికల గిమ్మిక్కును ఆక్వా రైతులు అర్థం చేసుకున్నారు. 'ఇదేం ఖర్మరా బాబూ..' అనుకునేట్టుగా బాబుకు బుద్ధి చెప్పారు. అన్నట్టుగానే అధికారంలోకి వచ్చిన వెంటనే ఆక్వా జోన్లలోని రైతులకు యూనిట్ రూ.1.50కే అందించటం మొదలుపెట్టారు వైఎస్ జగన్.



జోనింగ్ నిబంధనలకు అర్థమేంటి?

అసలు చంద్రబాబు ఆక్వా జోనింగ్ నిబంధనలు తెచ్చిందెందుకు? ఆక్వా సాగును కొన్ని ప్రాంతాలకే పరిమితం చేయాలని కదా? అలా కాక ఎక్కడ పడితే అక్కడ కాలువ నీరు పారిన చోటల్లా చేపల చెరువులు వెలిస్తే మామూలు వ్యవసాయానికి భవిష్యత్తు ఉంటుందా? రాయలసీమలోని కడప జిల్లా మైదుకూరులో సైతం కాలువల వెంబడి చేపల చెరువులు తవ్వే ప్రయత్నాలు చేశారంటే ఏమనుకోవాలి? అలాంటి నాన్ –ఆక్వా ప్రాంతాల్లో కూడా రొయ్యల చెరువుల్ని విద్యుత్తు సబ్సిడీలిచ్చి ప్రోత్సహించాలన్న చంద్రబాబు ఆలోచన ఏ మేరకు సమంజసం? అలా రాయితీలిస్తే కాస్తో కూస్తో లాభసాటి కాబట్టి అంతా అటువైపే వెళతారు. అలా ఆక్వా సాగు చేసిన ప్రాంతాలన్నీ ఉప్పు నీటి కయ్యలుగా మారి మామూలు వ్యవసాయానికి పనికిరాకుండా పోతాయి. ఒకవేళ ఎప్పుడైనా... ప్రస్తుతం మాదిరిగా అంతర్జాతీయంగా ప్రతికూల పరిణామాలు తలెత్తి ఆక్వా సాగు దెబ్బతింటే... ఆ భూముల్ని మళ్లీ మామూలు సాగులోకి తీసుకురావటం అసాధ్యం. ఆ ఉద్దేశంతోనే జోనింగ్–నాన్ జోనింగ్ నిబంధనలొచ్చాయని ఎవరైనా చెబుతారు. మరిప్పుడు చంద్రబాబుకు ఏమైంది? రాష్ట్రం ఏమైపోయినా పర్వాలేదు... నేను అధికారంలోకి వస్తే చాలన్న దుర్బుద్ధి స్పష్టంకావటం లేదూ?

ఈయన్ని... ఈయన తానా అంటే... తందానా అంటూ తయారయ్యే రామోజీరావును ఏం చెయ్యాలి?

అంతా బాబు మనుషులు కాదా?


ఫీడ్ తయారు చేసే కంపెనీలూ వారివే. రొయ్యల్ని ఎగుమతి చేసే కంపెనీలూ వారివే. అంటే రైతుకు పెట్టుబడి వ్యయాన్ని నిర్ణయించేదీ వారే... ఉత్పత్తి ధరను నిర్ణయించేదీ వారే. వీళ్లు ఈ స్థాయిలో ముఠాలా మారి అన్నీ శాసించినపుడు గత ప్రభుత్వం ఏం చేసింది? ఆక్వా కార్య కలాపాల్లోని అవంతి ఫీడ్స్, దేవి సీఫుడ్స్, దేవి ఫిషరీస్, నెక్కంటి సీఫుడ్స్, సంధ్య ఆక్వా, గ్రోవెల్ ఫీడ్స్, వాటర్ బేస్ లిమిటెడ్... ఇవన్నీ ఎవరివి? చంద్రబాబు సన్నిహితులవి కావా? అసలు రాష్ట్రంలో వనామీ రొయ్యల పెంపకం 2009లో మొదలైనపుడు... 2014 వరకూ నాటి ప్రభుత్వాలు 2-3 సార్లు రేట్లు పెంచాయి. కిలో రేటు దాదాపుగా రూ.20 వరకూ పెరిగింది. మరి 2014 నుంచి 2019 మధ్య చంద్రబాబు కేవలం 70 పైసలు మాత్రమే ఎందుకు పెంచారు? ఎందుకు రైతులకు సరైన ధర రాకుండా వారి పొట్టగొట్టారు? 2019లో ఈ ప్రభుత్వం వచ్చాక ఇప్పటిదాకా దాదాపు కిలోకు రూ.27 వరకూ పెరగటం అబద్ధమా? కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రభుత్వం అండగా నిలవటం అబద్ధమా? ఈ నిజాలు ఎన్నడూ ఎందుకు చెప్పరు రామోజీ? బాబు అబద్ధాలను మాత్రమే అచ్చేసే మీదీ ఒక పత్రికేనంటారా?

ప్రతి ఏటా దోచుకోవటం... పచ్చి నిజం

ఆక్వా ఎగుమతిదారుల మెడపై ప్రభుత్వం కత్తిపెట్టిందంటూ రకరకాల ఆరోపణలు చేస్తున్న చంద్రబాబు... తన హయాంలో వారందరికీ ఇష్టారీతిన దోచుకోవటానికి లైసెన్స్ ఇచ్చారనే చెప్పాలి. ఏటా తొలిసారి రొయ్యల పంట చేతికొచ్చినపుడు ఏ రైతూ ఎక్కువ ధరను కళ్ల జూసే వాడు కాదు. 200 కౌంట్ ధర రూ.170–180 రూపాయలకు మించి పలికేది కాదు. ఎందుకంటే కంపెనీలన్నీ సిండికేట్‌గా ఏర్పడి ఈ మాయాజాలాన్ని కొనసాగించేవి. దానికి బాబు, రామోజీల అండ ఎటూ ఉంది. 'ఈనాడు' సైతం వీరి పక్షమే కనక... రైతుల వెతలను రాస్తే ఒట్టు!. అలా 170–180కి వీళ్లంతా రైతుల దగ్గర కొనుగోలు చేసిన తరవాత... అకస్మాత్తుగా ధర పెరిగిపోయేది. కానీ అలా పెరిగేటప్పటికి రైతుల చేతిలో రొయ్యలుండేవి కావు. ఇలాంటి పరిస్థితులుండకూడదనే చట్ట సవరణలు చేసి మరీ ఈ ప్రభుత్వం రైతుల్లో భరోసా కల్పించింది. అదే రామోజీరావు దృష్టిలో పెద్ద నేరమైపోయింది. ఆక్వా రైతుల గురించి 'ఈనాడు' రాసే ప్రతి రాతలో ప్రభుత్వంపై విషం చిమ్మటానికి... ఈ సిండికేట్లను బ్రేక్ చేయటమన్నదే ప్రధాన కారణమని వేరే చెప్పాల్సిన పని లేదు కూడా. అధికారంలో ఉన్నన్నాళ్లూ ఈ సిండికేట్లు దోచుకోవటానికి చంద్రబాబు సాయపడితే... ఎన్నికలు వచ్చినపుడు వీళ్లంతా కలిసి చంద్రబాబుకు ఆర్థికంగా సాయపడతారు. అదీ వీళ్ల లెక్క. అందుకే వీళ్లకు సాధారణ రైతులంటే లెక్క ఉండదు.

ఫీడ్ రేట్లను నియంత్రించిందెవరు?

రొయ్యల మేత ధరలపై 2014–19 మధ్య ఎలాంటి నియంత్రణలూ లేవు. ముడిపదార్థాల రేట్లు పెరక్కపోయినా... మార్కెట్లో వాటి దిగుబడులు పుష్కలంగా ఉన్నా కూడా ఫీడ్ ధరలను ఇష్టారీతిన పెంచుకుంటూ పోయారు.



ఇక్కడ గమనించాల్సిందొకటుంది. బాబు హయాంలో ముడిపదార్థాల ధరలు తగ్గినా.... ఫీడ్‌పై మాత్రం కిలోకు రూ.7 అధికంగా దోచుకున్నారు. కానీ బాబు పట్టించుకుంటే ఒట్టు!!. అదే ఈ ప్రభుత్వ హయాంలోకి వచ్చేసరికి ముడిపదార్థాల ధరలు భారీగా పెరిగాయి. ఇదే కారణంతో ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు మధ్య 6 సార్లు కంపెనీలు ఫీడ్ ధరలు పెంచాయి. కానీ ప్రభుత్వం జోక్యం చేసుకుని 3 సార్లు తగ్గించింది. అంతేకాకుండా ముగ్గురు సీనియర్ మంత్రులు, సీనియర్ అధికారులతో ఆక్వా సాధికార కమిటీ ఏర్పాటయింది. ఈ కమిటీ అందరితో చర్చించి... కిలోకు రూ.2.60 చొప్పున ఫీడ్ ధరలు తగ్గించింది. ఇలా ఇష్టానుసారం ఫీడ్ ధరలు పెంచకుండా ఏకంగా చట్టాన్ని సైతం సవరించింది ప్రభుత్వం. అలా.. ఫీడ్ ధరలను నియంత్రించే వ్యవస్థను తేవటంతో పది ఎకరాల్లోపు ఉన్న రైతులకు దాదాపు రూ.10 లక్షల మేర ప్రయోజనం కలిగింది. కాకపోతే ఇలాంటి నిజాలను 'ఈనాడు' ఎప్పుడూ చెప్పదు. ఎందుకంటే ఇవి బాబు చేయలేని... కనీసం చేయాలనుకోని పనులు కాబట్టి!.

జగన్ హామీ... బాబు జీవో...
బకాయిలు చెల్లించిన జగన్!!

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్నపుడు... తాను అధికారంలోకి వస్తే ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్తు రూ.1.50కే ఇస్తానని హామీ ఇచ్చారు. దీంతో కలత చెందిన బాబు... అప్పటికప్పుడు ఆక్వా జోన్లలోని రైతులకు రూ.2కే యూనిట్ ఇస్తానని జీవో ఇచ్చారు. అది కూడా 2018 సెప్టెంబర్లో. అంటే 6 నెలల్లో ఎన్నికలున్నాయనగా!!. చిత్రమేంటంటే జీవో ఇచ్చినా ఆ మేరకు సబ్సిడీ నిధుల్ని విద్యుత్తు కంపెనీలకు మాత్రం ఇవ్వలేదు బాబు. అధికారంలోకి వచ్చిన వెంటనే... 2019 జూలై 2 నుంచి వీరికి విద్యుత్తు యూనిట్ రూ.1.50కే ఇస్తున్నట్టు వైఎస్ జగన్ జీవో ఇచ్చారు. ఈ మూడున్నరేళ్లలో ఏకంగా రూ.2,687.47 కోట్ల రూపాయలు ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ రూపంలో ఖర్చు చేశారు. బాబు చెల్లించకుండా వదిలేసిన బకాయిలనూ చెల్లించారు. అదీ చిత్తశుద్ధి అంటే.

ధరలెందుకు తగ్గాయి?

అసలిప్పుడు రొయ్యల ధరలెందుకు పతనమయ్యాయి? ప్రధానంగా చైనా, అమెరికాలకు ఎగుమతులు నిలిచిపోయాయి. ఈక్వెడార్ లాంటి చిన్న దేశం నాణ్యమైన రొయ్యల్ని ఉత్పత్తి చేస్తూ అంతర్జాతీయ మార్కెట్లో సవాల్ విసిరింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్ లేక... ధరలు పతనమయ్యాయి. ఇక దేశీయంగా పరిస్థితులెలా ఉన్నా రాష్ట్రం మాత్రం నాణ్యమైన విద్యుత్తును సబ్సిడీ ధరకే అందించటంతో ఇక్కడ ఉత్పత్తి పెరిగింది. ఎగుమతిలో పోటీ పెరిగింది. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలోనూ ఆక్వా పరిశ్రమ దెబ్బతినకుండా దానికి మినహాయింపునిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద సాహసమే చేసింది.

మత్స్య రంగంలో ఏపీ ఉత్తమ రాష్ట్రం

కేంద్రం కితాబు మత్స్య రంగానికి సంబంధించి అన్ని అంశాలలో ఆంధ్రప్రదేశ్‌ను భారత ప్రభుత్వం 2021లో ఉత్తమ రాష్ట్రంగా గుర్తించింది. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా అదే ఏడాది నవంబర్ 21న బహుమతి ప్రదానం చేసింది. మత్స్య ఉత్పత్తిలో రాష్ట్రం.. దేశంలోనే 30 శాతం వాటా కలిగి అగ్రగామిగా ఉంది. స్థూల విలువ జోడింపులో 2014–15లో 4.6 శాతంగా ఉన్న వాటా, 2020–21 నాటికి 9 శాతానికి అభివృద్ధి చెందింది. మొత్తం దేశ సముద్ర ఆహార ఎగుమతుల విలువలో రాష్ట్ర వాటా 2014–15 లో 28 శాతం ఉండగా, 2020–21 నాటికి అది 35 శాతానికి పెరిగింది. ఎగుమతుల విలువ 2014–15లో రూ.9,671 కోట్లు ఉండగా, 2020–21 నాటికి అది రూ. 20,019 కోట్లకు పెరిగింది. 2014–15లో 19.78 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్న మత్స్య ఉత్పత్తి.. 2021–22లో ఏకంగా 48.13 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. ఈ వాస్తవాలు కళ్లెదుటే కనిపిస్తున్నా, మత్స్య రంగం వృద్ధి చెందలేదని చెప్పడం ఎవరి బాగు కోసం?

పొలిటికల్ తిట్లలో పోషకాలెక్కువ...

సారాంశం
సరికొండ చలపతి

ఇప్పుడు ఓ చందమామ కథ చెప్పుకుందాం,.

అనగనగా ఓ ఊర్లో ఓ గయ్యాళి గంగమ్మ ఉండేది. ఆమె నోటికి ఊరంతా హడలిపోయేది. ఇంట్లో ఉన్న భర్తను, పిల్లలను నానా తిట్లు తిడుతుండేది. ఆమె ఇంటి ముందు నుంచి ఊరివారెవరైనా వెళ్లడానికే భయపడేవారు. ఆమె తిట్లు అంత ఘాటుగా ఉండేవి. ఆమె నోటికి దడిచి కొడుకుకు పిల్లను ఇవ్వడానికి కూడా ఎవ్వరూ ముందుకు రాలేదు. చివరికి అతని పరిస్థితి అర్థం చేసుకుని, ప్రేమించిన తెలివైన అమ్మాయి ఓ సాధువును ఆశ్రయించింది. విషయం తెలుసుకున్న సాధువు గంగమ్మను మార్చాలని ఆ ఇంటికి వెళ్లాడు. ఆ ఇంటికి వెళ్లిన సాధువు ఆమె నోటితీరుకు, ఆమె తిట్లకు అవాక్కయ్యాడు. కాసింత తేరుకుని.. ఆమె మారదని నిర్ణయించుకుని, కాసింత మంత్ర జలం తీసి..

''ఇక నుంచి ఎప్పుడు ఎవరు ఎవరిని తిట్టినా తిట్ల దెయ్యం ప్రత్యక్షం అవుతుంది. తిట్లు సమంజసమే అయితే ఇబ్బంది పెట్టిన వారిని, లేకుంటే అకారణంగా తిట్టిన వారిని తిట్ల దయ్యం ఏడిపిస్తుంది లేదా తినేస్తుంది'' అని శపించి వెళ్లిపోయాడు. ఆ మరుక్షణం తిట్లభూతం ప్రత్యక్షమై గంగమ్మ ఇంట్లో వీరంగం వేసింది. గంగమ్మ నోరు మూతపడి... పిల్లల ప్రేమ పెళ్లికి వెళ్లింది... కథ కంచికి వెళ్లింది.

- ఇప్పుడా తిట్ల భూతాలు రాజకీయ నాయకుల ఇంటివద్ద.. పార్టీ ఆఫీసుల వద్దా తిరుగుతున్నాయట. మొన్న మునుగోడు ఎన్నికల సమయంలో వీధుల్లో వీరంగం వేసినవి కూడా ఇవేనట!

ఈ మధ్య తిండిపై బాగా ధ్యాస పెరిగింది. తినేది ఆర్గానికా, కాదా... క్యాలరీ ఫుడ్డా కాదా... ఇలా తర్జన భర్జనలు బాగా పెరిగాయి. ఏం తింటే మంచిదో డైటీషియన్లను, మంతెన సత్యనారాయణ రాజు లాంటి వారిని అడగడం ఎక్కువయింది. నిజానికి ఏం తింటే ఇమ్యూనిటీ పెరుగుతుందో, శక్తి వస్తుందో మన ప్రధానిని అడిగితే తెలుస్తుంది.

రోజూ రెండుమూడు కేజీల తిట్లు..

''మోదీజీ మీరు అలసిపోరా.. అని ఇటీవల కొంతమంది నన్ను అడిగారు. వారికి నేనిచ్చిన సమాధానం ఏమిటో తెలుసా, రోజూ నేను 2, 3 కేజీల తిట్లు తింటున్నా. అవన్నీ ప్రొటీన్‌గా మారేలా నన్ను దేవుడు ఆశీర్వదించాడు. మనను తిట్టే తిట్ల గురించి మనం పట్టించుకోవద్దు. కార్యకర్తలు మజా చెయ్యాలి. 20–22 ఏళ్లుగా రాత్రీ పగలు తేడా లేకుండా నన్ను తిడుతూనే ఉన్నారు... వాటిలో చిత్ర విచిత్రమైన తిట్లు ఉన్నాయి. వాటివల్లే నేను ఈ స్థాయికి వచ్చాను.''

- హైదరాబాద్‌లో సభాముఖంగా ప్రధాని చెప్పిన చిట్కా ఇది. అందరూ, ముఖ్యంగా రాజకీయ నాయకులు పాటించదగ్గది.

నడక నుంచి పరుగులు..

రాహుల్ గాంధీ చలో జోడో యాత్ర అంటూ నడక మొదలు పెట్టి, దేశమంతా తిరుగుతూ మన రాష్ట్రంలోకి వచ్చే సరికి ఏకంగా పరుగులు మొదలు పెట్టారు. మిగతా వారంతా ఆయనతో పరుగెత్తలేక అలసిపోయారు. మిగతా పరుగులు మహారాష్ట్రలో చేసుకోండి అంటూ ఆయాస పడి చేతులెత్తేశారట.. అంటే మోదీ భాషలో చెప్పాలంటే రాహుల్ గాంధీకి తిట్లు బాగానే వంటబట్టినట్టున్నాయి. తనీ స్థాయికి రావడానికి చిత్రవిచిత్రమైన తిట్లే అంటున్న ప్రధాని మాటలు విన్నారా రాహుల్ జీ! తిట్లకు వెరవకండి. వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలైన తిట్లు, రక రకాల రుచుల్లో ఉంటాయి. హాయిగా తినండి. మీరు కూడా ఏనాడో ఒకనాడు మోదీ స్థాయికి చేరతారు.

ప్రొటీన్ ఫార్ములా...

కొద్ది నెలలుగా రాష్ట్ర రాజకీయాల్లో వేడి.. అకస్మాత్తుగా బీజేపీలో పోరాటపటిమ పెరిగాయి. దీనికి ఇంత శక్తి రావడానికి టీఆర్ఎస్ అందునా కేసీఆర్ పవర్‌ఫుల్ తిట్లే కారణంగా తోస్తోంది. వీళ్ల తిట్లలో బాగా పోషకాలు ఉన్నట్టున్నాయి. రోజు రోజుకూ బీజేపీ కార్యకర్తలు బలం పుంజుకుంటున్నారు. ''..పిస్సగాడిద కొడుకు, రండ మంత్రి, చేవ లేని దద్దమ్మ, బుట్టాచోర్, కిరికిరి గాళ్లు...'' మోదీ అన్నట్టు ఇట్లాంటి చిత్ర విచిత్ర తిట్లలో ఎన్ని పోషకాలుంటాయి మరి!.. అందుకే బీజేపీ కార్యకర్తలు బలం పుంజుకుని విజృంభించేస్తున్నారు.

ఈ ప్రొటీన్ ఫార్ములా అన్ని పార్టీలకు వర్తిస్తుందని బీజేపీ నాయకులు విస్మరించి నోరు జారుతున్నట్టున్నారు. అలా నోరు జారడం వల్ల మొన్న ఓ ఎంపీ ఇంటిముందు తిట్ల భూతాలు ఎలా వీరంగం చేశాయో చూశాం కదా. పైన మనం చెప్పుకున్న కథలోలాగా తిట్ల భూతాలు తప్పెవరిదైనా వదలవు. తిట్లతో పోషకాలే కాదు. ప్రాబ్లెమ్స్ తప్పవన్న మాట. ఇక ఏం పర్లేదు అనుకుని రిలాక్సయిన టీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులూ ఒక్కసారిగా మేల్కొని యాక్టివయ్యింది, బలపడుతోంది, నోరు జాడిస్తోంది... నేషనల్ లెవల్ ఇంపోర్టెడ్ తిట్ల నుంచి, లోకల్ నేతల నాటు తిట్ల నుంచీ గ్రహించిన పోషకాలతోనేనని బీజేపీ నాయకులు కూడా గుర్తించి జాగ్రత్త పడాలి.

ప్రజల తిట్లు మరింత పవర్‌ఫుల్..

ఇప్పుడు ముఖ్యమంత్రి, ప్రధానితో సహా, అన్ని కేంద్ర, రాష్ట్ర మంత్రులు, నాయకుల నోటి నుంచి వస్తోన్న సేమ్ విమర్శ.. **'ఊరికే నోరు పారేసుకోవడం, తిట్టడం తప్పు. మేం చేస్తున్న డెవలప్‌మెంట్‌ను చూసేదేలేదు...'** అని.

నిజమే, రాజకీయ నాయకులు డెవలప్‌మెంట్ చూడరు, తిట్లు తిడతారు, తింటారు కానీ, డెవలప్‌మెంట్ చూసే సెక్షన్ కూడా ఉంది. వాళ్లే కామన్ పీపుల్. ''రోడ్లు వేయించే మొహాల్లేవు కానీ, ఓటు వెయ్యాలట ఓటు! ఐదొందలు, వెయ్యి చేతుల పెట్టి, సిగ్గు శరం లేదా ఓటడగడానికి. గెలిపియ్యర్రి డబ్బులు తీసుకుని. మన బతుకులు నాశనమైతయి..''

'మా గల్లీకి ఏ పార్టోల్లూ ప్రచారానికి రాకండి... మేం ఓట్లేయం. మీకు ఎప్పటికీ బుద్ధి అస్తలేదు..''

- ఎలక్షన్ టైంలో ఇలాటి తిట్లు వింటుంటాం. ఇవి డెవలప్‌మెంట్ చూస్తున్న జనం.. నాయకులకు కంచాల నిండా పెడుతున్న తిట్లు.. తినలేనంతగా, అరిగించుకోలేనంతగా.
- ఈ తిట్లకూ పోషక విలువలు ఉంటాయంటారా?... మోదీ భాషలో ఉండవచ్చు కానీ, ప్రజల తిట్లతో బలం రాజకీయ నాయకులకు రాదు ప్రజాస్వామ్యానికి వస్తుంది.

పైగా, పైన కథలో..సాధువు క్రియేట్ చేసిన తిట్ల భూతం... న్యాయం వైపు ఉంటదని, అన్యాయం చేస్తే తింటదని చెప్పుకున్నాం కదా!

... సో తిట్లు జాగ్రత్తగా ఎంచుకొని తినండి.

ఆరోగ్య సేవల విస్తరణకే 'ఫ్యామిలీ డాక్టర్'

గ్రామాల్లో ప్రజల ఇంటి ముంగిటకే వైద్య సేవలు

- వైద్య ఆరోగ్య శాఖ సంపూర్ణ ప్రక్షాళనకే 'నాడు–నేడు'
- డబ్ల్యూహెచ్ఓ సదస్సులో వైద్య శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు


డబ్ల్యూహెచ్ఓ సదస్సుకు హాజరైన ప్రతినిధులతో ఏపీ వైద్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు

సాక్షి, అమరావతి: గ్రామస్థాయిలో వ్యక్తిగత ఆరోగ్య సేవల విస్తరణ కోసమే ఫ్యామిలీ డాక్టర్ విధానానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు అన్నారు. న్యూఢిల్లీలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల సదస్సులో ఏపీ తరఫున కృష్ణబాబు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) వ్యాప్తితో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతోందని.. వీటి కట్టడికి ఏపీలో అమలుచేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం, కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం తదితర అంశాలను వివరించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో ఏపీ జనాభా 4.1 శాతం ఉందని, ఏటా 1.1 శాతం చొప్పున పెరుగుదల నమోదవుతోందన్నారు. జాతీయ స్థాయిలో ఎన్‌సీడీ సమస్యల భారం 58 శాతం ఉండగా అది ఏపీలో 63 శాతం ఉంటోందన్నారు. దీనిని కనిష్టస్థాయికి తగ్గించడానికి కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా ఎన్‌సీడీ–సీడీ స్క్రీనింగ్ చేసి ప్రజల ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని.. వాటిని ఫ్యామిలీ డాక్టర్ యాప్‌కు అనుసంధానించి పీహెచ్‌సీ వైద్యుల ద్వారా ఫాలోఅప్ చేస్తున్నామన్నారు. ఈ స్క్రీనింగ్ 100 శాతం పూర్తిచేయడం సవాలుగా నిలుస్తోందన్నారు. దీనికి ప్రజల్లో నెలకొన్న అపోహలు ఓ కారణమన్నారు. ఈ క్రమంలో ఎన్‌సీడీ–సీడీ సమస్యలపై ప్రజల్లో విస్తృతస్థాయిలో అవగాహన కల్పించడానికి చర్యలు చేపడుతున్నామని కృష్ణబాబు వివరించారు.

ఏఎంఆర్ కట్టడికి కార్యాచరణ..

మరోవైపు.. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) కట్టడిపై విజయవాడలో శుక్రవారం ప్రారంభమైన రెండు రోజుల సదస్సులో కృష్ణబాబు న్యూఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో మాట్లాడుతూ.. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) నియంత్రణ కోసం ఏపీ సర్కార్ కార్యాచరణ రూపొందించిందని ప్రకటించారు. ఏఎంఆర్ కట్టడికి కార్యాచరణ ప్రణాళికను అమలుచేస్తున్న నాలుగో రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) ఆధ్వర్యంలో ఇండో–డచ్ ప్రాజెక్టు కింద పైలట్ ప్రాజెక్టుగా కృష్ణా జిల్లాలో ఏఎంఆర్ ప్రభావంపై 21 ఆస్పత్రుల్లో అధ్యయనం చేస్తున్నామన్నారు. ప్రిస్క్రిప్షన్ ఉంటేనే యాంటీబయోటిక్స్ విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్ఎంపీలు, ఫార్మసీలు ఇష్టమొచ్చినట్లు యాంటీబయోటిక్స్ వాడకాన్ని ప్రోత్సహించడంవల్ల వ్యాధి నిరోధకశక్తి తగ్గడంతో పాటు వివిధ ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నాయన్నారు. వైద్య విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏఎంఆర్ కట్టడికి కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. రాష్ట్రం ఆక్వా, పౌల్ట్రీ ఉత్పత్తులకు పెద్ద ఎగుమతిదారుగా ఉన్న నేపథ్యంలో యాంటీబయోటిక్స్ తగిన మోతాదులో వినియోగించేలా విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వీటివల్ల కలిగే దుష్ఫలితాలను ఐఎఫ్‌సీఏఐ ప్రెసిడెంట్ డాక్టర్ రంగారెడ్డి వివరించారు. డ్రగ్ కంట్రోల్ డీజీ రవిశంకర్ నారాయణ్ మాట్లాడుతూ.. 'ఏఎంఆర్ కార్యాచరణ బలోపేతానికి సంబంధించిన విజయవాడ డిక్లరేషన్'ను శనివారం విడుదల చేస్తామన్నారు. అలాగే, ఏపీ కార్యాచరణపై పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ప్రశంసించారు.

ఇంటి ముంగిటే వైద్యం

ఇక రాష్ట్రంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందిస్తున్నామని కృష్ణబాబు తెలిపారు. గ్రామ సచివాలయాల ప్రాతిపదికన ప్రతినెలలో రెండుసార్లు గ్రామాలను సందర్శిస్తున్నట్లు చెప్పారు. అలాగే, మంచానికి పరిమితమైన రోగుల ఇళ్లకే వైద్యులు వెళ్తున్నారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద 3,255 చికిత్సలకు ఉచితంగా సేవలందిస్తున్నామని.. అంతేకాక, శస్త్రచికిత్సల అనంతరం వైఎస్సార్ ఆసరా రూపంలో ప్రభుత్వం ఆర్థికంగా చేయూతను అందిస్తోందన్నారు. ఇక నాడు–నేడు కార్యక్రమం ద్వారా వైద్య శాఖను కూడా ప్రభుత్వం ప్రక్షాళన చేస్తోందని.. ఇందు కోసం ఏకంగా రూ.16 వేల కోట్లకు పైగా నిధులను ఖర్చుచేస్తున్నట్లు కృష్ణబాబు వివరించారు. వీటితోపాటు 17 కొత్త వైద్య కళాశాలలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు, వంటి వివిధ కార్యక్రమాలనూ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. టెలీమెడిసిన్ కార్యక్రమాన్ని అమలుచేయడం ద్వారా ప్రజలకు స్పెషలిస్ట్ వైద్య సేవలను చేరువ చేశామన్నారు. ఈ విషయంలో దేశంలోనే ఏపీ ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యశాఖ కార్యదర్శి (ఎఫ్ఏసీ) నవీన్‌కుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్ పాల్గొన్నారు.

88 పీహెచ్‌సీల నిర్మాణానికి రూ.225.32 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 88 కొత్త పీహెచ్‌సీల నిర్మాణానికి గతంలో కేటాయించిన రూ.202.76 కోట్ల నిధులను రూ.225.32 కోట్లకు పెంచుతూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. పీహెచ్‌సీ భవనానికి ప్రహరీ, అంతర్గత రోడ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టడానికి వీలుగా అదనపు నిధులు సమకూర్చినట్టు వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా మండలానికి రెండు పీహెచ్‌సీలు ఉండాలని సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా 176 కొత్త పీహెచ్‌సీల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో 88 పీహెచ్‌సీల భవన నిర్మాణాలు ప్రారంభమయ్యాయి.

రుషికొండ నిర్మాణాలన్నీ సక్రమమే

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ


రుషికొండపై నిర్మాణాలను పరిశీలిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

కొమ్మాది (భీమిలి): రుషికొండపై నిర్మిస్తున్న నిర్మాణాలన్నీ సక్రమంగానే ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ కితాబిచ్చారు. శుక్రవారం ఆయన ఇక్కడ జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. ఈ కొండపై లగ్జరీ స్థాయిలో ఫంక్షన్ హాల్, రెస్టారెంట్లు, విశాలవంతమైన విల్లాలు నిర్మిస్తున్నారన్నారు. సీఎం ప్యాలెస్ కడుతున్నారనే వార్తల్లో నిజం లేదని, ఇక్కడ నిర్మాణాలు చాలా అద్భుతంగా ఉన్నాయని, ఇవి పూర్తి అయితే విశాఖ పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అయితే వీటి నిర్మాణం కోసం పచ్చని కొండలను ధ్వంసం చేశారనే బాధ తప్ప మరే ఇబ్బంది లేదన్నారు. ఇక్కడ జరుగుతున్న నిర్మాణాలను అతి గోప్యంగా ఉంచడం వలనే లేనిపోని అపోహలు పుట్టుకొస్తున్నాయన్న విషయం స్వయంగా పరిశీలించిన తర్వాత అర్థమైందన్నారు. ఇక్కడకు ఎవ్వరిని అనుమతించక పోవడంపై అధికారులను ప్రశ్నిస్తే.. నిర్మాణాల సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అనుమతించడం లేదని తెలిపారన్నారు. మంత్రులు మిడిమిడి జ్ఞానంతో అనేక రకాలుగా మాట్లాడుతున్నారు కాబట్టే ఇక్కడ సమస్య మరింత తారస్థాయికి చేరిందని, లేకుంటే ఈ నిర్మాణాలు ప్రశాంతంగా జరిగేవని నారాయణ వివరించారు. రాష్ట్ర బాగుండాలి అంటే టీడీపీ, జనసేన, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు ఇష్టం ఉన్నా లేకపోయినా ఏకం కావల్సిందేనన్నారు. రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా



సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాజ్యాంగం ప్రకారం రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా చెప్పారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ తీరుతెన్నులను పరిశీలించారు. ఆయా కలెక్టరేట్లలో అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మారుమూల అటవీ ప్రాంతాల్లో ఉన్న సవర, గదబ తదితర ఆదివాసీల్లో, మైదాన ప్రాంతాల్లో హిజ్రాలు, నిరాశ్రయుల్లో కూడా 18 ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. వలస వెళ్లినవారు, ఒకటికి మించి ఎక్కువ చోట్ల ఓటరుగా ఉన్నవారు, మృతి చెందినవారిని గుర్తించి డబుల్ ఎంట్రీలను నిరోధిస్తామని చెప్పారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సీతానగరం మండలం లచ్చయ్యపేటలోని ప్రాథమిక పాఠశాల, విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస పంచాయతీ పరిధిలోని బొండయ్యపాలెం ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట రెండు జిల్లాల కలెక్టర్లు నిషాంత్‌కుమార్, ఎ.సూర్యకుమారి, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

వారిని ఆదివాసీల్లో చేర్చవద్దు

- గిరిజనుల భారీ శాంతియుత ర్యాలీ


మంత్రి క్యాంప్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించిన గిరిజనులు

కాశీబుగ్గ: బెంతొరియా, వాల్మీకి, బోయి కులాలను ఆదివాసీల జాబితాలో చేర్చవద్దంటూ శుక్రవారం గిరిజనులు భారీ శాంతియుత ర్యాలీ చేపట్టారు. ఆదివాసీల ఐక్య జేఏసీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కోసంగిపురం జాతీయ రహదారి వద్ద ఉదయం ర్యాలీ ప్రారంభించారు. పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల పరిధిలో ఉన్న సుమారు మూడువేల మంది గిరిజనులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ప్లకార్డులు చేతపట్టుకుని గిరిజన హక్కులు కాపాడాలని నినాదాలు చేస్తూ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. పాత జాతీయ రహదారిపై బైఠాయించి మంత్రి అప్పలరాజుకు వినతిపత్రం అందించారు. మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్తానని, బెంతొరియా, వాల్మీకి, బోయి కులస్థులు సైతం వినతిపత్రాలు అందించారని, దీనిపై ఆనంద్ కమిటీ పర్యవేక్షణ చేస్తున్నదని వివరించారు. అనంతరం కాశీబుగ్గ పెట్రోల్ బంకు మీదుగా మూడు రోడ్ల జంక్షన్‌కు చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి గిరిజన గీతాలు ఆలపించారు. పలాస ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్డీవో సీతారామయ్యకు వినతిపత్రం అందించారు. ఆల్‌ఇండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు, శ్రీకాకుళం ఆదివాసీ సంఘం ఐక్య పోరాట సమితి చైర్మన్ సవర రాంబాబు, రాష్ట్ర ఆదివాసీ సేవా ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నేతలు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకుల విద్యార్థులకు పతకాలు

- పోటీతత్వాన్ని ప్రోత్సహించేందుకు తరగతులవారీగా మెడల్స్
- జనవరి నుంచి అందిస్తామన్న మంత్రి మేరుగు నాగార్జున


విద్యార్థులకు ఇవ్వనున్న అకడమిక్, ఆల్ రౌండర్ పతకాల నమూనా



సాక్షి, అమరావతి: ఎస్సీ గురుకులాల్లో చదువు, క్రీడల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు తరగతుల వారీగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు(మెడల్స్) ఇచ్చే ప్రోత్సాహక విధానాన్ని అమలు చేయనున్నారు. వచ్చే జనవరి నుంచి ఈ పతకాలను విద్యార్థులకు అందించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున శుక్రవారం ఓ ప్రకటన ద్వారా వివరించారు. 5 నుంచి 8వ తరగతి వరకూ చదివే విద్యార్థులు సాధారణ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా, 9 నుంచి 12వ తరగతి విద్యార్థులు వారాంతపు పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఈ పతకాలు అందిస్తారు. ప్రతి తరగతిలో విద్యా విభాగంలో మూడు, క్రీడలు ఇతర విభాగాల్లో మూడు చొప్పున మొత్తం ఆరు పతకాలిస్తారు. వాటిలో రెండు స్వర్ణ, రెండు రజత, రెండు కాంస్య పతకాలుంటాయి. వారి క్లాస్ టీచర్ల ద్వారా వీటిని అందిస్తారు. అకడమిక్స్(విద్య)లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ స్టార్ పతకాలను, క్రీడలతో పాటు ఇతర అంశాల్లో అధిక మార్కులు సాధించిన వారికి ఆల్ రౌండర్ పతకాలను అందిస్తారు. ప్రతి గురుకులానికి 48 అకడమిక్, మరో 48 ఆల్ రౌండర్ పతకాలుంటాయి. రోలింగ్ విధానంలో ఇచ్చే ఈ పతకాలను ఏ వారానికి ఆ వారం ఎక్కువ మార్కులు సాధించిన వారికి బదిలీ చేస్తారు. దీనివల్ల తాము సాధించిన పతకాలను తమ వద్దే ఉంచుకోవాలన్న ఉద్దేశంతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని మంత్రి నాగార్జున పేర్కొన్నారు.

వచ్చే జనవరి నుంచి కొత్త డీఏ ఇవ్వాలని కోరాం

- సీఎం సానుకూలంగా స్పందించారు
- సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి


సీఎం జగన్‌కు సమస్యలు వివరిస్తున్న వెంకట్రామిరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఉద్యోగులకు వచ్చే జనవరి నుంచి కొత్త డీఏ ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరామని, సీఎం సానుకూలంగా స్పందించారని సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి చెప్పారు. ఆయన శుక్రవారం సీఎం జగన్‌ను కలిసిన అనంతరం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు చిన్న పంచాయతీల బాధ్యతలు అప్పగించాలని కూడా కోరామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే సర్వే ఉద్యోగులు గ్రేడ్–?ని గ్రేడ్–2కి మార్చాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. 11 వేలమంది గ్రేడ్–3 సర్వేయర్లను గ్రేడ్–2లోకి మార్చేందుకు సీఎం అంగీకరించారని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది బదిలీలకు అనుమతించాలని కోరామన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను సెప్టెంబర్‌లోనే బదిలీ చేస్తామని గతంలో హామీ ఇచ్చినట్లు సీఎంకు తెలిపామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగడం వల్ల గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది బదిలీలు ఆగాయని, ఏప్రిల్‌లో బదిలీ చేస్తామని సీఎం హామీ ఇచ్చారని ఆయన చెప్పారు. సర్వే డిపార్టుమెంట్ ఉద్యోగుల సంఘం నేత లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామ సర్వేయర్లు, వీఆర్వోల మధ్య గ్రేడ్ తేడాను సరిచేయాలని కోరగా సీఎం అంగీకరించారని తెలిపారు. గ్రేడ్–3 సర్వేయర్లను గ్రేడ్–2 సర్వేయర్లుగా మార్చేందుకు సీఎం అంగీకరించారన్నారు. సీఎం నిర్ణయంతో 10 వేలమందికిపైగా గ్రేడ్–? సర్వేయర్లు గ్రేడ్–2 సర్వేయర్లుగా మారి లబ్ధిపొందుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్(విజయవాడ)/లక్ష్మీపురం(గుంటూరు ఈస్ట్): శబరిమల అయ్యప్పస్వామిని దర్శించుకునే భక్తుల సౌకర్యం కోసం డిసెంబర్, జనవరి నెలల్లో వేర్వేరు ప్రాంతాల నుంచి విజయవాడ, గుంటూరు డివిజన్ల మీదుగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్–కొట్టాయం (07119) డిసెంబర్ 2, 9, 16, 30, జనవరి 6, 13 తేదీల్లో, కొట్టాయం–నర్సాపూర్ (07120) డిసెంబర్ 3, 10, 17, 31, జనవరి 7, 14 తేదీల్లో, హైదరాబాద్–కొల్లాం (07133) డిసెంబర్ 5, 12, 19, 26, జనవరి 2, 9, 16 తేదీల్లో, కొల్లాం–హైదరాబాద్ (07134) డిసెంబర్ 6, 13, 20, 27, జనవరి 3, 10, 17 తేదీల్లో, సికింద్రాబాద్–కొట్టాయం (07125) డిసెంబర్ 4, 11, 18, 25, జనవరి 1, 8 తేదీల్లో, కొట్టాయం–సికింద్రాబాద్ (07126) డిసెంబర్ 5, 12, 19, 26, జనవరి 2, 9 తేదీల్లో నడుస్తాయని వివరించారు.

విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం వెల్లడించారు. మచిలీపట్నం–కర్నూలు సిటీ (07067) డిసెంబర్ 1 నుంచి 31 వరకు ప్రతి శని, మంగళ, గురువారాలు, కర్నూలు సిటీ–మచిలీపట్నం (07068) డిసెంబర్ 2 నుంచి 2023 జనవరి 1 వరకు ప్రతి ఆది, బుధ, శుక్రవారాల్లో నడుస్తుంది. మచిలీపట్నం–తిరుపతి (07095) డిసెంబర్ 2 నుంచి 30 వరకు ప్రతి ఆది, సోమ, బుధ, శుక్రవారాల్లో, తిరుపతి–మచిలీపట్నం (07096) డిసెంబర్ 3 నుంచి 31 వరకు ప్రతి సోమ, మంగళ, గురు, శనివారాలు, తిరుపతి–ఔరంగాబాద్ (07637) డిసెంబర్ 4 నుంచి 25 వరకు ప్రతి ఆదివారం, ఔరంగాబాద్–తిరుపతి (07638) డిసెంబర్ 5 నుంచి 26 వరకు ప్రతి సోమవారం, తిరుపతి–సికింద్రాబాద్ (07481) డిసెంబర్ 4 నుంచి జనవరి 29 వరకు ప్రతి ఆదివారం, సికింద్రాబాద్–తిరుపతి (07482) డిసెంబర్ 5 నుంచి జనవరి 30 వరకు ప్రతి సోమవారం నడుస్తాయి. హైదరాబాద్–తిరుపతి (07643) డిసెంబర్ 5 నుంచి 26 వరకు ప్రతి సోమవారం, తిరుపతి–హైదరాబాద్ (07644) డిసెంబర్ 6 నుంచి 27 వరకు ప్రతి మంగళవారం, విజయవాడ–నాగర్‌సోల్ (07698) డిసెంబర్ 2 నుంచి 30 వరకు ప్రతి శుక్రవారం, నాగర్‌సోల్–విజయవాడ (07699) డిసెంబర్ 3 నుంచి 31 వరకు ప్రతి శనివారం, కాకినాడ టౌన్–లింగంపల్లి (07445) డిసెంబర్ 2 నుంచి 30 వరకు ప్రతి సోమ, బుధ, శుక్రవారాలు, లింగంపల్లి–కాకినాడ టౌన్ (07446) డిసెంబర్ 3 నుంచి 31 వరకు ప్రతి మంగళ, గురు, శనివారాలు, హైదరాబాద్–నర్సాపూర్ (07631) డిసెంబర్ 3 నుంచి 31 వరకు ప్రతి శనివారం, నర్సాపూర్–హైదరాబాద్ (07632) డిసెంబర్ 4 నుంచి జనవరి 1 వరకు ప్రతి ఆదివారం, విశాఖపట్నం–మహబూబ్‌నగర్ (08585) డిసెంబర్ 6, 13, 20, 27 తేదీల్లో, మహబూబ్‌నగర్–విశాఖపట్నం (085856) డిసెంబర్ 7, 14, 21, 28 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడుస్తాయి.

అన్నింటా సమానత్వమే రాజ్యాంగ లక్ష్యం

- గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా


ప్రసంగిస్తున్న సిసోడియా

ఏఎన్‌యూ: సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలన్నింటిలో సమానత్వమే భారత రాజ్యాంగ లక్ష్యమని ఏపీ గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టర్ అంబేడ్కర్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన 'భారత రాజ్యాంగ దినోత్సవ' ముందస్తు వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఒకే సంస్కృతి, మతం ఉన్న పాకిస్తాన్ వంటి దేశంలో రాజ్యాంగం విఫలమైందని, విభిన్న సంస్కృతులు, మతాలు ఉన్న భారత్‌లో మాత్రం రాజ్యాంగం విజయవంతం అయ్యిందని చెప్పారు. భిన్నత్వంలోనూ ఐక్యత మన రాజ్యాంగం, జాతి విశిష్టత అన్నారు. ఏ దేశానికైనా రాజ్యాంగం అనేది అత్యంత ప్రధాన పత్రమన్నారు. రాజ్యాంగం నుంచి జాతి మంచి, చెడు ఫలితాలు ఏవి రావాలన్నా అవి మనపైనే ఆధారపడి ఉంటాయని చెప్పారు. రాజ్యాంగ లక్ష్య సాధనలో సోషల్ రీ ఇంజనీరింగ్ చాలా కీలకమని చెప్పారు. వర్సిటీ వీసీ ఆచార్య రాజశేఖర్ ప్రసంగిస్తూ మత రహిత విలువలు పెంపొందించడంలో రాజ్యాంగం కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు.

గోదావరి ఫుడ్‌పార్క్ ఉద్యమ కేసులు ఎత్తివేయండి

- సీఎం వైఎస్ జగన్‌కు సీపీఎం సీనియర్ నేత మధు లేఖ

సాక్షి, అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా తుందుర్రులోని గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్క్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ప్రజలు, నాయకులపై గత ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తివేయాలంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సీపీఎం సీనియర్ నేత పెనుమల్లి మధు శుక్రవారం ఓ లేఖ రాశారు. గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్క్(తుందుర్రు)తో గాలి, మంచినీటి చెరువులు, పంట పొలాలు పూర్తిగా కాలుష్యమయం అవుతాయని గతంలో ప్రజలు పెద్దఎత్తున ఆందోళన చేశారని పేర్కొన్నారు. అప్పట్లో 28 పోలీసు కేసులు బనాయించారని తెలిపారు. దీంతో 280 మంది రైతులు, మహిళలు మూడున్నర సంవత్సరాలుగా కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తోందని వివరించారు. ఈ నెల 24న తాను కూడా కోర్టుకు హాజరయ్యానని, ప్రతిపక్ష నేతగా మీరిచ్చిన హామీ మేరకు కేసులు ఎత్తివేయాలని మధు లేఖలో కోరారు. భరించరాని కాలుష్యం వెదజల్లుతున్న మెగా ఫుడ్ పార్క్‌ను మూసివేయడమో, వేరేచోటకు తరలించడమో చేయాలని సీఎం వైఎస్ జగన్‌కు సీపీఎం నేత మధు విజ్ఞప్తి చేశారు.

పట్టభద్రుల, టీచర్స్ నియోజకవర్గాల తుది ఓటర్ల జాబితా బహిర్గతం చేయాలి..

ఎన్నికల కమిషన్ ప్రకటించిన పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల తుది ఓటర్ల జాబితాను బహిరంగ పర్చాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు, కె.ప్రభాకరరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కమిషన్ శుక్రవారం నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశానికి హాజరైన వారు ముఖేష్‌కుమార్ మీనాకు రాసిన వినతిపత్రాన్ని డిప్యూటీ సెక్రటరీ ఎ.వెంకటేశ్వరరావుకు అందజేశారు.

'జయలక్ష్మి' కార్యకలాపాలు పున:ప్రారంభం

కాకినాడ రూరల్: కాకినాడ జిల్లా సర్పవరం జంక్షన్ ప్రధాన బ్రాంచ్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 29బ్రాంచ్‌లు కలిగిన జయలక్ష్మి మ్యూచువల్లీ ఎయిడెడ్ మల్టీపర్పస్ కో–ఆపరేటివ్ సొసైటీలో అవకతవకల కారణంగా నిలిచిపోయిన కార్యకలాపాలు 9నెలల అనంతరం పునఃప్రారంభం కానున్నాయి. కేసు దర్యాప్తులో భాగంగా అన్ని బ్రాంచ్‌లకు తాళాలు వేసి, రికార్డులు తమ స్వాధీనంలోకి తీసుకున్న సీఐడీ అధికారులు శుక్రవారం సర్పవరం జంక్షన్ మెయిన్ బ్రాంచ్ తాళాలు అప్పగించారు. దీంతో కార్యకలాపాలను ప్రారంభించేందుకు నూతన పాలకవర్గం కసరత్తు ప్రారంభించింది. సుమారు 20వేల మంది సభ్యులు కలిగిన జయలక్ష్మి ఎంఏఎం సొసైటీలో భారీగా అవకతవకలకు పాల్పడిన గత పాలకవర్గం బోర్డు తిప్పేసిన సంగతి విదితమే. ఈ ఉదంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకోవడంతో కేసు దర్యాప్తు చేపడుతున్న సీఐడీ అధికారులు నిందితుల్లో కీలకమైన చైర్మన్, వైస్ చైర్మన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు, మరో డైరెక్టర్‌ను అరెస్టు చేశారు. మరో వైపు శాఖాపరంగా ఐదుగురు సభ్యుల సహకార ఉద్యోగుల కమిటీ విచారణ పూర్తిచేసి రూ.522కోట్ల మేర డిపాజిట్లు ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదించింది. కాగా, కొత్త పాలకవర్గం ద్వారా కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు చైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు, డైరెక్టర్ల అభ్యర్థన మేరకు సహకార శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు కార్యకలాపాలకు అనుమతిచ్చారు.

అనుమతి లేకుండా...
అమితాబ్ పేరు వాడొద్దు
ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఆదేశాలు



న్యూఢిల్లీ: బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ పేరు, స్వరం, ఫొటోలు, ఆయనకు సంబంధించిన క్లిప్పింగ్‌లను ఎవరూ అనధికారికంగా వాడరాదంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఒక ప్రముఖుడిగా తన ప్రచార హక్కులకు భంగం కలిగిస్తూ 'కేబీసీ లాటరీ' నిర్వాహకుడు సహా పలువురు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ అమితాబ్ వేసిన పిటిషన్‌పై విచారణ శుక్రవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. పేరుప్రఖ్యాతులున్న బచ్చన్‌కు ఈ దశలో ఉపశమనం కల్పించకపోతే తీవ్ర నష్టాన్ని, చెడ్డపేరును చవిచూసే అవకాశం ఉందని ఈ సందర్భంగా జస్టిస్ నవీన్ చావ్లా పేర్కొన్నారు. విచారణను వచ్చే ఏడాది మార్చికి వాయిదా వేశారు.

క్లుప్తంగా...

ఆనంద్ తెల్తుంబే బెయిల్‌పై జోక్యం చేసుకోలేం: సుప్రీం
న్యూఢిల్లీ: ఎల్గార్ పరిషత్–మావోయిస్టు లింకుల కేసులో ఆనంద్ తెల్తుంబే (73)కు బెయిల్ ఇవ్వడాన్ని సవాల్ చేసిన ఎన్ఐఏకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు మంజూరైన బెయిల్ విషయంలో జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో ఆయనపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం అమలుకు ప్రత్యేకమైన కారణాలేవీ కనిపించడం లేదంటూ పిటిషన్‌ను కొట్టేసింది.

'విప్రో' అజీం ప్రేమ్‌జీకి యశ్వంత్‌రావ్ చవాన్ అవార్డు
ముంబై: విప్రో వ్యవస్థాపక చైర్మన్ అజీం ప్రేమ్‌జీ ప్రతిష్టాత్మక యశ్వంత్‌రావ్ చవాన్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రజాస్వామిక విలువలను పరిరక్షిస్తూ సమాజానికి విలువైన సేవలందించిన వ్యక్తులకు ఈ అవార్డును అందజేస్తారు. చవాన్ రాష్ట్ర స్థాయి అవార్డును మరాఠీ సాహితీవేత్త మంగేష్ కార్నిక్‌కు ప్రకటించారు. ఒకప్పటి బాంబే రాష్ట్రానికి, మహారాష్ట్రకు మొట్టమొదటి సీఎంగా పనిచేసిన యశ్వంత్‌రావ్ చవాన్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఈ అవార్డులను ప్రకటించారు.

ఇమ్రాన్‌కు ప్రాణహాని
ఇస్లామాబాద్: మాజీ ప్రధాని, పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్(పీటీఐ) చీఫ్ ఇమ్రాన్‌ఖాన్‌కు ఉగ్రవాదుల నుంచి ప్రాణహాని ఉందని పాక్ ప్రభుత్వం పేర్కొంది. శనివారం రావల్పిండిలో తలపెట్టిన ర్యాలీకి దూరంగా ఉండాలని కోరింది. ప్రమాదముందని తెలిసీ ర్యాలీ కొనసాగించడంలో అర్థం లేదని అంతరంగిక శాఖ మంత్రి రానా సనవుల్లా అన్నారు. అయితే, ర్యాలీ కొనసాగుతుందని పీటీఐ పేర్కొంది. నవంబర్ 3న ర్యాలీలో దుండగుని కాల్పుల్లో గాయపడ్డ ఇమ్రాన్ ఆస్పత్రిలో కోలుకుంటున్నారు.

నేపాల్‌లో మెజారిటీ దిశగా... అధికార సంకీర్ణం
కఠ్మాండు: నేపాల్ పార్లమెంట్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికార నేపాలీ కాంగ్రెస్(ఎన్సీ) సారథ్యంలోని సంకీర్ణం స్పష్టమైన మెజారిటీ సాధించేలా ఉంది. ఫలితాలు ప్రకటించిన 124 స్థానాల్లో కూటమికి 67 దక్కాయి. ఇందులో 42 స్థానాలను ఎన్సీ సొంతంగా సాధించింది. మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీకి చెందిన సీపీఎన్–యూఎంఎల్ నేతృత్వంలోని విపక్ష కూటమికి 38 స్థానాలు దక్కాయి. ఇందులో సీపీఎన్–యూఎంఎల్ సొంతంగా 30 సీట్లు గెలుచుకుంది. 275 మంది సభ్యుల ప్రతినిధుల సభలో 165 మందిని ప్రత్యక్ష ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారు. మిగతా 110 సీట్లకు దామాషా విధానంలో ఎన్నిక జరుగుతుంది. ప్రభుత్వ ఏర్పాటుకు 138 సీట్లు అవసరం.

2025-26 నాటికి వందేభారత్ రైళ్ల ఎగుమతి!
న్యూఢిల్లీ: దేశీయంగా రూపొందించిన అత్యాధునిక వందేభారత్ రైళ్లను 2025–26 నాటికి యూరప్, దక్షిణ అమెరికా, తూర్పు ఆసియా దేశాలకు ఎగుమతి చేయాలని భావిస్తున్నట్లు రైల్వే శాఖ సీనియర్ అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు. ''స్లీపర్ కోచ్‌లతో కూడిన వందేభారత్ రైళ్లు 2024 తొలి త్రైమాసికంలో అందుబాటులోకి వస్తాయి. వచ్చే మూడేళ్లలో 475 వందేభారత్ రైళ్లను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం'' అని వివరించారు.

కేజ్రీవాల్ హత్యకు బీజేపీ కుట్ర
ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి సిసోడియా



న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ హత్యకు బీజేపీ కుట్ర పన్నిందని ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా శుక్రవారం ఆరోపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తుకు డిమాండ్ చేశారు. బీజేపీ కుట్రపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ''కేజ్రీవాల్‌ను బీజేపీ నేత, ఢిల్లీ ఎంపీ మనోజ్ తివారీ బహిరంగంగా హెచ్చరించారు. ఆయన హత్యకు కుట్ర పన్నినట్లు దాన్నిబట్టి తెలుస్తోంది. తివారీని అరెస్టు చేయాలి'' అన్నారు. సిసోడియా ఆరోపణలపై విచారణకు పోలీసులను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆదేశించినట్టు తెలిసింది.

పాత స్క్రిప్ట్ చదువుతున్నారు: తివారీ
సిసోడియా మనోజ్ తివారీ కొట్టిపారేశారు. కేజ్రీవాల్ హత్యకు కుట్ర అంటూ సిసోడియా పాత మర్డర్ స్క్రిప్ట్ చదువుతున్నారని ఎద్దేవా చేశారు.

ఫలితమూ మధ్యంతరమే

ఆసక్తికరంగా అమెరికా మధ్యంతర ఫలితాలు
- పనితీరు బాగాలేకున్నా పరువు దక్కించుకున్న అధికార డెమొక్రాట్లు
- బైడెన్ వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడంలో విఫలమైన రిపబ్లికన్లు
- వారి పాలిట వదిలించుకోవాల్సిన భారంగా మారిన డొనాల్డ్ ట్రంప్



ఎస్.రాజమహేంద్రారెడ్డి

అమెరికాలో ఇటీవల జరిగిన మధ్యంతర ఎన్నికలతో లాభపడింది ఎవరు? హోరాహోరీగా తలపడిన వైరిపక్షాలు డెమొక్రాట్లు, రిపబ్లికన్లు తమ లక్ష్యాన్ని చేరాయా అంటే కచ్చితంగా లేదనే చెప్పాలి. డెమొక్రాట్లకు చావు తప్పి కన్ను లొట్టబోతే, రిపబ్లికన్లు నిక్కుతూ నీలుగుతూ మునిగిపోయే నావనుంచి చివరి నిమిషంలో బయటపడి అతికష్టం మీద ఊపిరి పీల్చుకున్నారు. అంతో ఇంతో జనాలే లాభపడ్డారు. పాలకపక్షం తన ఎజెండాను బలవంతంగా తమపై రుద్దే ప్రమాదం నుంచి ప్రజలు ఒకరకంగా బయటపడ్డారనే చెప్పుకోవాలి. రాష్ట్రానికి ఇద్దరు చొప్పున వంద మంది సభ్యులుండే సెనేట్‌పై అధికార డెమొక్రాట్ పార్టీ ఒకే ఒక్క సీటు ఆధిక్యంతో పట్టు నిలబెట్టుకుంది. 435 మంది సభ్యులుండే ప్రతినిధుల సభలో విపక్ష రిపబ్లికన్ పార్టీ 221 సీట్లలో నెగ్గి ఆధిక్యం ప్రదర్శించింది. డెమొక్రాట్లు 213 సీట్లతో సరిపెట్టుకున్నారు. అంటే ఆ పార్టీకి చెందిన అధ్యక్షుడు జో బైడెన్ ఇకపై ఏకపక్ష నిర్ణయాలు తీసుకునే అవకాశం ఎంత మాత్రం ఉండదు. ప్రజలకు నచ్చని ఏ నిర్ణయాన్నైనా రిపబ్లికన్లు ప్రతినిధుల సభలో అడ్డుకుని తీరతారు. ఇకపై ప్రజలకు అనుకూలంగా ఉండే, వారికి లబ్ధి చేకూర్చే నిర్ణయాలే చట్టాలవుతాయి. అమలవుతాయి. కాదు, కూడదు అంటే రిపబ్లికన్ల నుంచి బైడెన్‌కు తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఎదురవడం ఖాయం.

నెత్తిన పాలు పోసిన ట్రంప్
ఈ మధ్యంతర ఎన్నికలకు ముందు ఎర్ర (రిపబ్లికన్ పార్టీ) గాలి కాస్త గట్టిగానే వీచింది. అది తుఫాన్‌లా మారి డెమొక్రాట్లను తుడిచిపెట్టడం ఖాయమనుకున్నారు. డెమొక్రాట్లకు సెనేట్లో పరాభవం తప్పదని, ప్రతినిధుల సభలోనూ భారీగా సీట్లు కోల్పోతారని పరిశీలకులు అంచనా వేశారు. బైడెన్ ఇరకాటంలో పడతారని భావించారు. కానీ ఫలితాలు అందుకు విరుద్ధంగా వచ్చాయి. డెమొక్రాట్లు ఫర్వాలేదనిపించారు. బైడెన్ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇదంతా బైడెన్‌పై సానుకూలత కాదని, రిపబ్లికన్లను ఇప్పటికీ శాసిస్తున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఉన్న వ్యతిరేకత అని రాజకీయ పండితులు తేల్చారు. 'అమెరికా ఫస్ట్' అంటూ గొప్పలకు పోయిన ట్రంప్ అధ్యక్షునిగా ఉండగా ప్రదర్శించిన దూకుడు, నాలుగేళ్ల పాలనలో తీసుకున్న ఒంటెత్తు నిర్ణయాలు 2020లో ఆయన ఓటమికి దారి తీయడం తెలిసిందే. ఇప్పుడు మధ్యంతరంలోనూ ట్రంప్ నీడ ఓటర్లను బాగా భయపెట్టింది. అందుకే, భారీ మెజార్టీ ఖాయమనుకున్న రిపబ్లికన్ పార్టీ కాస్తా ప్రతినిధుల సభను కేవలం అత్తెసరు ఆధిక్యంతో మాత్రమే గెలుచుకోగలిగింది. సెనేట్‌పై పట్టు బిగించడంలో విఫలమైంది. ట్రంప్‌కు రిపబ్లికన్లు ఇక స్వస్తి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నది పరిశీలకుల అభిప్రాయం. 2024 అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిని తానేనని ఇప్పట్నుంచే బాహాటంగా చెప్పుకుంటున్న ఆయనను నిలువరిస్తేనే పార్టీ పరిస్థితి బాగుపడుతుందన్న చర్చ కూడా ఊపందుకుంది.

అధికార పక్షాలకు ఎదురుగాలే...!
అధికార పార్టీ మధ్యంతర ఎన్నికల్లో భారీగా సీట్లను కోల్పోయినట్టు గత రెండు ఫలితాలు చెబుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక మధ్యంతరంపై ప్రభావం చూపడం ఆనవాయితీగా వస్తోంది. 2014 మధ్యంతరంలో నాటి అధ్యక్షుడు బరాక్ ఒబామా నేతృత్వంలో డెమొక్రాట్ పార్టీ సెనేట్లోనూ, ప్రతినిధుల సభలోనూ భారీగా సీట్లు కోల్పోయింది. 2018లో ట్రంప్ హయాంలో అధికార పార్టీగా రిపబ్లికన్లు సెనేట్లో కాస్త పర్వాలేదనిపించినా సభలో మాత్రం ఏకంగా 42 సీట్లు కోల్పోయి ఘోరంగా దెబ్బ తిన్నారు! తాజా మధ్యంతరంలోనూ రిపబ్లికన్ పార్టీ విపక్షంలో ఉండి కూడా జనాల్లో ఉన్న ట్రంప్ వ్యతిరేకత పుణ్యమా అని ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసుకోలేకపోయింది!! సెనేట్‌ను చేజార్చుకోవడమే గాక ప్రతినిధుల సభలోనూ అత్తెసరు ఆధిక్యంతోనే సరిపెట్టుకుంది!

మధ్యంతరాలు ఇలా...

	ప్రతినిధుల సభ		సెనేట్	
	2012	*2014	2012	*2014
రిపబ్లికన్లు	234	247 (+13)	46	54 (+8)
డెమొక్రాట్లు	201	188 (-13)	54	46 (-8)

అధికార పార్టీ -డెమొక్రాటిక్ అధ్యక్షుడు-బరాక్ ఒబామా

	ప్రతినిధుల సభ		సెనేట్	
	2016	*2018	2016	*2018
డెమొక్రాట్లు	194	235 (+41)	47	45 (-2)
రిపబ్లికన్లు	241	199 (-42)	51	53 (+2)

అధికార పార్టీ -రిపబ్లికన్ అధ్యక్షుడు-డొనాల్డ్ ట్రంప్

	ప్రతినిధుల సభ		సెనేట్	
	2020	*2022	2020	*2022
రిపబ్లికన్లు	211	221 (+10)	50	49 (-1)
డెమొక్రాట్లు	222	213 (-9)	48	50 (+2)

అధికార పార్టీ-డెమొక్రాటిక్ అధ్యక్షుడు-బైడెన్

(*మధ్యంతర ఎన్నికల ఫలితం)


మన మాదిరిగా కాదు...
మన దగ్గర మధ్యంతర ఎన్నికలంటే అదేదో అరుదైన విశేషంగా కనిపిస్తుంది. అంచనాలు, లెక్కలు వేగంగా మారిపోతుంటాయి. అధికార పక్షం మళ్లీ అధికారంలోకి వస్తుందా, లేక ప్రతిపక్షానికి దాసోహమంటుందా అన్నదే చర్చనీయాంశమవుతుంది. ఫలితాలను బట్టి పాలకపక్షంతో పాటు పాలకుడూ మారవచ్చు, మారకపోనూ వచ్చు. కానీ చట్టసభలో సభ్యులు మాత్రం కచ్చితంగా మారతారు. మళ్లీ గెలిచే సిట్టింగులు తప్ప మొత్తమ్మీద కొత్త ప్రభుత్వం, కొత్త మంత్రివర్గం... ఇలా కొద్దిరోజులు హంగామా, హడావుడి ఉంటాయి. కానీ అమెరికా మధ్యంతరం మరో విధంగా ఉంటుంది. ప్రత్యక్ష విధానంలో నాలుగేళ్ల పదవీకాలానికి అధ్యక్ష ఎన్నిక జరిగిన రెండేళ్లకు వచ్చే ఎన్నికలు గనుక వీటిని మధ్యంతరం (మిడ్ టర్మ్) అంటారు. ఇందులో ప్రతినిధుల సభలోని మొత్తం 435 సీట్లకు, సెనేట్‌లో మొత్తం వంద స్థానాలకు గాను 35 సీట్లకు ఎన్నికలు జరుగుతాయి. మధ్యంతర ఫలితమేలా ఉన్నా ప్రత్యక్ష విధానంలో ఎన్నికైన అధ్యక్షుడు మారడు. మిగతా రెండేళ్లు పదవిలో కొనసాగుతాడు. పాలక పక్షమూ మారదు. మంత్రివర్గమూ యథాతథంగా కొనసాగుతుంది. అధికారమైతే ఉంటుంది. కానీ చట్టసభల్లో ఆధిక్యం కోల్పోతే ఆ ప్రభావం అధికార నిర్ణయాల అమలుపై పడుతుంది. 2020లో బైడెన్ అధ్యక్ష పదవి చేపట్టి ఈ నవంబర్‌తో రెండేళ్లవడంతో మధ్యంతర ఎన్నికలు జరిగాయి. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ఒకరకంగా అధ్యక్షుని రెండేళ్ల పాలనకు రెఫరెండం వంటివి. అలాగే మిగతా రెండేళ్ల పదవీకాలంలో పనితీరు మార్చుకోవడానికి ఓ మంచి అవకాశం కూడా. అధ్యక్షునికి మరోసారి పోటీ చేసే అవకాశముంటే ఈ అనుభవం చక్కని పెట్టుబడి అవుతుంది. అమెరికాలో ఒక వ్యక్తి గరిష్ఠంగా రెండు సార్లు మాత్రమే అధ్యక్ష పదవి చేపట్టవచ్చన్నది తెలిసిందే.

డెమొక్రాట్ల గ్రాఫ్ ఎందుకు పడిపోయింది?



నిజానికి పడిపోయింది డెమొక్రాట్ పార్టీ గ్రాఫ్ కాదు. అధ్యక్షునిగా బైడెన్ ప్రజాదరణే నానాటికీ తగ్గుతూ వస్తోంది. మధ్యంతరం నాటికి రెండేళ్లలో దేశానికి ఆయన చేసిందేమీ లేదన్న అభిప్రాయం ప్రజల్లో నాటుకుపోయింది. ద్రవ్యోల్బణం 40 ఏళ్ల గరిష్టానికి చేరింది. ధరలు ఆకాశాన్నంటాయి. పెట్రో రేట్ల పెరుగుదల వీటికి ఆజ్యం పోసింది. కరోనా వ్యాప్తిని అరికట్టలేకపోవడం ఒకెత్తైతే, దానివల్ల తలెత్తిన నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో వైఫల్యం బైడెన్‌పై వ్యతిరేకతను మరింత పెంచింది. నేరాల సంఖ్యా, తూటాల వికటాట్టహాసమూ పెరిగాయి. దౌత్యపరంగా కూడా అఫ్గానిస్తాన్ నుంచి సేనల ఉపసంహరణ తొందరపాటు చర్యగా మిగిలింది. రష్యా, చైనాలతో ద్వైపాక్షిక సంబంధాలు మరింత దిగజారాయి. మీడియాతో బైడెన్ అంటీముట్టనట్టుగా వ్యవహరించడమూ సగటు అమెరికన్‌కు రుచించలేదు. ఇన్ని మైనస్‌పాయింట్లున్నా ఆయన నేతృత్వంలోని డెమొక్రాట్‌పార్టీ సెనేట్‌లో స్వల్ప ఆధిక్యం నిలుపుకోవడం, ప్రతినిధుల సభలో ప్రత్యర్థికి స్వల్ప ఆధిక్యం మాత్రమే ఇవ్వడం విశేషమే. బైడెన్‌పై కన్నా ట్రంప్ దూకుడుపై జనాల్లో రెండింతల వ్యతిరేకత ఉందని మధ్యంతర ఫలితాలు రుజువు చేశాయి.

అనుకూలతను సొమ్ముచేసుకోలేక



అనుకూల పవనాలను సొమ్ము చేసుకుంటూ ప్రభుత్వ వ్యతిరేకతను ఉభయ సభల్లో ఆధిక్యంగా మార్చుకోవడంలో రిపబ్లికన్ పార్టీ ఘోరంగా విఫలమైంది. ట్రంప్‌పై ఉన్న వ్యతిరేకత రిపబ్లికన్ అభ్యర్థుల గెలుపోటములను తీవ్రంగా ప్రభావితం చేసింది. ట్రంప్ చాలాచోట్ల తన వీర విధేయులనే బరిలోకి దించడంతో భారీ ఆధిక్యం రావాల్సింది కాస్తా స్వల్ప ఆధిక్యానికి పరిమితమైంది. ఒకట్రెండు చోట్ల మినహా ట్రంప్ సొంత అభ్యర్థులంతా పరాజయం పాలయ్యారు. ట్రంప్ నీడ పడకుండా స్వతంత్రంగా బరిలో దిగిన రిపబ్లికన్ అభ్యర్థులు విజయ బావుటా ఎగరేశారు. ట్రంప్ అభ్యర్థులుగా సెనేట్‌కు పోటీ చేసిన డాక్టర్ ఓజ్ (పెన్సిల్వేనియా), హెర్షల్ వాకర్ (జార్జియా) వంటి ఉద్దండులు కూడా మట్టికరవడం విశేషం. ట్రంప్‌పై అసంతృప్తితో ఉన్న జనం వేరే మార్గం లేక ప్రత్యామ్నాయ అభ్యర్థులకు ఓటేయాల్సి వచ్చింది.

ఆశాదీపం డిశాంటిస్...?!



ట్రంప్ స్వరాష్ట్రమైన ఫ్లోరిడాలో ఆయన వైఖరిని బాహాటంగా ఎండగట్టిన రిపబ్లికన్ రాన్ డిశాంటిస్ గవర్నర్‌గా నెగ్గడం ఈ మధ్యంతర ఎన్నికల హైలైట్‌గా చెప్పవచ్చు. ట్రంప్ వ్యతిరేక పవనాలకు ఇది మచ్చుతునక. ఒకరకంగా వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో డిశాంటిస్ రూపంలో రిపబ్లికన్లకు కొత్త అభ్యర్థి దొరికినట్టే. మరోవైపు ఈ మధ్యంతరం రిపబ్లికన్లకు ఓ గుణపాఠం లాంటిది. అధికార పార్టీ పనితీరుపై రోజురోజుకూ అసంతృప్తి పెరుగుతున్న నేపథ్యంలో దేశమంతా రిపబ్లికన్ పార్టీకి అనుకూల పవనాలు వీచినా దాన్ని ట్రంప్ నీడే వెంటాడింది. అందుకు తగిన మూల్యమూ చెల్లించుకుంది. మధ్యంతర ఎన్నికల్లో ఫలితం కూడా అటూ ఇటూ కాకుండా మధ్యంతరంగానే వచ్చింది! బహుశా ఈ ఫలితాలతో అమెరికా రాజకీయాల్లో ట్రంప్ హవా ముగిసినట్టే!

తప్పిదాలను సరిచేసుకుంటున్నాం

దేశ చరిత్రలో కుట్రపూరిత రాతలు
అహోం యోధుడు లచిత్ బర్ఫూకన్ 400వ జయంతి వేడుకల్లో మోదీ



న్యూఢిల్లీ: ''గుర్తింపుకు నోచుకోని యోధులను, అమర వీరులను భారత్ ఇప్పుడు స్మరించుకుంటోంది. తద్వారా పాత తప్పిదాలను సరి చేసుకుంటోంది. తన ఘన వారసత్వాన్ని పండుగలా జరుపుకుంటోంది'' అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వలస పాలనలో రచించిన కుట్రపూరిత చరిత్ర వల్ల మన యోధులకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు. 1670ల్లో మొఘల్ సైన్యంపై పోరాడిన అహోం (అస్సాం) సైనికాధికారి లచిత్ బర్ఫూకన్ 400వ జయంతి వేడుకలు శుక్రవారం ఢిల్లీలో జరిగాయి. వాటిలో మోదీ ప్రసంగించారు. ''దేశ చరిత్రంటే కేవలం బానిసత్వం గురించే కాదు. వీర సైనికుల పోరాటాలు, త్యాగాలు కూడా. చరిత్రంటే కొన్ని దశాబ్దాలు, శతాబ్దాల పరిణామాలు మాత్రమే కాదు. నిరంకుశత్వం, దౌర్జన్యాలపై అసమాన ధైర్య సాహసాలతో జరిపిన పోరాటమే మన చరిత్ర'' అన్నారు.

దేశం కంటే ఏ బంధమూ గొప్ప కాదు
స్వాతంత్ర్యానంతరం కూడా వలసవాద భావజాలం కొనసాగిందని, చరిత్రను కుట్రపూరితంగా లిఖించడం దురదృష్టకరమని మోదీ అన్నారు. ''రక్త సంబంధం కంటే జాతి ప్రయోజనాలే ముఖ్యమని లచిత్ భావించారు. తప్పు చేస్తే దగ్గరి బంధువులనూ శిక్షించారు. కుటుంబాన్ని, కుటుంబ వారసత్వాన్ని పక్కనపెట్టి దేశం కోసం నిస్వార్థంగా పని చేయాలని గొప్ప సందేశమిచ్చారు. దేశ ప్రయోజనాల కంటే ఏ బంధమూ గొప్ప కాదని ఆయన జీవితం బోధిస్తోంది'' అన్నారు.

చిన్నారులతో ప్రచారం
మోదీపై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

గుజరాత్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ చిన్న పిల్లలను వాడుకుంటున్నారంటూ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. బీజేపీ తరఫున ప్రచారం చేస్తున్నట్లున్న ఓ చిన్నారి వీడియోను ప్రధానితోపాటు, కేంద్ర మంత్రులు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంపై పార్టీ ప్రతినిధి బృందం ఈసీని కలిసింది. ''ఇది పిల్లల హక్కులకు భంగం కలిగించడమే. తీవ్రమైన అంశమైనందున బాధ్యులపై చర్యలు తీసుకోండి'' అ ని కోరింది.

తిరగదోడకండి

నోట్ల రద్దుపై సుప్రీంలో కేంద్రం
- కాలాన్ని వెనక్కు తిప్పలేం: ఏజీ
- ప్రక్రియపైనే అభ్యంతరం: కోర్టు
- స్పష్టత ఇవ్వాలని సూచన



న్యూఢిల్లీ: సంచలనానికి, దేశవ్యాప్త ప్రభావానికి దారితీసిన నోట్ల రద్దు నిర్ణయంపై సుప్రీంకోర్టు విచారణను కేంద్రం వ్యతిరేకిస్తోంది. ఆ నిర్ణయాన్ని తిరగదోడేందుకు ప్రయత్నించొద్దని శుక్రవారం కోర్టుకు సూచించింది. ''ఈ విషయంలో ఇప్పుడు కోర్టు చేయగలిగిందేమీ లేదు. ఎందుకంటే కాలాన్ని వెనక్కు తిప్పలేం. పగలగొట్టి గిలక్కొట్టిన గుడ్డును మళ్లీ యథారూపానికి తేలేం'' అని కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి పేర్కొన్నారు. కార్యనిర్వాహక పరమైన నిర్ణయంపై న్యాయ సమీక్షకు కోర్టు దూరంగా ఉండాలని సూచించారు. దాంతో, నోట్ల రద్దు నిర్ణయం తీసుకునే ముందు ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డును సంప్రదించారా అని ధర్మాసనం ప్రశ్నించింది. ''ఇవన్నీ నిపుణులు చూసుకునే ఆర్థికపరమైన అంశాలు గనుక వాటిని ముట్టుకోరాదన్నది మీ వాదన. ఈ నిర్ణయం ద్వారా అభిలషించిన లక్ష్యాలను సాధించామనీ మీరు చెబుతున్నారు. కానీ పిటిషనర్ల వాదనపై మీ వైఖరేమిటి? నోట్ల రద్దు నిర్ణయం ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్‌కు 26(2)కి అనుగుణంగా లేదని వారంటున్నారు. మీరనుసరించిన ప్రక్రియ లోపభూయిష్టమన్నది ఆరోపణ. దానికి బదులు చెప్పండి'' అని ఏజీకి సూచించింది.నోట్ల రద్దును సవాలు చేస్తూ దాఖలైన 58 పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎ.నజీర్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఎ.ఎస్.బొపన్న, జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ బి.వి.నాగరత్న ఉన్నారు. నోట్ల రద్దు కేవలం ఓ స్వతంత్ర ఆర్థిక విధానపరమైన నిర్ణయం కాదని ఏజీ బదులిచ్చారు. ''అదో సంక్లిష్టమైన ద్రవ్య విధానంలో భాగం. ఆర్‌బీఐ పాత్ర కాలానుగుణంగా పెరుగుతూ వచ్చింది. అంతేగాక, ప్రయత్నం విఫలమైనంత మాత్రాన దాని వెనక ఉద్దేశం లోపభూయిష్టమని విజ్ఞులెవరూ అనరు. అది సరికాదు కూడా'' అని వాదించారు. జస్టిస్ గవాయ్ బదులిస్తూ, పిటిషన్‌దారుల అభ్యంతరాలు కరెన్సీకి సంబంధించిన విస్తృతమైన అన్ని అంశాలకు సంబంధించినవన్నారు. ''ద్రవ్య విధాన పర్యవేక్షణ పూర్తిగా ఆర్‌బీఐకి మాత్రమే సంబంధించినది. ఇందులో మరో మాటకు తావు లేదు'' అన్నారు. కానీ ఆర్‌బీఐ తన సొంత బుర్రను ఉపయోగించి స్వతంత్రంగా పని చేయాలన్న పిటిషనర్ల వాదన సరికాదని ఏజీ స్పష్టం చేశారు. ఆర్‌బీఐ, కేంద్రం కలసికట్టుగా పని చేస్తాయన్న వాస్తవాన్ని గుర్తుంచుకోవాలన్నారు. దీనితో జస్టిస్ నాగరత్న విభేదించారు. ''ఆర్‌బీఐ సిఫార్సులకు కేంద్రం కట్టుబడి ఉండాల్సిందేనని మేమనడం లేదు. కానీ ఈ విషయంలో ఆర్‌బీఐ పాత్ర ఎక్కడుందన్నదే ఇక్కడ ప్రధాన అభ్యంతరం'' అని చెప్పారు.

మార్చుకునే చాన్సే ఇవ్వలేదు!
పాత నోట్ల మార్పిడికి తన క్లయింట్‌కు అవకాశమే ఇవ్వలేదని ఒక పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ వాదించారు. ''2016 డిసెంబర్ 30 డెడ్‌లైన్ తర్వాత కూడా పాత నోట్లు మార్చుకోవచ్చని ఆర్‌బీఐతో పాటు ప్రధాని కూడా ముందుగా ప్రకటించారు. కానీ 2016 డిసెంబర్ 30 తర్వాత పాత నోట్ల మార్పిడి కుదరదంటూ తర్వాత ఆర్డినెన్స్ తెచ్చారు. నా క్లయింటేమో ఆ ఏడాది ఏప్రిల్లోనే విదేశాలకు వెళ్లి 2017 ఫిబ్రవరి 3న తిరిగొచ్చారు. తర్వాత తన దగ్గరున్న రూ.1.62 లక్షలు మార్చుకోవడానికి ప్రయత్నిస్తే కుదరదన్నారు'' అని కోర్టు దృష్టికి తెచ్చారు. ఇలాంటి కేసులను ఆర్‌బీఐ పరిగణనలోకి తీసుకోవాలని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. విచారణ డిసెంబర్ 5కు వాయిదా పడింది. నోట్ల రద్దు అత్యంత లోపభూయిష్ట నిర్ణయమని సీనియర్ లాయర్ పి.చిదంబరం గురువారం వాదించడం తెలిసిందే.

మద్యం కుంభకోణంలో తొలి చార్జిషీట్

కోర్టులో దాఖలు చేసిన సీబీఐ
- బోయినపల్లి అభిషేక్‌రావు, ముత్తా గౌతమ్ సహా ఏడుగురి పేర్లు
- ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా పేరు మినహాయింపు
- ఇతర నిందితుల విచారణ అనంతరం అనుబంధ చార్జిషీట్



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో సీబీఐ తొలి చార్జిషీట్ దాఖలు చేసింది. 10,000 పేజీలతో కూడిన ఈ–డాక్యుమెంట్, సీడీల రూపంలో శుక్రవారం ఢిల్లీలో సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎదుట దాఖలు చేసింది. ఏ1గా ఢిల్లీ ఎక్సైజ్ మాజీ డిప్యూటీ కమిషనర్ కుల్‌దీప్ సింగ్, ఏ2గా ఢిల్లీ ఎక్సైజ్ మాజీ అసిస్టెంట్ కమిషనర్ నరేందర్ సింగ్, ఏ3గా ఆమ్ ఆద్మీ పార్టీ కమ్యూనికేషన్ ఇన్‌చార్జి విజయ్ నాయర్, ఏ4గా హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త బోయినపల్లి అభిషేక్‌రావు, ఏ5గా 'ఇండియా ఎహెడ్' అధినేత ముత్తా గౌతమ్, ఏ6గా రాబిన్ డిస్టిలరీస్ ఎల్‌ఎల్‌పీ అరుణ్ రామచంద్ర పిళ్లై, ఏ7గా ఇండో స్పిరిట్‌కు చెందిన సమీర్ మహేంద్రును పేర్కొంది. 2022 ఆగస్టు 17న నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లోని ఈ పేర్లను మాత్రమే తొలి చార్జిషీట్‌లో పొందుపరిచినట్టు తెలిపింది.

చార్జిషీట్‌పై 30న నిర్ణయం
మద్యం పాలసీ రూపకల్పన, అమలులో చోటుచేసుకున్న అవినీతిపై కేంద్ర హోంశాఖ సూచన మేరకు 10 మంది మద్యం లైసెన్స్‌దారులు, సహచరులు, ఇతరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సీబీఐ వెల్లడించింది. ఎక్సైజ్ పాలసీలో సవరణలు, లైసెన్స్‌దారులకు అనుచిత ప్రయోజనాలు, లైసెన్స్ ఫీజులో మినహాయింపు/తగ్గింపు, ఆమోదం లేకుండానే ఎల్–1 లైసెన్స్ పొడిగింపు తదితర అక్రమాలు జరిగాయని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నట్లు వివరించింది. ''సంపాదించిన సొమ్ములో కొంత మొత్తాన్ని ఖాతా పుస్తకాల్లో తప్పుడు లెక్కలతో ప్రైవేట్ వ్యక్తుల ఖాతాల నుంచి ప్రభుత్వ అధికారులకు మళ్లించారు. నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో సోదాల్లో విలువైన రికార్డులు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నాం. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ఇతరుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది'' అని పేర్కొంది. సీబీఐ చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నామని, దానిపై ఈ నెల 30న నిర్ణయం తీసుకుంటామని న్యాయమూర్తి తెలిపారు. ఎఫ్ఐఆర్‌లోని ఇతరులపై దర్యాప్తు అనంతరం అనుబంధ చార్జిషీట్ దాఖలు చేయనుంది.

మనీశ్ సిసోడియా పేరు మినహాయింపు
సీబీఐ ఎఫ్ఐఆర్‌లో ఏ1 నిందితుడిగా ఉన్న ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా పేరును తొలి చార్జిషీట్‌లో అధికారులు మినహాయించారు. మద్యం కుంభకోణంపై ఇంకా దర్యాప్తు జరపాల్సి ఉండడంతో ఆయన పేరును చార్జిషీట్‌లో చేర్చలేదని సీబీఐ అధికారి ఒకరు తెలిపారు.

సత్యమేవ జయతే: 'ఆప్'
సీబీఐ చార్జిషీట్‌లో సిసోడియా పేరు లేకపోవడంపై 'సత్యమేవ జయతే' అంటూ ఆప్ స్పందించింది. నకిలీ కుంభకోణంలో ఆయన్ను ఇరికించేందుకు ప్రయత్నించారని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. విద్యా విప్లవానికి శ్రమిస్తున్న సిసోడియా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కుట్ర పన్నారంటూ ట్వీట్ చేశారు.

ఏ రాజ్యాంగమూ పరిపూర్ణం కాదు
సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్



న్యూఢిల్లీ: రాజ్యాంగ ప్రజాస్వామ్య వ్యవస్థలో కొలీజియంతో సహా ఏ రాజ్యాంగమూ పరిపూర్ణం, లోపరహితం కాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. సమస్యలకు పరిష్కార మార్గాలను ప్రస్తుత ఉన్న వ్యవస్థ నుంచే కనిపెట్టాలని తెలిపారు. రాజ్యాంగానికి లోబడి పని చేయాలన్నారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. రాజ్యాంగాన్ని అమలుపర్చే న్యాయమూర్తులను విశ్వసనీయమైన సైనికులుగా అభివర్ణించారు. ప్రజాసేవ పట్ల అంకితభావం, అనురక్తి ఉన్నవాళ్లు న్యాయ వ్యవస్థలో చేరాలని సీజేఐ సూచించారు. న్యాయవాద వృత్తిలో వలస పాలన కాలం నాటి ఆచారాలను వదిలించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. లాయర్లకు కఠినంగా అమల్లో ఉన్న డ్రెస్ కోడ్‌ను పునఃపరిశీలించాలన్నారు. మన జీవన విధానం, మన వాతావరణానికి తగ్గట్టుగా డ్రెస్ కోడ్ ఉండాలని సూచించారు.

కొలీజియం పరాయి వ్యవస్థ
దాన్ని సుప్రీంకోర్టే సృష్టించుకుంది: రిజిజు



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం కోసం ఉద్దేశించిన కొలీజియం వ్యవస్థపై కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు మరోసారి విమర్శలు గుప్పించారు. అది మన రాజ్యాంగానికి పరాయి వ్యవస్థ అన్నారు. 1991 కంటే ముందు న్యాయమూర్తులను ప్రభుత్వమే నియమించేదని గుర్తుచేశారు. కొలీజియం వ్యవస్థను తీర్పు ద్వారా సుప్రీంకోర్టే సృష్టించుకుందని శుక్రవారం ఢిల్లీలో 'టైమ్స్ నౌ' సదస్సులో ఆయనన్నారు. రాజ్యాంగం దేశంలో అందరికీ, ముఖ్యంగా ప్రభుత్వానికి మత గ్రంథం వంటిదే. కోర్టులు, కొందరు న్యాయమూర్తులు తీసుకున్న నిర్ణయానికి మొత్తం దేశం మద్దతున్నట్టు ఎలా భావిస్తాం? కొలీజియం వ్యవస్థను ఏ నియమం కింద నిర్వచిస్తారో చెప్పాలి. అయితే జడ్జీల నియామకానికి మరో ఉత్తమ వ్యవస్థ అందుబాటులోకి వచ్చేదాకా కొలీజియంను ప్రభుత్వం గౌరవిస్తూనే ఉంటుంది'' అన్నారు. ఆ ఉత్తమమైన వ్యవస్థ ఏమిటన్న దానిపై తాను చర్చించలేనన్నారు.

సాక్షి విజయనగరం

శనివారం, 26, నవంబర్, 2022

డిసెంబర్ 4న ఘంటసాల పాటల పోటీలు

విజయనగరం టౌన్: ఘంటసాల శత జయంతిని పురస్కరించుకుని ఘంటసాల పాటల పోటీలను డిసెంబర్ 4వ తేదీన నిర్వహిస్తామని మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాల ప్రిన్సిపాల్ ఆర్ వి.ప్రసన్నకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనదలిచిన అభ్యర్థులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



దేవుని ప్రతిరూపాలు విభిన్న ప్రతిభావంతులు

విభిన్న ప్రతిభావంతులను దైవంతో సమానంగా చూడాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. - 8లో

అన్ని కార్యాలయాల్లోనూ రాజ్యాంగ దినోత్సవం

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ రాజ్యాంగ దినోత్సవాన్ని శనివారం నిర్వహించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు రాజ్యాంగ పీఠికను చదివి ప్రమాణం చేయాలని పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని ఆడిటోరియం వద్ద ఉదయం 10.30 గంటలకు నిర్వహించే రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొనేందుకు అధికారులందరూ హాజరుకావాలని సూచించారు.

న్యూస్‌రీల్

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ జిల్లాకు రాక

విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ శనివారం విజయనగరం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు చీపురుపల్లి చేరుకుని నీలికవాతు కార్యక్రమంతో పాటు, రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు అరకు వెళ్లనున్నట్టు జిల్లా అధికార వర్గాలు పేర్కొన్నాయి.

శిక్షణ సద్వినియోగం కావాలి : డీఈఓ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలల్లో ఇచ్చే జిల్లా స్థాయి లెర్నింగ్ ఇంప్రూవ్ ప్రోగ్రాం శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి సూచించారు. ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. బోధనా పద్ధతులు, విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించేందుకు అనుసరించాల్సిన మెలకువలను ఉపాధ్యాయులకు వివరించారు. తొలి రోజు గణితం, సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. శనివారం తెలుగు, ఇంగ్లిష్, సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. డైట్ ప్రిన్సిపాల్ తిరుపతి నాయుడు, ఇన్‌చార్జి ఎంఈఓ సత్యనారాయణ, ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనేరాధ తదితరులు పాల్గొన్నారు.

రూ.63.63 కోట్లతో తోటపల్లి కాలువ పనులు

రాజాం సిటీ: తోటపల్లి ఆయకట్టు పరిధిలోని పిల్లకాలువల పనులను రూ.63.63 కోట్ల వ్యయంతో చేపడతామని ఈఈ రెడ్డి రామచంద్రరావు, డీఈ బి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 30 నుంచి తోటపల్లి కాలువలకు సాగునీటి సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు. రాజాం డివిజన్‌లోని 26 పిల్లకాలువలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. గతంలో ఈ పనులను ఎన్‌సీసీ కంపెనీ నిలిపివేసిందన్నారు. ప్రస్తుతం నెల్లూరుకు చెందిన వెంకటరమణ కన్‌స్ట్రక్షన్స్‌కు పనుల నిర్వహణను ప్రభుత్వం అప్పగించిందని పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి 1.31 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యంగా కాలువలను అభివృద్ధి చేస్తామని చెప్పారు.

ఉపకార వేతనాల దరఖాస్తు గడువు పెంపు

విజయనగరం రూరల్: ప్రధానమంత్రి ఉపకార వేతనం (పీఎంఎస్ఎస్)లో భాగంగా ఉమ్మడి జిల్లా పరిధిలోని మాజీ సైనికుల పిల్లలు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచినట్టు జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో బీఈ, బీటెక్, ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎడ్, బీబీఏ, బీఏఎంఎస్, బీఫార్మసీ, ఎల్ఎల్‌బీ, ఎంబీఏ, బీఎస్సీ (నర్సింగ్) కోర్సుల్లో తొలి ఏడాది చదువుతున్న మాజీ సైనికుల పిల్లలు వచ్చేనెల 31లోగా ఉపకారవేతనాలకు దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. నిర్ణీత గడువులోగా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తుతో ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలన్నారు. వివరాలకు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ఎంఐజీలకోసం 45 ఎకరాల గుర్తింపు



జేసీ మయూర్ అశోక్

బొబ్బిలి: మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించేందుకు బొబ్బిలి, పార్వతీపురం మున్సిపాలిటీలలో స్థలాలు గుర్తించినట్టు జేసీ మయూర్ అశోక్ తెలిపారు. బొబ్బిలి పట్టణంలోని ఎంఐజీ లే ఔట్ కోసం రామన్నదొర వలస వద్ద గల లేఔట్‌ను శుక్రవారం పరిశీలించారు. అనంతరం బుడా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పార్వతీపురంలోని అడ్డాపుశీల వద్ద 30 ఎకరాలను, బొబ్బిలిలోని రామన్నదొర వలస వద్ద 15 ఎకరాలను ఎంఐజీ లే ఔట్ కోసం గుర్తించినట్టు వెల్లడించారు. పార్వతీపురంలోని కలెక్టరేట్ భవనం కూడా ఎంఐజీ లే ఔట్ ప్రాంతంలో ఉండే అవకాశం ఉందన్నారు. సాలూరు జాతీయ రహదారి కోసం 15 ఎకరాలు కేటాయించామని చెప్పారు. ఆయన వెంట ఆర్డీఓ శేషశైలజ, తహసీల్దార్ రాజారావు, బుడా చైర్మన్ ఇంటి పార్వతీగోపాలరావు, బుడా, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

శ్రమయేవ జయతే..



ఏడు పదుల వయస్సు పైబడినా శ్రమయేవ జయేతే అని వేపాడ మండలం రాయుడుపేటకు చెందిన బంగారు చిన్న, పెదిరెడ్డ చిన్న నినదిస్తున్నారు. ప్రతి రోజూ గ్రామానికి సమీపంలోని కొండ గట్టువద్ద చీపురు పుల్లలను సేకరిస్తూ కుటుంబానికి చేదోడుగా నిలుస్తున్నారు. కూర్చుంటే శరీరం సహకరించదని, కాసేపు కాళ్లూచేతులు తిరుగాడితే(పనిచేస్తే) ఆరోగ్యంగా ఉంటామని సెలవిస్తున్నారు. – వేపాడ

వివాహ ఆహ్వానం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వివాహ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న శోభా హైమావతి, స్వాతిరాణి

విజయనగరం: ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి తన కుమారుడు అన్వేష్‌కుమార్ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిను కోరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాయలంలో ముఖ్యమంత్రిని శుక్రవారం కలిసి వివాహ ఆహ్వానపత్రికను అందజేశారు. హైమావతి వెంట జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభాస్వాతిరాణి ఉన్నారు.

ఆర్టీసీ డిపో సందర్శన



ఎస్.కోట ఆర్టీసీ డిపోను విజయనగరం జోన్–1 డిప్యూటీ చీఫ్ మేనేజర్ కె.వెంకటరావు శుక్రవారం సందర్శించారు. అన్ని విభాగాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. బస్ స్టేషన్‌లోని పార్సిల్ కౌంటర్, స్టాల్స్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. ఆయన వెంట డిపో మేనేజర్ కె.రమేష్ ఉన్నారు. – లక్కవరపుకోట(ఎస్.కోట)

మహిళలకు రక్షణ కవచం వేధింపుల నిరోధక చట్టం

- మహిళా ఉద్యోగులను వేధించే వారిపై కఠిన చర్యలు
- జెడ్పీ చైర్మన్, డిప్యూటీస్పీకర్

విజయనగరం ఫోర్ట్:

మహిళా వేధింపుల నిరోధక చట్టం మహిళలకు రక్షణ కవచం లాంటిదని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పనిచేసే చోట మహిళ ఉద్యోగులను వేధించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లలో అధికమంది మహిళలేనని, నియోజకవర్గ స్థాయిలో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మహిళల రక్షణకు దిశ చట్టాన్ని అమలులోకి తెచ్చారన్నారు. దిశ పోలీస్ స్టేషన్లలో మహిళల సమస్యలు పరిష్కరిస్తున్నారని చెప్పారు. కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ మహిళలు పని చేసే చోట పనిపై శ్రద్ధ చూపితే వేధింపులనేవి ఉండవన్నారు. గౌరవం పెరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయాన్ని గడిపి మంచి చెడులు బోధించాలన్నారు. కార్యక్రమంలో



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి, నగర కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ సుధాకర్, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి బి.శాంతకుమారి, బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ జి. హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండ

మహిళల రక్షణకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా వేధింపుల నిరోధక చట్టంపై శుక్రవారం నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు నగర్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతీదేవి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఆరోగ్యశ్రీతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం
- జైళ్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీనివాస్



ఉత్తరాంధ్ర జైళ్ల అధికారులతో మాట్లాడుతున్న ఐజీ శ్రీనివాస్

ఆరిలోవ(విశాఖ తూర్పు): రాష్ట్రంలోని జైళ్లలో ఖైదీలకు ఆరోగ్యశ్రీ పక్కాగా అమలు చేస్తున్నట్లు జైళ్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ) ఇండ్ల శ్రీనివాస్ తెలిపారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని జైలు అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ రామచంద్రరావు, జైలర్లతో కలసి శుక్రవారం ఆయన సందర్శించారు. ఖైదీలు ఉండే బేరక్‌లు, భోజనశాల, జైలు పరిసరాలు, ఆస్పత్రిని పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు జైళ్ల అధికారులతో ఇక్కడి సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఆయా జైళ్ల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకున్నారు. జైళ్ల బడ్జెట్, ఖైదీలకు అందించే వైద్యం, మందులు, సెక్యూరిటీ, నిర్మాణాలపై చర్చించారు. జైళ్లలో స్నేహపూరిత వాతావరణం ఉండాలని.. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఇప్పటి వరకు 15 మంది ఖైదీలకు వైద్య సేవలందించినట్లు చెప్పారు. విశాఖ కేంద్ర కారాగారం నుంచి ముగ్గురు ఖైదీలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందించినట్లు వెల్లడించారు. శిక్ష పడిన ఖైదీలకు, రిమాండ్ ఖైదీలకు ఒకే విధంగా ఆరోగ్యశ్రీ వర్తిస్తుందన్నారు.

ప్రతి నెలా టీడీఎస్ వసూలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న శంకర్ పాండే

విజయనగరం ఫోర్ట్: ఉద్యోగుల నుంచి నెలనెలా టీడీఎస్ వసూలు చేయడంతో పాటు నిర్ణీత గడువులోగా కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాలని ఆదాయపన్నుశాఖ జాయింట్ కమిషనర్ శంకర్ పాండే తెలిపారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో టీడీఎస్‌పై శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆదాయవనరుల్లో టీడీఎస్ ప్రధానమైనదన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులు సక్రమంగా సాగాలంటే పన్నులు వసూలు తప్పనిసరన్నారు. డీడీఓలందరూ టీడీఎస్ వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో గణపతిరావు, విశాఖపట్నం ఆదాయ పన్నుశాఖ అధికారి ఎస్.రేణుకాదేవి, ఇన్‌స్పెక్టర్ ఇంతియాజ్ పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముకేష్‌కుమార్ మీనా

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

విజయనగరం ఫోర్ట్: కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం రాత్రి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో ఉన్న చనిపోయిన వారి పేర్లు, వలస వెళ్లిన వారి పేర్లను తొలగించాలని సూచించారు. వ్యక్తులు వాస్తవంగా ఎక్కడ స్థిరంగా నివసిస్తున్నారో అక్కడి జాబితాలోనే వారి పేర్లు చేర్చాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ, తనిఖీలతోనే కచ్చితమైన ఓటర్ల జాబితాను సిద్ధంచేయగలమని అభిప్రాయపడ్డారు. పోలింగ్ స్టేషన్ల మార్పుపై ఎన్నికల కమిషన్ స్థాయిలో నిర్ణయం తీసుకుంటారన్నారు. తుది జాబితా తయారీకి మరో 20 రోజుల వరకు సమయం ఉందని చెప్పారు. సమావేశంలో కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో గణపతిరావు, ఆర్డీఓలు సూర్యకళ, శేషశైలజ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తప్పు జరిగిందా... తస్మాత్..

- ధాన్యం కొనుగోలు విషయమై జేసీ హెచ్చరిక

విజయనగరం ఫోర్ట్: ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తప్పిదాలు జరిగితే క్షమించేది లేదని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ హెచ్చరించారు. స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో 2022 – 23 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై శుక్రవారం ఏర్పాటు చేసిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అత్యంత పారదర్శకంగా, కచ్చితంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలు, ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. మనసు పెట్టి పని చేయాలని చెప్పారు. శాంపిల్స్ సేకరించిన దగ్గర నుంచి కొనుగోలు ముగిసే వరకు ప్రతి దశలో క్షేత్ర స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మిల్లర్లు, స్థానిక నాయకులు ఒత్తిళ్లకు తలొగ్గి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సమస్యలు సృష్టించ వద్దన్నారు. రైతులను ఇబ్బంది పెట్టవద్దని సచివాలయ సిబ్బంది, ఉద్యోగులను హెచ్చరించారు. అవకతవకలకు పాల్పడినా, నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని చెప్పారు. పత్రికల్లో ప్రతికూల వార్తలు ప్రచురితమైనా, రైతులు నుంచి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారి, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతు భరోసా కేంద్రాలే ధాన్యం కొనుగోలు కేంద్రాలని, అక్కడ అన్ని పరికరాలను అందుబాటులోకి ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి టి.తారకరామరావు, సివిల్ సప్లయి డీఎం మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్

- పింఛన్‌ను దశలవారీగా పెంచుతున్నది జగనన్న ప్రభుత్వమే
- కొత్త నిబంధనల ప్రకారం పింఛన్‌కు అల్లాడ శ్రీనివాసరావు అనర్హుడు
- చంద్రబాబు పాలనలో వేలాది మంది అర్హులకూ పింఛన్ కోత
- నాడు కళ్లు మూసుకున్న పవన్ కల్యాణ్ ఇప్పుడు మొసలికన్నీరు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పష్టీకరణ



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: 'పింఛన్ సొమ్ము పెంచడం మాట దేవుడెరుగు ఉన్న పింఛన్లనూ వేలాది సంఖ్యలో కోత వేసినప్పుడు జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ కళ్లు మూసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత పింఛన్ మొత్తం ఏటా రూ.250 చొప్పున పెంచుతోంది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తోంది. ఇది జగమెరిగిన సత్యం. ఇందులో ప్రతిపక్ష పార్టీలు వేలెత్తి చూపలేవు. కానీ అర్హులకు పింఛన్ కోత వేస్తున్నారంటూ, వారిని తామేదో ఆదుకుంటామంటూ జనసేన నాయకులు ఇప్పుడు మొసలికన్నీరు కార్చుతున్నారు' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. చీపురుపల్లికి చెందిన దివ్యాంగుడికి పింఛను రద్దు కావడంపై జనసేన నాయకులు సోషల్ మీడియాలో చేస్తున్న విషప్రచారాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తున్న దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రిగా పేరొందిన జగనన్నను విమర్శించే అర్హత జనసేన సహా ప్రతిపక్ష పార్టీలకు లేదన్నారు. చీపురుపల్లికి చెందిన అల్లాడ శ్రీనివాసరావు అనే దివ్యాంగుడికి కొత్త నిబంధనల ప్రకారమే పింఛన్ జూన్ నెల నుంచే నిలిచిపోయిందని తెలిపారు. 'వాస్తవానికి 2008 డిసెంబర్‌లో అతనికి దివ్యాంగుల పింఛను మంజూరైంది. అప్పటి నుంచి 2014 సంవత్సరం వరకూ నెలకు రూ.200 చొప్పున పింఛన్ అందింది. 2019 సంవత్సరంలో పరిపాలన గడువు ముగియడానికి కొద్ది నెలల ముందు మాత్రమే చంద్రబాబు ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని పెంచింది. అలా 2019 సంవత్సరంలో సాధారణ ఎన్నికల నాటికి శ్రీనివాసరావు పింఛన్ రూ.1500కు పెరిగింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పింఛన్ల మొత్తాన్ని పెంచింది. మొన్న జూన్ వరకూ నెలకు రూ.3 వేల చొప్పున పింఛన్ అందింది. ఆయన తన కుటుంబంతో చీపురుపల్లి–2 సచివాలయం పరిధిలో నివసిస్తున్నారు. ఆ కుటుంబంతోనే ఉంటున్న అతని సోదరి అల్లాడ శ్రీదేవి ప్రతి నెలా రూ.36 వేల జీతం పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగి. సెర్ప్ సిబ్బంది గత జూన్‌లో పింఛనుదారుల వివరాలను సిక్స్ పాయింట్ వ్యాలిడేషన్ ద్వారా పరిశీలించారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి కుటుంబంలో వ్యక్తికి పింఛన్ మంజూరుకాదు. గ్రామీణ ప్రాంతంలో నెలవారీ ఆదాయం రూ.10వేలకు మించితే పింఛను మంజూరు చేయడానికి ఆస్కారం లేదు. ఇవన్నీ తెలిసినా జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ ప్రజలను మభ్యపెట్టేందుకు గిమ్మిక్కులు చేయడం శోచనీయం' అని మజ్జి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

షూటింగ్ పోటీల్లో ప్రతిభ

● బాలుర విభాగంలో ద్వితీయ, బాలికల విభాగంలో తృతీయస్థానాలు



విజేతలతో పాఠశాల సిబ్బంది

బొబ్బిలి రూరల్: ఈనెల 22నుంచి 24వరకు అనకాపల్లి జిల్లా సబ్బవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీలలో మండలంలోని చింతాడ జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్ 19లో బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన టి.నేతాజీనాయుడు, ప్రవీణ్‌కుమార్‌లు ద్వితీయస్థానం సాధించగా, బాలికల విభాగంలో భాగ్యశ్రీ తృతీయస్థానం సాధించింది. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వీరిని హెచ్‌ఎం దీవెనమ్మ, పీడీ కృష్ణమూర్తిలు శుక్రవారం పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు. విజేతలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులంతా కేవలం చదువులోనే కాకుండా అన్నిరంగాలలో ముందుండాలని హెచ్‌ఎం దీవెనమ్మ సూచించారు.

రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారిణులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న మహిళల వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు శుక్రవారం పయనమయ్యారు. ఈనెల 26,27, 28 తేదీల్లో గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న పోటీలు జరగనున్నట్లు కోచ్‌లు సీహెచ్ రాము, ఎం.శ్రీనివాస్‌లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభాపాటవాలతో పతకాలు సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు.

డిసెంబర్ 30కి లక్ష్మీపేట కేసు వాయిదా

వంగర: మండలంలోని లక్ష్మీపేట కేసు విచారణ డిసెంబర్ 30వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రత్యేక న్యాయ స్థానంలో కేసు విచారణ జరిగింది. జిల్లా జడ్జి ఎం.శ్రీదేవి వర్చువల్ విధానంలో చేపట్టిన విచారణకు 38 మంది నిందితులు హాజరు కాగా, 34 మంది గైర్హాజరయ్యారు. గతంలో ఎనిమిది మంది మృతిచెందారు. అనంతరం కేసు విచారణ వాయిదా పడింది.

గడ్డి మందు తాగి మహిళ ఆత్మ హత్య

కురుపాం: కుమారుడు తన మాట వినడం లేదని మనస్తాపం చెందిన మండలకేంద్రానికి చెందిన గౌడు ఇందిర (42) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం సాయంత్రం ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్న ఆమెను స్థానికులు వెంటనే కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్య సేవల కోసం పార్వతీపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి వ్యక్తి..

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధిలోని గాయత్రి కాలనీలో నివాసం ఉంటున్న బొండాడ అప్పయ్య (76) బావిలో పడి మృతిచెందినట్లు ఎస్సై వీబీ రామకృష్ణారావు శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం లచ్చయ్యపేట గ్రామానికి చెందిన అప్పయ్య భార్య మరణానంతరం రెండేళ్ల క్రితం గాయత్రికాలనీలో నివాసం ఉంటున్న అల్లుడు వజ్జపర్తి రాము ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. వయసు పైబడడంతో మతిస్థిమితం కోల్పోయి అప్పుడప్పుడూ ఇంటినుంచి వెళ్లిపోయి మళ్లీ సాయంత్రానికి చేరుకునేవాడు. ఎప్పటిలాగానే ఈ నెల 22న రాత్రి భోజనం అనంతరం అంతా నిద్రకు ఉపక్రమించారు. మరునాడు ఉదయం చూస్తే అప్పయ్య కనిపించకపోవడంతో రాత్రికి వచ్చేస్తాడని భావించారు. రాకపోవడంతో పరిసర ప్రాంతాలతోపాటు సొంత గ్రామంలో కూడా వాకబు చేశారు. శుక్రవారం మున్సిపాల్టీ పరిధి కొత్తవలస సమీపంలోని నేలబావిలో మృతదేహం ఉన్నట్లు తెలియడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూసి అప్పయ్యదేనని నిర్ధారించి పోలీసులకు సమాచారం అందించారు. ఆయన మృతికి సంబంధించి అల్లుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దేవుని ప్రతిరూపాలు విభిన్న ప్రతిభావంతులు

* జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
* రాజీవ్ స్టేడియంలో అట్టహాసంగా క్రీడాపోటీలు ప్రారంభం



గౌరవ వందనంలో పాల్గొన్న విభిన్నప్రతిభావంతులు



పరుగు పోటీల్లో విభిన్న ప్రతిభావంతులు



షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారుడు

జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



హాజరైన క్రీడాకారులు



విభిన్న ప్రతిభావంతురాలైన విద్యార్థినితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: విభిన్న ప్రతిభావంతులను దైవంతో సమానంగా చూడాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. వారిలో అతీతమైన శక్తులు నిగూఢమై ఉంటాయని, వారు నిత్య విజేతలని పేర్కొన్నారు. సకలాంగులతో సమానంగా అన్ని చోట్లా పోటీపడుతూ విజేతలుగా రాణిస్తున్నారని ప్రశంసించారు. డిసెంబర్ 3, ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న జిల్లా స్థాయి క్రీడాపోటీలు రాజీవ్ స్టేడియంలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్ జెండా ఊపి, డిక్లరేషన్ చదివి పోటీలను ప్రారంభించారు. ఈ క్రమంలో ముందుగా జాతీయ పతాకాన్ని జెడ్పీ చైర్మన్, క్రీడా పతాకాన్ని జేసీ ఆవిష్కరించారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు మార్చ్ పాస్ట్ చేయగా వారి నుంచి అతిథులందరూ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పుట్టుకతో వచ్చిన లోపం శాపం కాదని, అధైర్య పడకుండా జీవితంలో ముందుకు సాగాలని విభిన్న ప్రతిభావంతులకు ధైర్యం చెప్పారు. ఏ సమయంలో అయినా.. ఎలాంటి పరిస్థితిలో అయినా మీకు అండగా నిలుస్తానని విద్యార్థులను, నిర్వాహకులకు జెడ్పీ చైర్మన్ భరోసా ఇచ్చారు. ఇలాంటి క్రీడా పోటీలను మరిన్ని నిర్వహించి వారిలో మరింత పోటీతత్వాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.

ఉత్సాహంగా సాగిన పోటీలు

విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజీవ్ స్టేడియంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన క్రీడాపోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అథ్లెటిక్స్, జావెలిన్ త్రో, డిస్క్ త్రో, 100 మీటర్ల పరుగు పందెం, సైక్లింగ్ తదితర అంశాల్లో పోటీలను నిర్వహించి విజేతలకు డిసెంబర్ 3వ తేదీన జరిగే ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకుడు జగదీష్ తెలిపారు. ఈ పోటీలను పలువురు పీఈటీలు, పీడీలు సజావుగా నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకుడు జగదీష్, చీఫ్ కోచ్ అప్పలనాయుడు, ఇతర అధికారులు, వివిధ సంస్థల నిర్వాహకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో ప్రత్యేక పాత్ర

వచ్చే సంక్రాంతి సంబరాల్లో విభిన్న ప్రతిభావంతులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఆసక్తి కలిగిన వారిని గుర్తించి భాగస్వామ్యం చేయాలని సంబంధిత అధికారులకు జెడ్పీ చైర్మన్ సూచించారు. అన్ని రకాల కార్యక్రమాల్లో విభిన్న ప్రతిభావంతులు కీలకపాత్ర పోషించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు

సుజల స్రవంతి నిర్మాణానికి సహకరించాలి

* ప్రత్యేక భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ సుదర్శనదొర
* అభిప్రాయ సేకరణ సభను వ్యతిరేకిస్తూ రైతుల వినతిపత్రం



ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుదర్శనదొరతో మాట్లాడుతున్న రైతులు, వామపక్షాల నాయకులు

లక్కవరపుకోట (శృంగవరపుకోట): పోలవరం ప్రాజెక్టు నుంచి సాగు, తాగునీరు మళ్లించేదుకు ఉద్దేశించిన బాబూ జగ్గజీవన్‌రామ్ సుజల స్రవంతి కాలువ నిర్మాణానికి రైతులు సహకరించాలని ప్రత్యేక భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ బి.సదర్శనదొర కోరారు. ఈ మేరకు శృంగవరపుకోట మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కాలువ నిర్మాణంలో భూములు కోల్పోనున్న రైతుల అభిప్రాయ సేకరణ సభను శుక్రవారం నిర్వహించారు. ముందుగా రైతులు రామకృష్ణ, వి.రవికుమార్ తదితరులు మాట్లాడుతూ కనీసం సమాచారం లేకుండా తమ పొలాల్లో సర్వేరాళ్లు వేయడం ఎంతవరకు సబబని అధికారులను ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో సెంటు భూమి బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ. 8లక్షలకు పైగా పలుకుతోందని ప్రభుత్వం అరకొర పరిహారం అందజేస్తే ఎలా అని ఆందోళన వ్యక్తం చేశారు. తాత తండ్రుల నుంచి ఇదే భూమిని నమ్ముకుని జీవనోపాధి పొందుతున్నామని వాపోయారు. భూములకు బదులుగా భూములే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలువ డిజైన్ మార్చాలని పట్టుబట్టారు.

డిజైన్ మార్పు కుదరదు

అనంతరం ప్రత్యేక భూసేకరణ కలెక్టర్ సుదర్శనదొర మాట్లాడుతూ మీ అనుమతి లేకుండా భూముల్లో సర్వేరాళ్లు వేయడం తప్పేనని ఒప్పుకున్నారు. ఈ కాలువ నిర్మాణం కోసం జిల్లాలోని ఎస్.కోట, గజపతినగరం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో 105 కిలోమీటర్ల పొడవునా సుమారు 4,500 ఎకరాలు భూసేకరణకు గుర్తించామన్నారు. ఎస్.కోట నియోజకవర్గంలో వేపాడ, ఎల్.కోట, కొత్తవలస, ఎస్.కోట మండలాల్లోని 32 గ్రామాల మీదగా కాలువ నిర్మాణం సాగనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు డిజైన్ మార్చడం కుదరదని, రైతులు సహకరించాలని కోరగా ఒక్కసారిగా రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఏదిఏమైనా తమ భూముల్లో కాలువ నిర్మాణానికి సహకరించేదిలేదని, తమ శవాలపై నిర్మించాలని రైతులు నినాదాలు చేశారు. కనీసం తెలియపర్చకుండా నిర్వహించిన గ్రామ సభను వ్యతిరేకిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి వెనుదిరిగారు. తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, ప్రాజెక్టు డీఈ పి.లక్ష్మీసుధ, జేఈలు కీర్తి, నిహారిక, సర్పంచ్ సంతోషికుమారి పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్ డాక్టర్ స్వామినాయుడు, తదితరులు

విజయనగరం టౌన్: ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.స్వామినాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపికైనవారిని శుక్రవారం కళాశాల ఆవరణలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాడ్మింటన్ పోటీలు ఈ నెల 17, 18వ తేదీల్లో రాజాంలో నిర్వహించగా బి.అభిషేక్ (రఘు ఇంజినీరింగ్), కె.హరీష్ (రఘు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), పి.తేజ (విజ్ఞాన్), జి.గణేష్ (అవంతి)లు ఎంపికయ్యారన్నారు. వారంతా జేఎన్‌టీయూ బెంగళూరులో ఈ నెల 27 నుంచి 30వరకూ నిర్వహిస్తున్న ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. డాక్టర్ కె.బాబు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తే ముఖ్యమంత్రి ఆరాటం

* డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



నూతన వసతి గృహ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

విజయనగరం: రాష్ట్రంలోని పిల్లల భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరాటమని ఆ లక్ష్యంతోనే విద్యాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ రూ.1.50 కోట్ల కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో నగరంలోని సుంకరవీధిలో నిర్మించిన కళాశాల బాలికల వసతిగృహం నూతన భవనాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబులతో కలిసి శుక్రవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేస్తున్నారని, వారి ఆశలను ఆకాంక్షలను నెరవేర్చే విధంగా విద్యార్థినులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్య పట్ల ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయని, ఈ కారణంతోనే విద్యాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ సాంస్కృతిక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన నగరాన్ని విద్యాకేంద్రంగా కూడా రూపొందించే లక్ష్యంతో వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ సుధాకర్, సహాయ సంక్షేమ అధికారి రామానందం, వార్డు కార్పొరేటర్ జకీర్ తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 540.00
విజయనగరం	రూ. 544.00
శ్రీకాకుళం	రూ. 544.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24క. 10గ్రా.)	52,970-00
బంగారం(22క. 10గ్రా.)	48,550-00
వెండి (కిలో)	68,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204

శత జయంతి ఉత్సవాల స్వరాభిషేకానికి ఏర్పాట్లు పూర్తి

* గురునారాయణ కళాపీఠం వ్యవస్థాపకుడు జీపీ నారాయణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీ గురునారాయణ కళాపీఠం వ్యవస్థాపకుడు జీపీ నారాయణ

విజయనగరం టౌన్: గానగంధర్వుడు, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు, స్వర సామ్రాట్ డాక్టర్ సాలూరు రాజేశ్వరరావుల శతజయంతి మహోత్సవాలను పుర స్కరించుకుని వారు పాడిన ఆపాత మధురాలను శ్రీ గురునారాయణ కళాపీఠం ద్వారా అందరికీ మరోమారు వినిపించేందుకు ఏర్పాట్లను పూర్తిచేసినట్లు కళాపీఠం వ్యవస్థాపకుడు బీపీ నారాయణ పేర్కొన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27న ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి ఆనందగజపతి కళాక్షేత్రంలో స్వరాభిషేకం పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వర్ధమాన గాయనీ,గాయకులు పవన్ చరణ్, సురభి శ్రావణి, సంతోష్ కిరణ్, హారిక బేబీ లావణ్యలు తమ గానామృతంతో అలరిస్తారన్నారు. ప్రఖ్యాత సినీ యువ వాయిద్య కళాకారులు ఎం.సాయిపవన్ వాయిద్య సహకారం అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల, బొబ్బిలి ఎమ్మెల్యేలు బడుకొండ అప్పలనాయుడు, శంబంగి చిన అప్పలనాయుడు హాజరవుతారన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు (జమ్ము శ్రీను), హోటల్ మయూరా అధినేత యార్లగడ్డ బాబూరావు, కళాపీఠం అధ్యక్షురాలు డాక్టర్ జి.సన్యాసమ్మ, కోశాధికారి బి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్స్ బాక్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభం

* హాజరైన 13 జిల్లాలకు చెందిన 240 మంది క్రీడాకారులు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: జిల్లా వేదికగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభకనబరిచి జాతీయ పోటీల్లో రాణించాలని ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన 6వ ఏపీ సీనియర్స్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం సాయంత్రం నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో ఆయన ప్రారంభించారు.

3 రోజుల పాటు పోటీలు

విజయనగరం వేదికగా రాష్ట్ర స్థాయి సీనియర్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు 13 జిల్లాలకు చెందిన సుమారు 240 బాల, బాలికలు హాజరయ్యారు. 3 రోజుల పాటు నాకౌట్ పద్ధతిలో జరగనున్న పోటీల్లో 46-48 కేజీల బరువు కలిగిన క్రీడాకారుల నుంచి 110 ఆపై బరువు కలిగిన క్రీడాకారులు తలపడనున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జాతీయ పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్‌దేవ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, ఇండియన్ బాక్సింగ్ చీఫ్ కోచ్ కె నూకరాజు, బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, తదితరులు

విజయనగరం క్రైమ్: అందుబాటులో ఉన్న బైక్‌లు దొంగతనం చేస్తున్న నిందితుడిని కంటోన్మెంట్ ప్రాంతంలో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా బెంబేరు గ్రామానికి చెందిన కుమ్మరి భాస్కరరావు 20 రోజుల క్రితం కేఎల్.పురంలో ఒక ఇంట్లో చొరబడి ఎల్‌ఈడీ టీవీ, రెండు జతల బంగారు చెవిదిద్దులు దొంగిలించాడు. అలాగే నోబుల్ నగర్‌లో ఒక ఇంట్లో చోరీకి ప్రయత్నించాడు. ఇంకా రింగురోడ్డులోని సాయి ఆలయం వద్ద పార్కింగ్ చేసి ఉన్న పల్సర్ బైక్, మూడుకోవెళ్ల వద్ద పార్క్ చేసిన హీరో హోండా ఫ్యాషన్ ప్లస్ బైక్ దొంగిలించాడు. అలాగే కలెక్టరేట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పార్కింగ్ చేసి ఉన్న స్ప్లెండర్ ప్లస్‌తో పాటు నెల్లిమర్ల మండలం చినబూరాడ పేట గ్రామంలో డిస్కవరీ మోటార్ బైక్ దొంగిలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం సాయంత్రం గూడ్స్‌షెడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడు పట్టుబడ్డాడు. ఈ సందర్భంగా నిందితుడి నుంచి వాహనాలు, బంగారం, టీవీని రికవరీ చేశారు. కేసులో క్రియాశీలక పాత్ర పోషించిన ఎస్సై వి.అశోక్ కుమార్, హెచ్‌సీ ఎం.అచ్చిరాజు, కానిస్టేబుల్స్ పి.శివశంకర్, కె.శ్రీనివాసరావు, సీహెచ్. తిరుపతిరావులను సీఐ అభినందించారు. సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్, ఎస్సై భాస్కర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో సత్తాచాటిన చిన్నారులు

* రాష్ట్రస్థాయికి ఏడు ప్రాజెక్టుల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులను రూపొందించిన పాలకొండ నియోజకవర్గం విద్యార్థులు

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లాలో గురువారం జరిగిన 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో పాలకొండ నియోజకవర్గం విద్యార్థులు సత్తాచాటారు. ఈ పోటీల్లో జిల్లాలోని 15 మండలాల నుంచి 115 ప్రాజెక్టులను ప్రదర్శించగా అందులో 7 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. ఆ ప్రాజెక్టుల్లో పాలకొండ నియోజకవర్గానికి చెందినవి ఐదు ప్రాజెక్టులు ఉండడం విశేషం. వాటిలో వీరఘట్టం మండలం తలవరం జిల్లా పరిషత్ హైస్కూల్, రేగులపాడు కేజీబీవీ, భామిని మండలం పెద్దదిమిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాల, పాలకొండ మండలం బడ్డుమాసంగి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు ఉన్నాయి.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో సత్తాచాటి పాలకొండ నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన విద్యార్థులందరి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు, హెచ్.ఎంలకు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

విజయనగరం ఫోర్ట్: ఫార్మసిస్ట్ గ్రేడ్–2 ఉద్యోగులకు జోనల్ స్థాయి హోదా కల్పిస్తూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి జీఓ జారీ చేయడంపై ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి బైలపూడి సన్యాసినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్న తమకు న్యాయం చేసిన జగన్ మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేమని పేర్కొన్నారు. ఇకపై ఫార్మసిస్ట్ నియామకాలు అన్ని రీజనల్ జాయింట్ డైరెక్టర్ పరిధిలో జరగనున్నాయని తెలిపారు.

కొత్త మజ్జిపేటలో అన్నదానం



అన్నదానానికి హాజరైన భక్తులు

విజయనగరం టౌన్: పట్టణంలోని కొత్త మజ్జిపేటలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందుకున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాం వసతిగృహ విద్యార్థులకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు బొంతు పురుషోత్తమరావు చేతుల మీదుగా సుమారు 100 మంది విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లను అందజేశారు. విద్యార్థులు ప్రభుత్వం సమకూర్చిన వనరులను సద్వినియోగపరుచుకుని ఉన్నత స్థాయికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి ఆర్. సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన కూలి అమలు చేయాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

విజయనగరం ఫూల్‌బాగ్: పెరిగిన కూలి రేట్లను వెంటనే అమలు చేయాలని సివిల్ సప్లైస్ హమాలీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. కామేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక దాసన్నపేటలోని సివిల్ సప్లైస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం. నరసింహులు, కార్మికులు పాల్గొన్నారు.

అధిక నిధులు కేటాయించాలి



డీఎంహెచ్‌ఓకి వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: మెడికల్ కాలేజీ నిర్మాణానికి అధిక నిధులు కేటాయించడంతో పాటు క్యాన్సర్ కిమో సెంటర్ సత్వరమే పూర్తి చేయాలని బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు కోరారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి రమణకుమారిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి అప్పారావు, చోడి ఆదినారాయణ, పందిరి లక్ష్మారెడ్డి, ఆర్. పైడిరాజు, దువ్వ రామకృష్ణ, డి. రాంబాబు, దువ్వ సన్యాసిరావు, పడగల బంగార్రాజు, పట్నాల వెంకటేష్ పాల్గొన్నారు.

అన్ని పంచాయతీల్లో 'జలజీవన్ మిషన్'

గజపతినగరం: ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీల్లో శతశాతం జల జీవన్ మిషన్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు గజపతినగరం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఎస్. కవిత తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ, గంట్యాడ మండలాలకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఐదు మండల పరిధిలో ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.90 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. ఇంజినీరింగ్ అధికారులు గ్రామాల వారీగా పైప్‌లైన్లు, కుళాయిల ఏర్పాటుకు అవసరమైన ఎస్టిమేట్‌లను వారం రోజుల్లోగా అందించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి 23 నాటికి శతశాతం జల జీవన్ మిషన్ పనులు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు నానిబాబు, ధనంజయ్ రావు, శివబాబు, బి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



ఎమ్మెల్యే కోలగట్లకు హారతి ఇస్తున్న మహిళ

విజయనగరం: దేశంలో ఎక్కడాలేని విధంగా రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్పొరేషన్ పరిధిలోని రెండో డివిజన్ ఫూల్‌భాగ్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోలగట్ల ముందుగా పాదాలమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో తామంతా ఆనందంగా ఉన్నామని ప్రజలు చెప్పడంతో కోలగట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ విజయనగరం పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష ప్రజాస్పందన వస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని, కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి దీవించాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ బండారు ఆనందరావు మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, వజ్రపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పొదుపుపై అవగాహన తప్పనిసరి

• యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ముజుందార్



లబ్ధిదారుడికి చెక్ అందజేస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ ముజుందార్

విజయనగరం టౌన్: నేటితరం విద్యార్థులు నగదు పొదుపుపై అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ ముజుందార్ సూచించారు. శుక్రవారం స్థానిక లోయర్ ట్యాంక్‌బండ్ రోడ్డులో ఉన్న కార్యాలయం ఆవరణలో ముద్ర, వాహన, హౌసింగ్ రుణాలను ఖాతాదారులు, లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుతున్న విద్యార్థులకు సంబంధించి కొత్త సేవింగ్స్ ఖాతాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ముద్ర రుణాల ద్వారా స్వయం ఉపాధి పొంది ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. రీజనల్ మేనేజర్ గురునాథరావు మాట్లాడుతూ విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సుమారు వంద శాఖల ద్వారా సుమారు రూ. 10 కోట్ల ముద్ర రుణాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ప్రేమ్‌బాబు, డిప్యూటీ రీజనల్ హెడ్ దుర్గాప్రసాద్, చీఫ్ మేనేజర్ మాధురి, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలతో సృజనాత్మకత



లెండి ఇంజినీరింగ్ కళాశాలలో సావనీర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి, తదితరులు

• ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రసాద్‌రెడ్డి

డెంకాడ: పరిశోధనాత్మకతతో సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం, స్ప్రింగర్ నేచర్ కంప్యూటర్ సైన్స్ జర్నల్ పబ్లిగేషన్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ అండ్ కమ్యూనికేషన్స్‌పై రెండు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్టార్టప్‌ల వృద్ధికి పరిశోధనలు చేయాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు స్టార్టప్‌లు నెలకొల్పడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయని తెలిపారు. ప్రపంచ పరిణామ మార్పుల్లో 4.0 ప్రాముఖ్యతను వివరించారు. దైనందిక జీవితంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. కోటా ఐఐటీ సీఎస్‌ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్, డీపీజీసీ చైర్మన్ ప్రియాంకమిశ్రా మాట్లాడుతూ, అంతర్జాతీయ కీనోట్ స్పీకర్లు, స్ప్రింగర్ నేచర్ కంప్యూటర్ సైన్స్ జర్నల్, కాన్ఫరెన్స్ కోసం ఖరారు చేసిన పేపర్ల నాణ్యతపై వివరించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, చైర్మన్ పి.మధుసూదనరావు, వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రెటరీ కె.శివరామకృష్ణ, హెచ్‌ఓడీ ఎ.రామారావు, వైస్ ప్రిన్సిపాల్స్ జి.ప్రకాష్‌బాబు, హెచ్‌ఓడీలు ఏవీ పరాంకుశం, ఎం.రాజన్‌బాబు, కె.సుబ్రహ్మణ్యం, సతీష్ పూజారి, ఆర్.రాజేందర్, జి.సతీష్,అధ్యాపకులు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సులభమైన రీతిలో బోధన

• ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్లు

నెల్లిమర్ల రూరల్: నూతన పద్ధతుల ద్వారా విద్యార్థులకు సులువైన రీతిలో బోధన చేయాలని ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు సూచించారు. మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో అభ్యసనాభివృద్ధి కార్యక్రమం(లిప్)లో భాగంగా గుర్ల, నెల్లిమర్ల మండల ఉపాధ్యాయులకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏంఈఓ మాట్లాడుతూ, ఆధునిక పద్ధతులను అవలంబించి విద్యాబోధన నిర్వహించాలని, తద్వారా విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడగలమన్నారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జె. పద్మలత మాట్లాడుతూ, విద్యార్థులకు బోధనతో పాటు సాధనకు సమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అర్థమయ్యే విధంగా బోధిస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. 181 మంది ఉపాధ్యాయులకు గణిత, సామాన్య, సాంఘిక శాస్త్రాల్లో మెలకువలను వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు అప్పలనాయుడు, రామకృష్ణ, రాజేష్, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వసతిగృహాలకు మహర్దశ

• ఏబీసీడబ్ల్యూఓ రమణ



హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఏబీసీడబ్ల్యూఓ రమణ

భోగాపురం: త్వరలో బీసీ సంక్షేమ బాలుర వసతి గృహాలకు మహర్దశ పట్టనుందని ఏబీసీడబ్ల్యూఓ బీవీ రమణ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర వసతిగృహాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విజయనగరం అర్బన్ పరిధిలోకి వస్తున్న భోగాపురం, అలుగోలు, రావాడ, చీపురుపల్లి, బొప్పాడంలోని వసతిగృహాలకు త్వరలోనే నాడు–నేడు పనుల కోసం ఒక్కో కేంద్రానికి రూ. 50 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేయనుందన్నారు. ఈ నిధులతో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు నూతన భవనాలు నిర్మించనున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఎండా అప్పన్న, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: ప్రజా ప్రణాళిక ప్రచారం–2022 శిఓణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జీపీడీపీ 2023–24 జిల్లా స్థాయి టీఓటీ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పల్లెల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించుకునే అవకాశాన్ని పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయన్నారు. ఆర్థిక సంఘాల సూచనల మేరకు పేదరిక నిర్మూలన, మానవ వనరుల అభివృద్ధి , సామాజిక అభివృద్ధి, ఆర్థిక పర్యావరణ–జీవన పౌర సేవలు, సుపరిపాలన విషయంలో వనరుల లభ్యతపై ప్రణాళికలతో గ్రామ, మండల స్థాయిలో జరిగే శిక్షణను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎం.మధుసూదన్‌కుమార్, డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, డీపీఓ నిర్మలాదేవి, జిల్లాలోని మండలాలకు చెందిన ఎంపీడీఓలు , ఈవోపీఆర్‌డీలు, టీవోటీ శిక్షణకు ఎంపికైన ఒక్కో మండలం నుంచి పంచాయతీ కార్యదర్శి, ఒక డేటాఎంట్రీ ఆపరేటర్ హాజరయ్యారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేయాలి

నెల్లిమర్ల: మండలంలోని అన్ని గ్రామాల రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేయాలని వ్యవసాయ సలహామండలి చైర్మన్ జమ్ము అప్పలనాయుడు అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టీఏ, డీఈఓ, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలుపై రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2060, బి గ్రేడ్ రకానికి 2040 రూపాయలుగా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

విజయనగరం టౌన్: గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ ఇచ్చి విశాఖ, విజయవాడ, హైదరాబాద్‌లలో గల ప్రముఖ హోటల్స్‌లో ఉద్యోగవకాశాలు కలిపిస్తామని ఎల్‌జీఎమ్ఎమ్ ట్రెనింగ్ జాబ్స్ జిల్లా అధికారి డి.మార్టిన్ లూథర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న యువత 77025 68799, 70364 06699 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఐసీడీఎస్ పీడీకి మెమో..

విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కేసలి అప్పారావు ప్రొటోకాల్ విషయంలో నిబంధనలు ఉల్లంఘించిన నేపథ్యంలో ఐసీడీఎస్ పీడీ శాంతకుమారికి ఆర్‌జేడీ చిన్మయిదేవి శుక్రవారం రాత్రి మెమో జారీ చేశారు. 24 గంటల్లోగా సంజాయిషీ ఇవ్వాలని మెమోలో పేర్కొన్నారు.

ఎకరాకు 22 క్వింటాళ్ల దిగుబడి

• వ్యవసాయశాఖ ఏడీఏ కె.మహరాజన్

గజపతినగరం: ఈ ఏడాది ఖరీఫ్‌లో ధాన్యం దిగుబడి బాగుందని వ్యవసాయశాఖ ఏడీఏ కె.మహరాజన్ తెలిపారు. మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామంలో మీసాల సన్యాసి అనే రైతు పొలంలో శుక్రవారం పంటకోత ప్రయోగాలు చేపట్టారు. 5''5 మీటర్ల విస్తీర్ణంలో పంటకోత ప్రయోగం చేయగా 15.50 కిలోల దిగుబడి వచ్చినట్లు లెక్కించారు. ఎకరానికి సుమారు 24.80 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టే పంటకోత ప్రయోగాల్లో ఎకరాకు సరాసరి 22 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. అనంతరం ఏరువాక శాస్త్రవేత్త తేజేశ్వరరావు మొక్కజొన్న సాగులో మెలకువలను వివరించారు. జీరో టిల్లేజి పద్ధతిలో మొక్కజొన్న విత్తనాలు నాటడం వలన పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. తాడు సాయంతో వరుస వరుసకు 60 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 20 సెంటీమీటర్లు దూరం ఉండేలా విత్తనాలను విత్తుకోవాలని తేజేశ్వరరావు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ధనలక్ష్మి, వీఏఏలు పాల్గొన్నారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ

వేపాడ: మండలంలోని కేజీబీవీ, ఆదర్శపాఠశాల, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా ఆయా పాఠశాలల పరిసరాలను పరిశీలించారు. ఆదర్శ పాఠశాలలో తరగతి గదుల పక్కన ఉన్న చెత్తను తొలగించాలని, ప్రహరీకి గేటు ఏర్పాటు చేయాలని, మైదానంలో మొక్కలు నాటించాలని ప్రిన్సిపాల్ ఈశ్వరరావుకు సూచించారు. ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో పెరిగిన తుప్పలను తొలగించాలని, మైదానాన్ని చదును చేయించాలని ప్రిన్సిపాల్ ఉషారాణికి సూచించారు. అనంతరం గురుకులం ఉపాధ్యాయులతో సమీక్షించారు. బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ఆరా తీశారు. 9వ తరగతి నుంచే ట్రిపుల్ ఐటీ కోర్సుపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన ఇద్దరు విద్యార్థులను డీఈఓ అభినందించారు. దాతలు అందించిన రూ.1500 నగదు ప్రోత్సాహకాన్ని విద్యార్థులకు అందజేశారు. అనంతరం కేజీబీవీని సందర్శించి విద్యాబోధన, భోజన మెనూ అమలు తదితర అంశాలపై ఆరాతీశారు.

మహిళల రక్షణకు ఎన్నో చట్టాలు

• దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ ప్రొఫెసర్ సీపీ నందిని



మాట్లాడుతున్న దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ సీపీ నందిని

డెంకాడ: మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని.. గౌరవంగా జీవించే హక్కును ఎవరు హరించినా శిక్షార్హులని దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ సీపీ నందిని అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో డబ్ల్యూఈసీ యూనిట్ ఆధ్వర్యంలో మహిళలపై హింస – నిర్మూలనపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళల భద్రత కోసం రాజ్యాంగం కొన్ని హక్కులను ప్రసాదించిందన్నారు. సమాజంలో కొందరు మహిళలపై జరుగుతున్న హింస ఆందోళన కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎల్ రాజు, స్టూడెంట్ డీన్ ఎస్.మోహన్‌కుమార్, డబ్ల్యూఈసీ కన్వీనర్ సారా కమలకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అఖండ మెజార్టీ ఖాయం



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

• ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయండి
• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజా విశ్వాసమే ఆయుధంగా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీ సాధిస్తుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. శుక్రవారం స్థానిక కేంద్రాస్పత్రి ఎదురుగా గల వైఎస్సార్‌సీపీ జోనల్ కార్యాలయంలో 37, 38, 39, 42, 43 డివిజన్‌లకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలుకు క్యాలెండర్ రూపొందించిన ఘనత జగనన్నకే దక్కిందని చెప్పారు. జగనన్న కాలనీల్లో అవినీతి జరిగిదంటూ కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన పవన్‌కల్యాణ్ జగనన్న కాలనీల ఏర్పాటులో అవినీతి జరిగిపోయిందంటూ చేసిన ఆరోపణలకు భయపడేది లేదని, అవినీతికి ఆస్కారంల లేకుండా కాలనీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధం కావాలని, క్షేత్ర స్థాయిలో పార్టీ మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జోన్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పిన్నింటి కళావతి, ఆర్‌కే, దాసరి సత్యవతి, తొగరోతు సంధ్యారాణి, వింత ప్రభాకరరెడ్డి, పార్టీ నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, బొబ్బాది నారాయణప్పడు పాల్గొన్నారు.

ప్రయాణికులకు అన్‌లిమిటెడ్ ఇంటర్నెట్



మాట్లాడుతున్న రైల్వేలైన్ ఇంటర్నెట్ రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ వై.సీతారాం

విజయనగరం టౌన్: రాష్ట్రంలోని ఏ రైల్వేస్టేషన్‌లోనైనా అన్‌లిమిటెడ్ వైఫేను (ఇంటర్నెట్) ప్రయాణికులు వినియోగించుకునే అవకాశాన్ని రైల్వేవైర్ సంస్థ అందుబాటులోకి తీసుకువచ్చిందని రైల్వే లైన్ ఇంటర్‌నెట్ రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ వై.సీతారాం అన్నారు. శుక్రవారం స్థానిక కణపాక యూత్ హాస్టల్‌లో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాలకు సంబంధించిన సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారుల శ్రేయస్సే ప్రధానంగా రైల్వేవైర్ సంస్థ పనిచేస్తోందన్నారు. ఇతర సంస్థల కన్నా తక్కువ ధరకే ఓటీటీ, ఐపీటీవీ, అన్‌లిమిటెడ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. రైల్వే వైర్ కనెక్షన్ పొందిన కస్టమర్ ఎవరైనా సరే దేశంలోని ఏ రైల్వేస్టేషన్‌లోనైనా అన్‌లిమిటెడ్ వైఫై వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. కేబుల్ ఆపరేటర్లు, కస్టమర్లు ఎవరైనా రైల్వే లైన్ నెట్ సౌకర్యం కావాలనుకుంటే 1800 1039 139 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టెక్నికల్ మేనేజర్ శోభనాద్రి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కనకరాజు, జిల్లా ఎంఎస్ఓ పి.కిశోర్‌కుమార్‌తో పాటు మూడు జిల్లాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

హింస లేని సమాజం అవసరం



నినాదాలు చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

విజయనగరం ఫూల్‌బాగ్: హింసలేని సమాజం కోసం మహిళాలోకం ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ పిలుపునిచ్చారు. నవంబర్ 25 అంతర్జాతీయ హింసా వ్యతిరేదినం, డిసెంబర్ 10 మానవహక్కుల దినోత్సవాలను పురస్కరించుకొని ఐద్వా ఆధ్వర్యంలో సదస్సులు, ర్యాలీలు చేపట్టాలన్న ఆలిండియా ఐద్వా పిలుపు మేరకు శుక్రవారం స్థానిక 45వ వార్డు ఎల్‌బీజీ నగర్‌లో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రోజూరోజుకీ మహిళలపై రకరకాల రూపల్లో దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణకు ఐద్వా పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పుణ్యవతి, కుమారి, కృష్ణమ్మ, తదతరులు పాల్గొన్నారు.

వెలుగులు చూపిన రారాజు జీసస్

• నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రావణి

విజయనగరం టౌన్: లోకానికి వెలుగులు చూపిన రారాజు జీసస్ అని విజయనగరం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. స్థానిక గురజాడ కళా భారతి ఆడిటోరియంలో ఏసు ప్రేమాలయం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన మినీ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేశారు. పాస్టర్ అలజంగి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహకులు డిప్యూటీ మేయర్‌ను ఉచిత రీతిన సత్కరించారు. చిన్నారులు క్రీస్తును స్తుతిస్తూ చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చౌదరి, వినయ్, ఆనంద్, అంజలి, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అతావుల్లా బాబా జయంతి



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ ఖలీల్

విజయనగరం టౌన్:

హజరత్ ఖాదర్ వలీబాబా ప్రియశిష్యులు, సూఫీ పరంపర వారసులు హజరత్ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా 86వ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాబా దర్గా, దర్బార్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా ధర్మకర్త డాక్టర్ ఎం.డి. ఖలీల్ షరీఫ్ షా భక్తులకు బాబా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏటీకే వెలుగు వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. సాయంత్రం దర్గాలో బాబాకి చాదర్, సుగంధ, గులాబీల సమర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో లింగం రవిబాబు, శరత్‌బాబు, బసివిరెడ్డి కంబాల, మహేష్, రామిరెడ్డి, శ్రీను, డాక్టర్ అవసరాల శ్రీధర్, భీమవరం ప్రసాద్, వైజాగ్ సుబ్రహ్మణ్యం, మరిశర్ల సీతాపతి, తదితరులు పాల్గొన్నారు.



పల్నాడు జిల్లా దైద గ్రామంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



కర్నూలు జిల్లా రామకొండలో అవ్వలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



ఏలూరు జిల్లా చెంచుగూడెంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



విజయనగరం పూల్‌బాగ్ కాలనీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

క్లుప్తంగా

జేసీ ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌లపై హత్యాయత్నం కేసు

తాడిపత్రి అర్బన్: అనంతపురం జిల్లా తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గండికోట హాజీ బాషా అలియాస్ ఘోరా హాజీపై దాడి చేసి గాయపరిచిన ఘటనకు సంబంధించి టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి, అతని కుమారుడు, జేసీ అస్మిత్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ వీఎన్‌కే చైతన్య తెలిపారు. ఈ నెల 23న తాడిపత్రిలోని మూడో వార్డు పర్యటనకు వెళ్లిన అస్మిత్‌రెడ్డి, ఆయన అనుచరుడు ఖాదర్‌బాషా మరికొందరు.. అదే వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కవ్వింపు చర్యలకు దిగారు. అంతటితో ఆగకుండా దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో హాజీబాషా తీవ్రంగా గాయపడ్డాడు. అతని ఫిర్యాదు మేరకు జేసీ ప్రభాకర్‌రెడ్డి, జేసీ అస్మిత్‌రెడ్డి, అనుచరులు ఖాదర్‌బాషా, ఫిల్టర్ బీడీ యజమాని అయూబ్‌తో పాటు మరో పది మంది టీడీపీ నేతలపై 147, 148, 307, 506 రెడ్‌విత్ 149 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

కొత్తపేటలో కృష్ణ విగ్రహాలు



కొత్తపేట: సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాలు కోనసీమ జిల్లా కొత్తపేటలోని వుడయార్ ఫైన్ ఆర్ట్స్‌లో రూపుదిద్దుకున్నాయి. ఆయన దశదినకర్మ కార్యక్రమాలను కృష్ణ కుటుంబ సభ్యులు, ఫిలిం ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణ విగ్రహాలు తయారు చేయాలని కొత్తపేటలో ప్రముఖ జాతీయ శిల్పి రాజ్‌కుమార్ వుడయార్‌ను కోరారు. సిలికాన్ వ్యాక్స్ మెటీరియల్‌తో కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే విగ్రహాలు రూపొందించినట్టు శిల్పి వుడయార్ తెలిపారు.

నేడు, రేపు తేలికపాటి వానలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంపైకి తూర్పు, ఈశాన్య దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా శని, ఆదివారాల్లో రాష్ట్రంలో ఒకటిరెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం రాత్రి నివేదికలో తెలిపింది. మరోవైపు డిసెంబర్ 3 లేదా 4 తేదీల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో అండమాన్ సముద్రానికి ఆనుకుని అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. అనంతరం అది వాయవ్యదిశగా కదులుతూ వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం రాష్ట్రంలో శ్రీకాకుళం, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, విశాఖపట్నం, బాపట్ల, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి.

● తెలంగాణ

బీజేపీలో చేరిన మర్రి శశిధర్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు మర్రి శశిధర్‌రెడ్డి కమలదళంలో చేరారు. కాంగ్రెస్ పార్టీకి క్యాన్సర్ వచ్చిందంటూ గతవారం సంచలన వ్యాఖ్యలు చేసిన మర్రి శశిధర్‌రెడ్డికి శుక్రవారం ఢిల్లీలో బీజేపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్రమంత్రి శర్బానంద్ సోనోవాల్ పార్టీ సభ్యత్వ నమోదు రశీదు ఇచ్చి, కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం శశిధర్‌రెడ్డి సహా తెలంగాణ నేతలందరూ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసానికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. ఆ తరువాత శశిధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం పురోభివృద్ధి దిశగా అడుగులేస్తోందని, ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న తాను ఎంతో ఆలోచించిన తర్వాతే బీజేపీలో చేరానని పేర్కొన్నారు.

ఆక్వారైతుకు ప్రభుత్వం అండ

రైతుల సమస్యలపై సీఎం వైఎస్ జగన్ అప్సడాను రంగంలోకి దింపారు

- అందుకే జిల్లాల వారీగా రైతులు, ఎగుమతిదారులతో సమావేశాలు
- ప్రాసెసింగ్ ప్లాంట్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రొయ్యలు కొనాల్సిందే
- ఒంగోలులో జరిగిన సమావేశంలో అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం



ప్రకాశం,నెల్లూరు,గుంటూరు జిల్లాల రొయ్యల రైతుల సమస్యలపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం, వేదికపై ఎంపీ బీద మస్తాన్ రావు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఆక్వారైతులకు భరోసా కల్పించే విధంగా అన్ని విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా ఉంటోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలెప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురాం చెప్పారు. ఆక్వారైతులను సంక్షోభం నుంచి బయటపడేయాలనే ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. ప్రస్తుతం ఉన్న రొయ్యల ధరల సంక్షోభాన్ని నివారించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్సడాను రంగంలోకి దింపారని చెప్పారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల ఆక్వా రైతులు, ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు, ఎగుమతిదారులు, డీలర్ల సమావేశం శుక్రవారం ఒంగోలులో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రైతుపక్షపాతి అని చెప్పారు. రాష్ట్రంలో రైతులకోసం ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఆక్వారంగంలో వచ్చిన సంక్షోభాన్ని త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంత్రులతో కూడిన సబ్ కమిటీ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఆక్వా సంక్షోభంపై సమీక్షిస్తూ రైతుకు ధర వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిందేనని ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు, ఎగుమతిదారులకు స్పష్టం చేశారు. 15 రోజులపాటు ఇవే ధరలు యథాతథంగా ఉండాలన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి సీఎం కృషి

విద్యుత్ సమస్యను కూడా పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్ ఆర్థిక విభాగం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్‌ల పద్ధతి తీసుకువచ్చింది అప్పటి సీఎం చంద్రబాబునాయుడేనని చెప్పారు. ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానుల సమస్యలను కూడా ముఖ్యమంత్రి జగన్ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సునీల్ గోయల్ కాకినాడకు వచ్చినప్పుడు కూడా చర్చించారన్నారు. రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి పూనం మాలకొండయ్య రెండుసార్లు ఢిల్లీ వెళ్లి మాట్లాడారని తెలిపారు. రైతులు ధైర్యంగా ఉండాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ ఆక్వా రైతులకు మంచి చేస్తూ త్వరలో ప్రకటన చేస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

సంక్షోభం తాత్కాలికమే

రైతు, ప్రాసెసింగ్ ప్లాంట్ ప్రతినిధిగా హాజరైన వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ఆక్వాలో ప్రస్తుత సంక్షోభం తాత్కాలికమేనని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఒడుదొడుకుల ప్రభావంతో ధరలు తగ్గినమాట వాస్తవమేనన్నారు. అయితే ప్రభుత్వం నిర్ణయించిన ధరకు దేవీ సీఫుడ్స్‌తోపాటు అన్ని ఎగుమతి సంస్థలు అంగీకరించాయని చెప్పారు. స్థానికంగా ఉన్న ప్రాసెసింగ్ ప్లాంట్లకు ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన రైతుల సరుకు కొనుగోలు చేస్తామని అందరూ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ప్రకాశం జిల్లా ఆక్వారైతుల సంఘం కన్వీనర్ దుగ్గినేని గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రొయ్యరైతుల సంఘం జాతీయ అధ్యక్షుడు మోహనరాజు, దేవీ సీఫుడ్స్ చైర్మన్ బ్రహ్మానందం, పలువురు ఎక్స్‌పోర్టర్లు, ఆయా జిల్లాల రైతులు పాల్గొన్నారు.


బాబు, పవన్‌లకు తగిన శాస్తి తప్పదు

- 789వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



తాడికొండ: ప్రభుత్వంపై బురదజల్లాలని చూస్తే చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు తగిన శాస్తి తప్పదని బహుజన పరిరక్షణ సమితి నేతలు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 789వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో శుక్రవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. యావత్ రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం అభివృద్ధి, సంక్షేమంతో సంతోషంగా ఉంటే.. చంద్రబాబుతో కలిసి పవన్‌కళ్యాణ్ వేస్తున్న వేషాలు చూసి ప్రజలు విస్తుబోతున్నారని మండిపడ్డారు. మూడు రాజధానులు, ఇప్పటంలో రహదారి విస్తరణ విషయంలో రాద్ధాంతం చేయాలని చూసి బొక్క బోర్లా పడ్డ ఎల్లో గ్యాంగ్, వారికి సహకరిస్తున్న పవన్‌కళ్యాణ్‌కు కోర్టు చురకలు అంటించి హెచ్చరించడం శుభపరిణామం అన్నారు. రాజధానిలో చంద్రబాబు చేస్తున్న హడావుడికి ఇక పూర్తిగా కాలం చెల్లినట్టేనన్నారు. 14 ఏళ్ల అధికారాన్నిస్తే బహుజనులను అణగదొక్కి కులోన్మాదంతో కోట్ల రూపాయలు కొల్లగొట్టిన చంద్రబాబు.. ఒక్క చాన్స్ ఇవ్వండి.. నాకు ఇక ఇదే ఆఖరి చాన్స్.. అని అర్థించడాన్ని చూస్తే, అమ్మకు అన్నం పెట్టని వాడు పిన్నమ్మకు బంగారు గాజులు కొనిపెడతానన్న సామెత గుర్తుకొస్తోందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజ్ పాల్గొన్నారు.

నా సభలు సక్సెస్: చంద్రబాబు



సాక్షి, అమరావతి: తాను ఇటీవల నందిగామ, కర్నూలుల్లో చేసిన పర్యటనలు సక్సెస్ అయ్యాయని చంద్రబాబు చెప్పారు. గతంలో ఎప్పుడూ రానంత మంది జనం ఈ సభలకు వచ్చారన్నారు. తన జీవితంలో చూడని ప్రజాస్పందన కర్నూలులో చూశానన్నారు. దీనికి కారణం ఏంటనే విషయాన్ని కూడా తాను విశ్లేషించానని చెప్పారు. తమ భవిష్యత్తు కోసం ప్రజలు తరలివచ్చి తనకు మద్దతు తెలిపారన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఎస్.కోట, నరసన్నపేట, పెడన ఇన్‌చార్జిలు కోళ్ల లలితకుమారి, బగ్గు రమణమూర్తి, కాగిత కృష్ణప్రసాద్‌లతో నిర్వహించిన ముఖాముఖి సమావేశాల్లో చంద్రబాబు మాట్లాడినట్లు టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పాలనలో వైఫల్యాలు, ప్రజావ్యతిరేక నిర్ణయాల వల్ల వైఎస్సార్‌సీపీ దారుణంగా దెబ్బతిందని చెప్పారు. రాజకీయ మనుగడ కోసమే సీఎం సహా నేతలంతా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. తన జిల్లా పర్యటనలకు వస్తున్న స్పందనతో వారిలో కలవరం మొదలైందని పేర్కొన్నారు. పులివెందులలోను సీఎం జగన్‌కి ఎదురుగాలి మొదలైందన్నారు. ప్రజల బాధలపై పార్టీ తలపెట్టిన 'ఇదేం ఖర్మ' కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని సూచించారు. నేతలు పార్టీ కార్యక్రమాల నిర్వహణలో వెనుకబడితే వారే నష్టపోతారని హెచ్చరించారు.

'ఆక్వాజోన్'ను ప్రవేశపెట్టింది చంద్రబాబే

- ఆయనే ఇప్పుడు ఉద్ధరిస్తానని చెప్పడం హాస్యాస్పదం
- ఆక్వా సాగుకు విద్యుత్ రాయితీ ఇచ్చింది వైఎస్సార్‌సీపీ సర్కారే
- ఎంపీ మోపిదేవి, మంత్రి అప్పలరాజు





నిజాంపట్నం/మందస: అధికారంలో ఉన్నప్పుడు ఆక్వారంగాన్ని గాలికొదిలేసిన చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే ఉద్ధరిస్తానని చెప్పడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మండిపడ్డారు. ఆక్వా జోన్ వ్యవస్థను ప్రవేశపెట్టిన చంద్రబాబే మళ్లీ అధికారంలోకి వస్తే జోన్ వ్యవస్థను తీసేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో మోపిదేవి, శ్రీకాకుళం జిల్లా మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన బహడపల్లి పంచాయతీ నల్లబొడ్లూరులో అప్పలరాజు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. వారేమన్నారంటే..

రూ.1.50కే విద్యుత్ బాబు ఎందుకివ్వలేదు?

చంద్రబాబు అధికారంలో ఉండగా రొయ్యల మేత ధరలు పెంచుకుంటూ పోయినా, రొయ్యల ధరలు తగ్గించినా అప్పట్లో నోరుమెదపని ఆయన ఇప్పుడు తాను అధికారంలోకి వస్తే రాయితీపై బోర్లు, ఫ్యాన్లు అందిస్తామని చెప్పడం సిగ్గుచేటు. అలాగే, 2016–17లో ఆక్వాజోన్ వ్యవస్థను తీసుకువచ్చిన చంద్రబాబునాయుడు ఆక్వాజోన్ వ్యవస్థను తీసివేస్తానని చెప్పడం ఏమిటి? ఆక్వాజోన్‌కు సంబంధం లేకుండా విద్యుత్ యూనిట్ ధర రూ.1.50కే అందిస్తామని చెప్పే బాబు ఆయన హయాంలో ఎందుకివ్వలేకపోయారు? వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జోన్ వ్యవస్థను సడలింపుచేసి రైతులందరికీ మేలు చేస్తుంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆక్వా రైతులకు రూ.1.50కే తాము విద్యుత్‌ను అందిస్తున్నాం. ఇటీవల పెరిగిన మేత ధరలను సీఎం జగన్ తగ్గించేలా చేశారు. వైఎస్సార్ జలకళ పథకం ద్వారా రైతులకు ఇప్పటికే ఉచితంగా బోర్లు వేస్తున్న విషయం చంద్రబాబుకు తెలీదా? ప్రస్తుతం అంతర్జాతీయ పరిణామాల కారణంగా ఆక్వా రంగానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇవి తాత్కాలికమే. ఈ రంగాన్ని ఆదుకునేందుకే సీఎం త్రిసభ్య కమిటీ వేశారు. చంద్రబాబు కల్లబొల్లి మాటలను ప్రజలు విశ్వసించే పరిస్థితిలేదు.

మాఫియాలా చంద్రబాబు అండ్ కో : మంత్రి అప్పలరాజు

చంద్రబాబు అండ్ కో ఓ మాఫియా ముఠాగా మారింది. టీడీపీ హయాంలో విద్యుత్ సబ్సిడీకి సంబంధించి ఒక్క రూపాయి కూడా ఆక్వా రైతులకివ్వలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే మేం అప్పటి సబ్సిడీ రూ.330కోట్ల బకాయిలను తీర్చాం. ఉభయగోదావరి జిల్లాల్లో నీటి కొరత ఉందని, కన్వర్షన్ ఆఫ్ నాన్ ఆక్వాజోన్ టు ఆక్వా జోన్‌కు కృషిచేస్తున్నాం. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్న చంద్రబాబుకు మతిభ్రమించింది. ఈ రంగంపట్ల సీఎం జగన్ తీసుకుంటున్న చర్యలతో కేంద్రం రాష్ట్రానికి ది బెస్ట్ మెరైన్ స్టేట్ ఇచ్చింది. 2014–15లో ఎగుమతులు విలువ రూ.9,000 కోట్లుండగా, ఇప్పుడు రూ.20,000 కోట్లకు పెరిగింది. కోవిడ్ వేళ కూడా ఆక్వాను ప్రభుత్వం ఆదుకుంది. తలకిందులుగా తపస్సు చేసినా బాబు ఇచ్చిన మాటను నెరవేర్చుకోలేరు.

పారిశ్రామిక ప్రగతిలో దేశానికే దిక్సూచి

త్వరలో 10 పోర్టుల రాష్ట్రంగా ఏపీ

- కాకినాడ యాంకరేజ్ పోర్టులో రూ.90 కోట్లతో మౌలిక సదుపాయాల పనులకు మంత్రుల శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు అమర్నాథ్, దాడిశెట్టి , చెల్లుబోయిన, ఎంపీ గీత, ఎమ్మెల్యేలు తదితరులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పారిశ్రామిక ప్రగతిలో రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలుస్తుందని పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. దేశంలో అత్యధికంగా ఎగుమతి, దిగుమతులు నిర్వహించే 10 పోర్టులున్న రాష్ట్రంగా చరిత్ర సృష్టిస్తోందన్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో రూ.90 కోట్లతో చేపడుతోన్న మౌలిక సదుపాయాల కల్పన పనులకు మంత్రులు అమర్నాథ్, దాడిశెట్టి రాజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ వంగా గీత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కాకినాడలో తొలిసారి 8,000 టన్నుల సామర్థ్యంతో సాన్‌మెరైన్ నిర్మించిన నౌకను సముద్ర జలాల్లోకి పంపించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విశాఖ, గంగవరం, కాకినాడ డీప్‌వాటర్ పోర్టు, యాంకరేజ్ పోర్టు, రవ్వ కేప్టివ్ పోర్టు, కృష్ణపట్నం పోర్టుతో కలిపి మొత్తం ఆరు పోర్టులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మూడు పోర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. రామాయపట్నంలో రూ.3,500 కోట్లతో పోర్టు నిర్మాణం చేపడుతుండగా, మచిలీపట్నంలో రూ.4 వేల కోట్లతో మరో పోర్టు నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రక్రియ అంతా పూర్తి అయ్యిందని చెప్పారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా వచ్చే నెల 21న సీఎం దీనికి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ పోర్టుతో పాటు భావనపాడు, కాకినాడ కేఎస్ఈజెడ్‌లో కొత్తగా మరో పోర్టు వస్తోందన్నారు.

యాంకరేజ్ పోర్టుకు పూర్వ వైభవం


కాకినాడ పోర్టు నుంచి బీహార్, చత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల ద్వారా బియ్యం ఎగుమతి జరుగుతుంటే ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని మంత్రి అమర్నాథ్ మండిపడ్డారు. కార్మికులు రోడ్డున పడిపోతారని ప్రతిపక్షాలు చేస్తోన్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ 30 వేల మందికి ఉపాధి కలిగేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.90 కోట్లు కేటాయించి కాకినాడ యాంకరేజ్ పోర్టుకు పూర్వ వైభవం తీసుకువస్తున్నారన్నారు. ఇప్పుడున్న నాలుగు మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని ఐదు మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచుతున్నామన్నారు. పోర్టులను మరింత మెరుగు పరిచేందుకు అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డును తీసుకు వచ్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, మారిటైమ్ బోర్డు డిప్యూటీ సీఈవో బిఎం రవీంద్రరెడ్డి, పోర్టు ఆఫీసర్ ధర్మశాస్త్ర తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది ఫిషింగ్ హార్బర్‌లు

రాష్ట్రంలో తొమ్మిది ఫిషింగ్ హార్బర్‌లను ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా చేపడుతున్నామని మంత్రి అమర్నాథ్ తెలిపారు. ఇప్పటికే నాలుగు నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. జువ్వలదిన్నెలో హార్బర్‌ను జనవరిలో ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. ఉప్పాడలో రూ.271 కోట్లతో హార్బర్ నిర్మాణం చురుగ్గా జరుగుతోందన్నారు. తొమ్మిది హార్బర్‌లు, 10 పోర్టులతో సముద్ర తీర ప్రాంతాన్ని అంతటినీ సద్వినియోగం చేసుకుంటోన్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. దేశంలో 17 రాష్ట్రాలు పోటీపడితే చివరకు మూడు రాష్ట్రాల్లో హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్‌తో పాటు మన రాష్ట్రానికి మాత్రమే బల్క్ డ్రగ్ పార్కు వచ్చిందన్నారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వం రూ.1,000 కోట్లు కేటాయిస్తోందని తెలిపారు. ఈ పార్కు ద్వారా 20 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. బల్క్ డ్రగ్ పార్కు వస్తే జ్వరం, దగ్గు వస్తుందని కుంటిసాకులతో అడ్డుపడేలా కేంద్రానికి లేఖలు రాసిన ప్రతిపక్ష నేతలను ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

హైకోర్టు జడ్జీల బదిలీపై టీడీపీ యాగీ

- జస్టిస్ దేవానంద్, జస్టిస్ రమేశ్‌ల బదిలీపై ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన
- ముందుండి నడిపించిన లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు
- న్యాయవాదుల సంఘం లేకుండానే బహిష్కరణకు పిలుపు.. జడ్జీల అభ్యంతరం
- బదిలీలకు వ్యతిరేకంగా నినాదాలు.. కొలీజియం, సీఎంపై నిందలు
- హైకోర్టు న్యాయవాదుల సంఘం పేరుతో తీర్మానాలు
- ఆ తీర్మానాలతో తమకు సంబంధం లేదన్న న్యాయవాదుల సంఘం
- సుప్రీంకోర్టు ఆదేశాలకు కట్టుబడి ఉన్నామని స్పష్టీకరణ
- కొలీజియంకు, సీఎంకు దురుద్దేశాలు ఆపాదించడంపై అదనపు ఏజీ మండిపాటు



హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలియజేస్తున్న టీడీపీ లీగల్ సెల్, ఇతర న్యాయవాదులు

సాక్షి, అమరావతి: హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ దొనడి రమేశ్‌లను బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం చేసిన తీర్మానాన్ని నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో కొందరు న్యాయవాదులు శుక్రవారం హైకోర్టు విధులను బహిష్కరించారు. ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఉదయం కోర్టు విధులు ప్రారంభం కాగానే టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొందరు న్యాయవాదులు పలు కోర్టు హాళ్లలోకి వెళ్లి విధుల బహిష్కరణకు సహకరించాలని న్యాయమూర్తులను కోరారు. ఇదే సమయంలో నిరసనకారుల్లో కొందరు.. సహచర న్యాయవాదులను తీవ్ర స్వరంతో హెచ్చరిస్తున్న ధోరణిలో బహిష్కరణకు సహకరించాలని కోరారు. దీంతో నిరసనకారుల తీరు పట్ల కొందరు న్యాయమూర్తులు అసహనం వ్యక్తం చేశారు. అసలు హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు రాకుండా మీరెలా విధుల బహిష్కరణ చేపడుతారంటూ నిరసనకారులను ఆ న్యాయమూర్తులు ప్రశ్నించారు. కోర్టు హాళ్లలో అరవడం వంటివి చేయవద్దని, కోర్టు బయటకు వెళ్లి చూసుకోండని తేల్చి చెప్పారు. దీంతో కొంత వెనక్కి తగ్గిన నిరసనకారులు ఆయా కోర్టులకు వెళ్లి న్యాయవాదులను విధుల బహిష్కరణకు సహకరించాలంటూ అభ్యర్థించారు. దీంతో కొందరు న్యాయవాదులు కోర్టు హాళ్ల నుంచి బయటకు రాగా, మరికొందరు కోర్టు హాళ్లలోనే ఉండిపోయారు. న్యాయమూర్తులు సైతం కేసుల విచారణను ప్రారంభించారు. నిరసనకారులు తిరిగి కోర్టు హాళ్లకు వచ్చి పదే పదే విజ్ఞప్తి చేయడంతో న్యాయవాదులు బయటకు వచ్చారు. దీంతో న్యాయమూర్తులు కొద్దిసేపటి తరువాత బెంచ్ దిగి తమ తమ ఛాంబర్లకు వెళ్లిపోయారు. బెంచ్‌లు దిగేసినప్పటికీ న్యాయమూర్తులు సాయంకాలం వరకు హైకోర్టులోనే ఉన్నారు. హైకోర్టు పాలనా కార్యకలాపాలు యథాతథంగా సాగాయి.

హైకోర్టు ప్రధాన ద్వారం నుంచి ర్యాలీ

టీడీపీ లీగల్ సెల్‌కు చెందిన న్యాయవాదులు ఇతర పార్టీలకు చెందిన కొంత మంది న్యాయవాదులను పోగు చేసి, హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద జస్టిస్ దేవానంద్, జస్టిస్ రమేశ్‌ల బదిలీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏకపక్ష బదిలీలను ఆపాలని నినదించారు. హైకోర్టు ప్రధాన ద్వారం నుంచి క్యాంటీన్ వరకు ర్యాలీ చేపట్టారు. తెలుగుదేశం పార్టీ మద్దతుతో రోజూ ఎల్లో మీడియా చర్చల్లో పాల్గొనే ఓ న్యాయవాది టీడీపీ న్యాయవాదుల ప్రోద్బలంతో ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతేకాక ఈ న్యాయమూర్తుల బదిలీలను రాష్ట్ర ప్రభుత్వానికి ఆపాదించారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రోద్బలంతోనే ప్రజా జడ్జీలుగా ముద్రపడిన ఈ ఇద్దరు న్యాయమూర్తుల బదిలీ జరుగుతోందని ఆ న్యాయవాది ఆరోపించారు. ఈ బదిలీల్లోకి కులాన్ని సైతం లాగారు. ర్యాలీ అనంతరం నిరసనకారుల్లో పలువురు తమ దారిన తాము వెళ్లిపోయారు. కొందరు మాత్రం హైకోర్టు న్యాయవాదుల సంఘంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తుల బదిలీకి వ్యతిరేకంగా హైకోర్టు న్యాయవాదుల సంఘం పేరు మీద కొన్ని తీర్మానాలు చేశారు. బదిలీ సిఫారసులను ఆపేసి ఇద్దరు న్యాయమూర్తులను యథాతథంగా ఏపీ హైకోర్టులో కొనసాగేలా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరుతూ తీర్మానం చేశారు. బదిలీలకు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో నిరసనలు తెలియచేయాలని కూడా తీర్మానించారు. సోమవారం కూడా విధుల బహిష్కరణను కొనసాగించాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

ఇది న్యాయవ్యవస్థపై దాడి చేయడమే..

న్యాయమూర్తుల బదిలీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి ఆపాదించడం దారుణం. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులతో కూడిన కొలీజియం స్వతంత్రంగా వ్యవహరిస్తుంది. పరిపాలనా సౌలభ్యం కోసం న్యాయమూర్తులను బదిలీ చేస్తుందే తప్ప, అందులో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదు. ఫిర్యాదుల ఆధారంగా బదిలీ చేయడం ఉండదు. అంతర్గతంగా ఇంటెలిజెన్స్ ఇచ్చే సమాచారం ఆధారంగా కొలీజియం నిర్ణయం తీసుకుంటుంది. సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయాన్ని తప్పుపట్టే హక్కు ఎవరికీ లేదు. న్యాయమూర్తుల బదిలీలను ప్రశ్నించడమంటే సుప్రీంకోర్టు కొలీజియాన్ని అవమాన పరచడమే. ప్రభుత్వం చెబితేనే సుప్రీంకోర్టు కొలీజియం న్యాయమూర్తులను బదిలీ చేసిందని చెప్పడం న్యాయవ్యవస్థపై దాడి చేయడమే అవుతుంది. – పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, అదనపు అడ్వొకేట్ జనరల్

ఆ తీర్మానంతో సంబంధం లేదు

హైకోర్టు న్యాయవాదుల సంఘం పేరున తీర్మానం చేయడాన్ని హైకోర్టు న్యాయవాదుల సంఘం ఖండిస్తోంది. తీర్మానాలు చేసేందుకు ఆ న్యాయవాదులకు సంఘం ఎలాంటి ఆథరైజేషన్ ఇవ్వలేదు. న్యాయవాదులు ఎలాంటి సమ్మెకు పిలుపునివ్వడం గానీ, సమ్మెలో పాల్గొనరాదన్న సుప్రీం ఆదేశాలకు మా సంఘం కట్టుబడి ఉంది. హైకోర్టు విధుల బహిష్కరణకు మేం పిలుపునివ్వలేదు. న్యాయవాదులు కోర్టు విధులకు ఆటంకం కలిగించవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. –జానకిరామిరెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు

ప్యాకేజీ శ్రవణ్.. ఒళ్లు దగ్గరపెట్టుకో..

సీఎం జగన్‌పై న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ చేసిన ఆరోపణలు సబబు కాదు. తక్షణం సీఎంకు క్షమాపణ చెప్పాలి. స్వతంత్ర న్యాయవ్యవస్థకు కులాలను ఆపాదించడం దారుణం. శ్రవణ్‌కుమార్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి. శ్రవణ్ ఓ 420. జడ్జి కాకున్నా ఆ పదవి తగిలించుకున్న ఇతనిపై చీటింగ్ కేసు నమోదు చేయాలి. ప్యాకేజీకి ఆశపడి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. మరోసారి ఇలాంటి మాటలు మాట్లాడితే సహించేది లేదు.

– పెరికె వరప్రసాద్‌రావు, గవాస్కర్, బెజవాడ న్యాయవాదుల సంఘం

ప్రతి బిడ్డా ప్రత్యేకమే.
మీ బిడ్డ పదిలో ఒకరు కాకపోవచ్చు.
పదిమంది చేసినట్లు చేయకపోవచ్చు.
మీకు పుట్టింది ఐన్‌స్టీన్ కావచ్చు.
బిల్ గేట్స్ కూడా కావచ్చు.
బిడ్డ మేధాశక్తిని గ్రహించండి.
బిడ్డకు ఏమివ్వాలో తెలుసుకోండి.
మీ బిడ్డ విజేతగా నిలుస్తాడు.


హార్స్‌రైడింగ్ చేస్తున్న కుమారుడు హర్షవర్ధన్‌రావు ఫొటోను చూపిస్తున్న డాక్టర్ నీనారావు

విజేత తల్లి

హర్షవర్ధన్ రావు... యూఎస్‌లో స్కూల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసుకున్న ఆదిలాబాద్ కుర్రాడు. తల్లిదండ్రులు విదేశాల్లో స్థిరపడినప్పుడు పిల్లలు అక్కడే చదువుకుంటారు... అందులో కొత్త, వింత ఏమీ ఉండకపోవచ్చు. అయితే హర్ష ఒక విజేత. అతడి తల్లి నీనారావు అతడి మార్గదర్శి. కొడుకును తీర్చిదిద్దడం కోసం ఆమె తన కెరీర్‌ను వదులుకున్నారు. ఇప్పుడు హర్ష చదువు, ఆటపాటలు, హార్స్‌రైడింగ్ వంటి నైపుణ్యాల్లో ఆరితేరాడు. నేషనల్ లెవెల్ హార్స్ రైడింగ్ చాంపియన్‌షిప్ గెలుచుకున్నాడు. సానుభూతి చూపులతో సాంత్వన పొంది, అంతటితో తృప్తి పడి ఉంటే ఈ రోజు తన కొడుకును విజేతగా చూపించగలిగేవారు కాదు నీనారావు. ఈ ప్రయత్నంలో ఆమె టాప్ 100 హెల్త్ కేర్ లీడర్స్ కేటగిరీలో చేరారు. ఈ సందర్భంగా సాక్షితో ఆమె పంచుకున్న వివరాలు.

నా దిశ మారింది!

''మాది మహారాష్ట్ర, మా వారిది మంచిర్యాల. అలా తెలుగింటి కోడలినయ్యాను. నా జీవితాన్ని రెండు వేర్వేరు పార్శ్వాలుగా చూడాలి. తొలి పార్శ్వం పూర్తిగా అకడమిక్ గా సాగింది. పీహెచ్‌డీ పూర్తి చేసి ఎకనమిక్స్, హిస్టరీ, నేచురల్ రీసోర్సెస్ మేనేజ్‌మెంట్ విధానాలు, పర్యావరణ నిర్వహణ వంటి అంశాల మీద అనేక పరిశోధన పత్రాలను జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద సమర్పించాను. యూఎస్‌లో నివసిస్తున్న నేటివ్ అమెరికన్‌లు, ఆఫ్రికన్ అమెరికన్‌లు, లాటిన్ అమెరికన్ జాతులు, మనదేశంలో నాగాలాండ్, అండమాన్, ఇతర ఆదివాసీ జాతుల మీద పరిశోధనలు నిర్వహించాను. మా అబ్బాయి హర్షవర్ధన్ స్పెషల్ నీడ్స్ కిడ్ అని తెలిసిన తరవాత నా పంథా పూర్తిగా మారిపోయింది. మేము గుర్తించడం కూడా ఆలస్యంగానే జరిగింది. ఆ తర్వాత ఇక ఏ మాత్రం ఆలస్యం చేయలేదు. తనకు పన్నెండేళ్లు నిండినప్పుడు మేము యూఎస్‌కి తీసుకెళ్లిపోయాం. ఆస్పెర్గర్స్ సిండ్రోమ్ ఉందని చెప్పారు అక్కడి డాక్టర్లు. అంటే తన మనసులో అనుకున్న విషయాన్ని సంభాషణ ద్వారా వ్యక్తీకరించడంలో తగినంత చురుగ్గా లేకపోవడం అనవచ్చు. హర్ష చాలా తెలివైన పిల్లాడు, తన సమస్యను అధిగమించడానికి తల్లిదండ్రులుగా మా వంతు సపోర్టునివ్వాలి. అందుకోసం ఆటిజమ్‌తో సంబంధం ఉన్న అనేక సంస్థలు, నిపుణులను సంప్రదించాను. తనను ది బెస్ట్ కిడ్‌గా తయారు చేసుకోగలిగాను. యూఎస్‌లో హైస్కూల్‌లో ఆనర్స్ చేసి అండర్ గ్రాడ్యుయేషన్‌లో చేరాడు. హార్స్ రైడింగ్‌లో చురుగ్గా ఉన్నాడు. ఇంకో విషయం... మా అబ్బాయి యూఎస్‌లో చదివినప్పటికీ ఇంగ్లిష్‌తోపాటు తెలుగు చదవడం రాయడం కూడా బాగా నేర్చుకున్నాడు. నేను ఇంతగా శ్రమించడానికి ఆర్థిక వెసులుబాటు ఉంది. అలాగే భర్త, ఇతర కుటుంబ సభ్యుల సహకారం చాలా ఉంది. ఐదువందల మందిలో ఒక బిడ్డ ఇలా ఉండే అవకాశం ఉంది. అంటే ప్రపంచంలో నాలాంటి తల్లులు ఇంకా ఉన్నారు. అయితే వాళ్లందరికీ నాకు ఉన్న వెసులుబాటు ఉండకపోవచ్చు. అందుకే హర్ష కోసం యూఎస్, యూకే, ఇండియాలోని నిపుణుల ద్వారా నేను తెలుసుకున్న విషయాలన్నింటినీ క్రోడీకరిస్తూ స్పెషల్ నీడ్స్ ఉన్న పిల్లల కోసం ఒక నియమావళిని రూపొందించాను. కోవిడ్ సమయంలో ఆన్‌లైన్ క్లాసులకు హాజరు కాలేని పేదవాళ్లకు మార్గిక సేవాసంస్థ నుంచి సాధారణ మొబైల్ ఫోన్‌ల ద్వారా ప్రత్యేక సేవలందించాం. పేరెంట్స్‌తోపాటు స్పెషల్ ఎడ్యుకేటర్స్‌కి శిక్షణనిచ్చాం. వాళ్ల పిల్లలకు ఫోన్ ద్వారా రోజుకో టాస్క్ ఇస్తూ రోజంతా ఒక వ్యాపకంలో మునిగేలా చేశారు. అలాగే సైకాలజిస్టులు, కౌన్సెలర్‌లకు కూడా థియరిటికల్‌గా ట్రైనింగ్ ఇస్తున్నాం.

సానుభూతి వద్దు!

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లులకు నేను చెప్పేది ఒక్కటే. పిల్లలు పుట్టిన తర్వాత నెలలు గడిచే కొద్దీ మెడ నిలపాల్సిన సమయానికి మెడ నిలపకపోవడం, కూర్చోవాల్సిన సమయానికి కూర్చోకపోవడం, మాట్లాడాల్సిన వయసుకి మాట్లాడకపోవడం వంటి తేడాని గుర్తించిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఎవరూ ఇలాంటి స్థితిని కోరుకోరు. కానీ ఎదురైన తర్వాత ఎదుర్కోవడం ఒక్కటే మన ముందున్న ఆప్షన్. మానసికంగా కుంగిపోవద్దు. దేనినీ దాచవద్దు. పిల్లలను సమాజానికి చూపించకుండా ఇంట్లో ఉంచే ప్రయత్నం చేయవద్దు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పెంచాలి. పిల్లల మూడ్‌ని బట్టి ఆ సమయంలో వారిని ఎలా డీల్ చేయాలనే విషయంలో శిక్షణ తీసుకోవాలి. ఆ అవగాహనతో మెలగాలి. వారిలో తప్పనిసరిగా ప్రత్యేకమైన కళ ఏదో ఉండి తీరుతుంది. దానిని గ్రహించండి. దానిని సాధన చేయించండి. నేను ఓ చాంపియన్‌కి తల్లినయ్యాను. మీ బిడ్డ ఐన్‌స్టీన్ కావచ్చు... మీరు ఐన్‌స్టీన్ తల్లి కావచ్చు'' అన్నారు నీనారావు.

సింపతీ కోరుకోవద్దని తల్లులకు చెబుతూనే, 'ప్రత్యేకమైన పిల్లల పట్ల, ఆ తల్లిదండ్రుల పట్ల సానుభూతి చూపించడం మానేయండి. దానికి బదులు ప్రోత్సహించండి' అని సమాజానికి హితవు చేశారామె.

– వాకా మంజులారెడ్డి,
ఫొటోలు : మోహనాచారి



ప్రత్యేక చిత్రకారులు

స్పెషల్ నీడ్స్ ఉన్న పిల్లల్లో కొందరు చక్కగా పాటలు పాడేవాళ్లున్నారు. మరొకరు చక్కగా బొమ్మలు వేస్తారు. మరొకరు మంచి కవితలు రాస్తారు. వాళ్లలోని సృజనాత్మకతను బయటకు తీయడం మన బాధ్యత. పిల్లలు వేసిన బొమ్మలు, కవితలతో ఓ పుస్తకం ప్రచురించాం. మేఘన తల్లి ఇద్దరమ్మాయిలున్న సింగిల్ పేరెంట్. ఆ అమ్మాయి వేసిన బొమ్మ చూడండి. చెట్టు కొమ్మకు కట్టిన ఊయల, ఆ ఊయలలో తల్లి రూపం ఉంది. ఊయల లోపల పాపాయి ఉంది. పన్నెండేళ్ల అమ్మాయి మాతృత్వాన్ని ఎంత అద్భుతంగా చిత్రించిందో చూడండి. మరో అమ్మాయి సమాజంలో స్త్రీ ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకుని చక్కటి నినాదాలతో బొమ్మలు వేసింది. తమ మేధను వ్యక్తం చేయడానికి ఒక్కొక్కరు ఒక్కో మాధ్యమాన్ని ఎంచుకున్నట్లే వీరు కూడా.

– డాక్టర్ నీనారావు,
ఫౌండర్, మార్గిక స్వచ్ఛంద సంస్థ

సృజన

పర్యావరణధీర


'తెన్‌గపల్లి' షార్ట్ ఫిల్మ్‌లో...

పర్యావరణ ప్రేమికులకు ప్రీతిపాత్రమైన ఫిల్మ్ ఫెస్టివల్ ఆల్ లివింగ్ థింగ్స్ ఎన్విరాన్‌మెంటల్ ఫిల్మ్ ఫెస్టివల్ (ఎఎల్‌టీఇఎఫ్‌ఎఫ్). రెండు సంవత్సరాల క్రితం ఈ ఫెస్టివల్‌కు శ్రీకారం చుట్టారు. తాజా ఫిల్మ్‌ఫెస్టివల్‌లో దేశవిదేశాలకు చెందిన 55 చిత్రాలను ఢిల్లీ, ముంబై, బెంగళూరులాంటి ప్రధాన నగరాలలో ప్రదర్శిస్తున్నారు. ప్రకృతి సౌందర్యాన్ని వెండితెర మీదికి తీసుకురావడంతో పాటు వర్తమానానికి సంబంధించి పర్యావరణ సంక్షోభం గురించి ఆలోచన రేకెత్తించడం ఈ చిత్రోత్సవం ఉద్దేశం....

ఆ ఊళ్లో...శ్రిష్టి లఖేర తొలి ఫీచర్ డాక్యుమెంటరీ... ఏక్ థా గావ్/వన్స్ అపాన్ ఏ విలేజ్. ఈ డాక్యుమెంటరీ సియోల్ ఎకో ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'ఆడియన్స్ ఛాయిస్ అవార్డ్' గెలుచుకుంది. కేరళలో జరిగిన ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ అండ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'స్పెషల్ జ్యూరీ' అవార్డ్ గెలుచుకుంది. ఈ చిత్రం విషయానికి వస్తే...హిమాలయ పర్వతప్రాంతంలోని ఒక పురాతన గ్రామం సెమ్లు. ఒకప్పుడు ఎన్నో కుటుంబాలతో కళకళలాడిన ఈ ఊరు చిన్నబోయింది. నోరు మూగబోయింది. ఎటుచూసినా విషాద నిశ్శబ్దమే. దీనికి కారణం ఈ ఊళ్లోని వాళ్లు బతుకుదెరువు కోసం పట్నం బాట పట్టడం.

కేవలం అయిదుగురు మాత్రమే ఈ ఊళ్లో ఉంటున్నారు! ఆ అయిదుగురిలో 80 సంవత్సరాల లీలాదేవి, 19 సంవత్సరాల గోలు ఉన్నారు. అయిన వాళ్లందరూ పట్నంలో బతుకుతుంటే ఊళ్లో లీలాదేవి ఒంటరిదైపోతుంది. వృద్ధాప్య సమస్యలు, ఒంటరితనంతో ఆమె బాధపడుతుంటుంది. పట్నంలో ఉంటున్న కుమార్తె రమ్మంటున్నా తాను వెళ్లదు. ఎందుకంటే ఊరిని విడిచి వెళితే అమ్మను విడిచి వెళ్లినట్లుగా ఉంటుంది తనకు!

నిజానికి ఇది ఒక్క ఊరి కథ కాదు మన దేశంలోని ఎన్నో ఊళ్ల కథ. బతుకుదెరువు నుంచి పిల్లల చదువుల వరకు రకరకాల కారణాలతో ప్రజలు సొంత ఊళ్లు విడిచి వెళుతున్నారు. దీంతో ఆ ఊళ్లు జనసంచారం లేక పాడుబడ్డ ఊళ్లుగా మారుతున్నాయి.


శ్రిష్టి లఖేర

అరవై నిమిషాల ఈ చిత్రం భావోద్వేగ ప్రయాణం. జ్ఞాపకాల సమాహారం. శ్రిష్టి తల్లిదండ్రుల స్వగ్రామం సెమ్లు. లాక్‌డౌన్ సమయంలో తల్లిదండ్రులతో కలిసి చాలారోజులు ఈ గ్రామంలోనే ఉంది శ్రిష్టి. లీల దీనస్థితిని చూసిన తరువాత, మాట్లాడిన తరువాత చిత్రం తీయాలనే ఆలోచన వచ్చింది.

వందన మీనన్ తీసిన ఒరియా లఘుచిత్రం తెన్‌గపల్లి. ఒరియాలో 'తెన్' అంటే కర్ర అని అర్థం. ఒడిషా రాష్ట్రంలోని నయాఘర్ జిల్లాలోని గుండురిబడి గ్రామానికి చెందిన మహిళలు 'ఇది మన అడవి. మనమే కాపాడుకోవాలి' అనే నినాదంతో కర్రలే ఆయుధంగా అడవిని కాపాడుకుంటారు. టింబర్ మాఫియాతో తలపడతారు. వారి పోరాటాన్ని 8.25 నిమిషాల నిడివి ఉన్న 'తెన్‌గపల్లి' అద్దం పడుతుంది. పేదల నీటి హక్కుల కోసం పోరాడిన పాకిస్తాన్ ఉద్యమకారిణి పర్వీన్ నిజజీవిత కథతో బ్రిటిష్ డైరెక్టర్ ఒర్లాండో రూపొందించిన చిత్రం ఇన్ టు డస్ట్. ఫిల్మ్ ఫెస్టివల్ యానిమేటెడ్ షార్ట్స్ విభాగానికి ఎంపికైన చిత్రం స్పిరిట్ ఆఫ్ ది ఫారెస్ట్. ప్రకృతి విలువ, పరిరక్షణకు సంబంధించిన అంశాలను జానపద కథలాగా చెబుతుంది స్పిరిట్ ఆఫ్ ది ఫారెస్ట్. నిరూపరావు, కల్ప్ సంఘ్వీలతో కలిసి ఈ చిత్రాన్ని రూపొందించింది నందినిరావు.


ప్రకృతి ఒడిలో... 'వన్స్ అపాన్ ఏ విలేజ్' డాక్యుమెంటరీలో దృశ్యం

'స్పిరిట్ ఆఫ్ ది ఫారెస్ట్' కోసం ఎన్నో ప్రాంతాలు తిరిగారు. ఎన్నో విషయాలను అధ్యయనం చేశారు. బొటానికల్ ఇలస్ట్రేటర్ అయిన నిరూపరావు ప్రాజెక్ట్‌లో భాగంగా ఎన్నో బొమ్మలు గీశారు.

ఎన్విరాన్‌మెంటల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఇవి మచ్చుకు కొన్ని చిత్రాలు మాత్రమే. అడవి, సముద్రం, పట్టణీకరణ, విలువైన సంప్రదాయ జ్ఞానం... ఇలా ఎన్నో అంశాలపై రూపొందించిన చిత్రాలు ఇందులో ఉన్నాయి.

లైఫ్@360





స్నానానికి వేణ్ణీళ్లా? చన్నీళ్లా?

ఇదేం ప్రశ్న లేదా పనికి మాలిన సందేహం? ఎవరికి ఎలా ఇష్టం అయితే అలా స్నానం చేస్తారు అని ముఖం చిట్లించకండి. ఎందుకంటే స్నానానికి ఎప్పుడూ వేడినీళ్లకే లేదా ఎప్పుడూ చన్నీళ్లకే ప్రాధాన్యత ఇవ్వడం కొందరికి అలవాటు. అది ఒకందుకు మంచిదే. అయితే, ఎంత చలికాలం అయినా, చన్నీళ్లతోనే స్నానం చేయడం లేదా ఎంత వేసవిలో అయినా వేడి నీళ్లతోనే స్నానం చేయడం అంత మంచి అలవాటు కాదంటున్నారు నిపుణులు. మరయితే ఏ నీటితో స్నానం చేయడం మంచిదో తెలుసుకుందామా?

దీనిపై భిన్నాభిప్రాయాలున్నాయి. కొందరు చన్నీళ్ల స్నానమే మంచిదంటారు. మరికొందరు వేడివేడి నీళ్లతో స్నానం చేయడం వల్ల అలసట తీరిపోయి హాయిగా అనిపిస్తుందంటారు. నిజానికి ఈ రెండూ సరయినవి కావు. రెండూ అపోహలే. స్నానానికి నీళ్లు మరీ చల్లగా ఉండకూడదు. మరీ వెచ్చగా ఉండకూడదు. గోరువెచ్చని నీళ్లతో చేసే స్నానమే ఒంటికి ఆరోగ్యకరం. ఇక బలహీనంగా ఉన్నవాళ్లు, వయసుపైబడిన వృద్ధులు మరీ ఎక్కువ చన్నీళ్ల స్నానం కాని, మరీ ఎక్కువ వేణ్ణీళ్లతో కానీ స్నానం చేయవద్దు.

అవి వేణ్ణీళ్లయినా, చన్నీళ్లయినా... వీలయినంత వరకు పొద్దున్నే ఏమీ తినకముందే స్నానం చేయడం మంచిది. ఒకవేళ ఏదైనా కారణాల వల్ల స్నానానికి ముందే తినాల్సివచ్చినా... కడుపు నిండా తిన్న వెంటనే స్నానం చేయవద్దు. కనీసం అర్ధగంట అయినా వ్యవధి ఉండేలా చూసుకోవడం మంచిది.

ఒకవేళ మీరు చిన్నప్పట్నుంచీ చన్నీళ్ల స్నానమే చేస్తూ వస్తున్నారా? లేదా మీ వృత్తిరీత్యా వేరే ఊళ్లలో ఉండటం వల్ల వేణ్ణీళ్లు పెట్టుకోవడం సాధ్యం కావడం లేదా? ఇలా మరీ చన్నీళ్ల స్నానమే చేయడం తప్పకపోతే... స్నానం వ్యవధిని వీలైనంత కుదించండి. నీళ్లు ఎంత చల్లగా ఉంటే... స్నానం వ్యవధి అంతగా తగ్గాలన్నమాట.

చన్నీళ్లతో లేదా వేణ్ణీళ్లతో స్నానం చేశాక ఒకవేళ తలనొప్పి లేదా జ్వరం వచ్చినట్లుగా అనిపిస్తే... అవి (చన్నీళ్లు / వేణ్ణీళ్లు) మీకు అంతగా సరిపడవని గుర్తించి, ఆ మేరకు గోరువెచ్చని నీటికి షిఫ్ట్ అవ్వండి.

వింటర్ కేర్

శీతాకాలంలో చేతులకు ఆయిల్‌తో మర్దన చేయడం వల్ల ముడతలు తగ్గి చేతి వేళ్ళు అందంగా తయారవుతాయి.

చలికాలంలో పెదవులు పగులుతుంటే... రాత్రి పడుకోబోయే ముందు నెయ్యి/వెన్న/మరేదైనా నూనె రాస్తే పెదవులు మృదువుగా ఉంటాయి. బయటకు వెళ్లేటప్పుడు జెల్ వంటివి రాసుకోవచ్చు.

ప్రతి రోజూ ఒంటికి మాయిశ్చరైజర్, బాదం ఆయిల్ లేదా నువ్వుల నూనె రాస్తుంటే చర్మం చలికి పొడిబారకుండా ఉంటుంది.

గుండె తిండి

అప్పటిదాకా నచ్చిన రుచులన్నీ కడుపునిండా తిన్న వారికి ఏ డయాబెటిస్సో, గుండెజబ్బో, కొలెస్టరాలో వచ్చిందంటే పాపం! వారి బాధ చెప్పనలవి కాదు. ఎందుకంటే అటు నోరుకట్టుకోనూలేరు, ఇటు ఇష్టం వచ్చినవన్నీ తినడానికీ లేదు. అలాగని పూర్తిగా చప్పిడి తిండే తినమంటే మరీ నీరసించి పోతారు. ఇంతకీ మీరు చెప్పేదేమిటీ అనుకుంటున్నారా? కాస్త ఓపిక పట్టండి మరి! నోటికి రుచికరంగా ఉంటూనే, గుండెకు బలం చేకూరేలా, ఆరోగ్యానికి ఏమాత్రం హాని కలగకుండా కాపాడుకునేలా కొన్ని రకాలైన ఆహార పదార్థాలను సూచిస్తున్నారు వైద్యులూ, పోషకాహారనిపుణులూ. అవేమిటో తెలుసుకుందామా?

ముదురు ఆకుపచ్చగా ఉండే ఆకుకూరలన్నీ గుండెకు బలాన్నిస్తాయి. ముఖ్యంగా బచ్చలి కూర గుండెకు చాలా మంచిది. బచ్చలి కూరతో పప్పు వండుకోవచ్చు. సెనగపప్పు వేసి పప్పు కూర చేసుకోవచ్చు. పచ్చడి కూడా చేసుకోవచ్చు. అయితే నూనె, ఉప్పు, కారం పరిమితంగానే వాడాలి.

టొమాటోలలో ఉండే లైకోపిన్ అనే పోషకం గుండెకు చాలా మంచిది. టొమాటోలలో రక్తపోటును నియంత్రించే పొటాషియం కూడా ఉంటుంది. కాబట్టి పుల్లపుల్లగా, తియ తియ్యగా ఉండే టొమాటోలను విరివిగా తినచ్చు.

చేపలు గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. సాల్మన్ ఫిష్ లాంటివి మరింత ఆరోగ్యకరం. గుండె కొట్టుకోవడంలో తేడానీ, రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడాన్నీ, ట్రై గ్లిజరైడ్స్‌నూ తగ్గించే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ వీటిలో ఎక్కువ. అందుకే వారానికి కనీసం రెండు సార్లయినా చేపలు తింటే మేలు అని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సిఫార్సు చేస్తోంది.


స్ట్రా బెర్రీలు, బ్లూ బెర్రీల లాంటివి రక్తనాళాల్ని వెడల్పు చేసి, గుండె పోటు వచ్చే అవకాశాలు తగ్గిస్తాయని ఒక అధ్యయనంలో తేలింది.

కిస్మిస్, బాదం, ఎండు ఖర్జూరం వంటి డ్రై ఫ్రూట్స్ గుప్పెడు తింటే గుండెకు చాలా మంచిది. అలాగే ద్రాక్షపండ్లు కూడా గుండెకు సత్తువనిస్తాయి. అయితే ద్రాక్షను రసం తీసి కాకుండా నేరుగా తినడం మేలు. ఎందుకంటే ద్రాక్షరసంలో చక్కెర కలుపుకోవడం అనివార్యం కదా!

డార్క్ చాక్లెట్లు గుండెకు మేలు. కనీసం 60 నుంచి 70 శాతం కోకోతో తయారైన డార్క్ చాక్లెట్లు తింటే, అధిక రక్తపోటు తగ్గడంతో పాటు రక్తం గడ్డకట్టకుండా ఉంటుంది. అయితే, మామూలు మిల్క్ చాక్లెట్లు, క్యాండీ బార్‌ల వల్ల మాత్రం గుండెకు మేలు చేకూరకపోగా ముప్పే. అలాగని డార్క్ చాక్లెట్లను కూడా మితిమీరి తినకూడదు.

గుండెకు మేలు చేసే 5 ఆహార పదార్థాలు

వేరుశెనగ: గుండెకు వేరుశెనగ ఎంతో మంచిది. మంచి కొవ్వును కలిగి ఉన్న వేరుశెనగలో ప్రోటీన్లు సమృద్ధిగా ఉన్నాయి. అవి గుండె భేషుగ్గా ఉండటానికి సహకరిస్తాయి. అలాగే వేరుశెనగలో ఉండే ఖనిజాలు గుండె జబ్బులను తగ్గించడంలో సహాయపడతాయి.



నారింజ: గుండె ఆరోగ్యానికి నారింజ పండు చాలా మంచిది. పొటాషియం అధికంగా ఉండే నారింజలో ఎలక్ట్రోలైట్ ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. విటమిన్ సి అధికంగా ఉండే సిట్రస్ పండ్లు కూడా గుండె జబ్బులను నివారించడంలో తోడ్పడతాయి.



అవకాడో: విటమిన్-ఈతో పాటు అనేక ఇతర పోషకాలు అవకాడోలో సమృద్ధిగా లభిస్తాయి. దీనికితోడు మోనో అన్-శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉండటం వల్ల ఈ పండు గుండెకు చాలా మంచిది. అవకాడోను రోజూ తినడం ద్వారా మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది.. అలాగే చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. తద్వారా గుండెపోటుతో సహా గుండె సంబంధిత వ్యాధులు నుంచి బయటపడవచ్చు.

వాల్‌నట్స్: రోజూ క్రమం తప్పకుండా కాసిని వాల్‌నట్స్‌ను తీసుకోవడం ద్వారా చెడు కొలెస్ట్రాల్‌కు చెక్ పెట్టొచ్చు. అలాగే గుండె ఆరోగ్యంగా కూడా ఉంటుంది. ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉండే వాల్‌నట్స్ హృదయ సంబంధిత వ్యాధులను నివారించడంతోపాటు గుండె పనితీరును మెరుగుపరుస్తుంది.



ఓట్స్: ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు కలిగిన ఓట్స్ వల్ల రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి నియంత్రణలో ఉంటుంది. ఓట్స్‌లో ఒమేగా 3 ఆమ్లాలు కూడా ఉన్నాయి. ఇవి గుండెకు చాలా ప్రయోజనకరం. ప్రతీ రోజూ ఓట్స్ తినడం గుండెకు ఆరోగ్యాన్నిస్తుంది.

మీకు తెలుసా?



ఎక్కిళ్లు ఎందుకు?

సాధారణంగా ఎక్కిళ్లు వస్తే ఒకటి రెండు నిమిషాల్లో తగ్గిపోతాయి. కానీ కొంతమందికి ఒకపట్టాన తగ్గవు. తరచూ ఈ సమస్య వస్తూ ఇబ్బంది పెడుతుంటాయి. నీళ్లు తాగినా ఈ సమస్య అలాగే ఉంటుంది. మనకు వెక్కిళ్లు రాగానే శ్వాస ప్రక్రియలో కీలకంగా వ్యవహరించే డయాఫ్రమ్ కండరం సంకోచిస్తుంది. వెంటనే ఊపిరితిత్తుల్లోకి గాలి వేగంగా చేరుతుంది. ఫలితంగా స్వరపేటిక అకస్మాత్తుగా మూసుకుపోయి 'హిక్'అనే ధ్వనికి కారణమవుతుంది. అందుకే వీటిని ఇంగ్లిష్‌లో హికప్స్ అని పిలుస్తారు. తెలుగులో వెక్కిళ్లు అని పిలుస్తారు. దాదాపు 100కుపైగా భిన్న శారీరక పరమైన కారణాలు వెక్కిళ్లకు దారితీస్తాయి. అయితే ఇవన్నీ పెద్దగా అపాయాన్ని కలిగించవు. ఒక్కోసారి ఆగకుండా వెక్కిళ్లు వస్తుంటాయి. అందుకు కారణం లేకపోలేదు. కొన్ని రకాల మందుల వాడకం వల్ల కూడా వెక్కిళ్లు వస్తాయి. కొన్ని మత్తు మందులు, స్టెరాయిడ్స్, పార్కిన్సన్స్ వ్యాధికి తీసుకునే ఔషధాలు, కీమోథెరపీ విధానాలు కూడా వెక్కిళ్లకు దారితీస్తాయి. నవ్వడం, ఆల్కహాల్ ఎక్కువగా తీసుకోవడం, వేగంగా తినడం వంటి విధానాల వల్ల, ఒక్కోసారి అసలు ఎలాంటి కారణం లేకుండా కూడా వెక్కిళ్లు వచ్చే అవకాశముంది.

హెల్త్ టిప్

ఉసిరి టీ



కొందరికి రెండు గంటలకోమాటు టీ తాగడం అలవాటు. అయితే మధుమేహం ఉన్నవారు పంచదార వేసిన టీ తాగకూడదు. కానీ టీ అలవాటు ఉన్నవారు టీకి బదులు పంచదార కలపని టీ కోసం ప్రయత్నిస్తుంటారు. అయితే ఉసిరి టీ తాగితే ఇటు టీ తాగాలన్న కోరిక తీరడంతోపాటు.. విటమిన్ సి, పీచుపదార్థం, క్యాల్షియం వంటివి శరీరానికి అందుతాయని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

ఉసిరి టీని ఎలా తయారు చేసుకోవాలంటే...

రెండు ఉసిరికాయలు, అరంగుళం అల్లం ముక్క తీసుకుని ఈ రెండంటిని చిన్నచిన్న ముక్కలుగా కట్ చేయాలి. గ్లాసు నీళ్లు తీసుకుని స్టవ్‌పై పెట్టి గింజలు తీసేసిన ఉసిరి, అల్లం ముక్కలను దానిలో వేసి మరిగించాలి. ఇవి మరిగాక నీళ్లలో అరస్పూను దాల్చిన చెక్కపొడి వేసి స్టవ్ ఆపేసేయాలి. ఈ నీళ్ల గిన్నెపై మూత పెట్టి ఐదునిమిషాలు పక్కన పెట్టుకోవాలి. తరువాత వడగట్టి టీలా తాగాలి. ఈ టీని రోజూ తాగితే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి.

ఉసిరి, అల్లం తాజాగా అందుబాటులో లేనప్పుడు.. కప్పు నీళ్లను వేడిచేసి దానిలో స్పూను ఉసిరిపొడి, స్పూను సొంఠి పొడి, అరస్పూను దాల్చిన చెక్కపొడి వేసి కలపాలి. ఈ నీళ్లపై మూతపెట్టి ఐదు నిమిషాలు మరిగించాలి. నీళ్లు బాగా మరిగాక దించేసి తాగే వేడికి వచ్చాక వడకట్టకుండా నేరుగా తాగాలి.



లెవన్‌డొస్కీ ఖాతా తెరిచేనా...

ప్రపంచకప్ టోర్నీలో పోలాండ్ ఫుట్‌బాల్ జట్టు చివరిసారి 1986లో గ్రూప్ దశను దాటి ముందుకెళ్లింది. తాజా టోర్నీలో తొలి మ్యాచ్‌ను మెక్సికోతో 0–0తో 'డ్రా' చేసుకున్న పోలాండ్ నేడు సౌదీ అరేబియాతో ఆడనుంది. నాకౌట్ చేరే ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో పోలాండ్ గెలవాలి. 2018 ప్రపంచకప్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఒక్క గోల్ కొట్టలేకపోయిన పోలాండ్ స్టార్ ప్లేయర్, కెప్టెన్ రాబర్ట్ లెవన్‌డొస్కీ ఆటతీరుపై ఆ జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

స్విట్జర్లాండ్‌తో మ్యాచ్‌కు నెమార్ దూరం

సెర్బియాతో మ్యాచ్‌లో కుడి చీలమండ గాయానికి గురైన బ్రెజిల్ స్టార్ ప్లేయర్ నెమార్ ఈనెల 28న స్విట్జర్లాండ్‌తో జరిగే రెండో లీగ్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండటంలేదని జట్టు వైద్యులు ప్రకటించారు. బ్రెజిల్ తరఫున 122 మ్యాచ్‌లు ఆడిన నెమార్ 75 గోల్స్ చేశాడు. మరో రెండు గోల్స్ చేస్తే బ్రెజిల్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా దిగ్గజం పీలే (77 గోల్స్) పేరిట ఉన్న రికార్డును అతను సమం చేస్తాడు.



బ్రె'జిగేల్'...

రెండు దశాబ్దాల ప్రపంచకప్ టైటిల్ నిరీక్షణకు తెరదించాలనే లక్ష్యంతో ఖతర్‌కు వచ్చిన ఐదు సార్లు చాంపియన్ బ్రెజిల్ విజయంతో తమ వేటను ప్రారంభించింది. వైవిధ్యభరిత ఆటతో ఆద్యంతం అలరించిన 'సాంబా' జట్టు ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపించింది. దాదాపు గంటపాటు శ్రమించి బ్రెజిల్‌ను నిలువరించిన సెర్బియా ఆ తర్వాత 11 నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ సమర్పించుకొని ఓటమి మూటగట్టుకుంది. తొలి ప్రపంచకప్ ఆడుతున్న 25 ఏళ్ల రిచార్లీసన్ రెండు గోల్స్ సాధించి బ్రెజిల్ కొత్త హీరోగా అవతరించాడు.

- సెర్బియాపై 2–0తో నెగ్గిన మాజీ చాంపియన్
- రెండు గోల్స్‌తో మెరిసిన రిచార్లీసన్





రిచార్లీసన్ రెండో గోల్ చేశాడిలా...

దోహా: భారీ అంచనాలతో ఖతర్‌లో అడుగు పెట్టిన బ్రెజిల్ బృందం విజయంతో బోణీ కొట్టింది. గ్రూప్ 'జి'లో భాగంగా భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన మ్యాచ్‌లో బ్రెజిల్ 2-0 గోల్స్ తేడాతో సెర్బియాను ఓడించి శుభారంభం చేసింది. రిచార్లీసన్ (62వ, 73వ ని.లో) రెండు గోల్స్‌తో బ్రెజిల్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు.

కళ్లు చెదిరే గోల్...

ఇప్పటి వరకు జరిగిన అన్ని ప్రపంచకప్‌లలో ఆడిన ఏకైక జట్టుగా గుర్తింపు ఉన్న బ్రెజిల్ తమ సహజశైలిలో దూకుడుగా ఆడుతూ సెర్బియాను ఆరంభం నుంచే ఒత్తిడికి గురి చేసింది. యుగోస్లావియా నుంచి విడిపోయి ప్రత్యేక దేశంగా మారాక నాలుగోసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న సెర్బియా ఈ మ్యాచ్‌లో శాయశక్తులా కృషి చేసి తొలి అర్ధ భాగంలో బ్రెజిల్‌ను గోల్ చేయనీకుండా అడ్డుకోగలిగింది. థియాగో సిల్వా, వినిసియస్ జూనియర్, నెమార్ సెర్బియా గోల్‌పోస్ట్‌కు గురి చూసి కొట్టిన షాట్‌లను గోల్‌కీపర్ మిలిన్‌కోవిచ్ సావిచ్ సమర్థంగా అడ్డుకున్నాడు. దాంతో తొలి అర్ధభాగంలో గోల్ నమోదు కాలేదు. ఇక రెండో అర్ధభాగంలోనూ రక్షణాత్మకంగానే ఆడిన సెర్బియా 62వ నిమిషంలో తొలి గోల్ సమర్పించుకుంది. ఎడమవైపు నుంచి దూసుకొచ్చిన వినిసియస్ కొట్టిన షాట్‌ను సెర్బియా గోల్‌కీపర్ మిలిన్‌కోవిచ్ సావిచ్ అడ్డుకోగలిగినా బంతి రీబౌండ్ అయింది. రీబౌండ్ బంతిని గోల్‌పోస్ట్ ముందే ఉన్న రిచార్లీసన్ నేర్పుతో లక్ష్యానికి చేర్చడంతో బ్రెజిల్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఖాతా తెరిచిన ఉత్సాహంలో బ్రెజిల్ తమ దాడుల్లో మరింత పదును పెంచింది. 73వ నిమిషంలో ఎడమ వైపు నుంచి వినిసియస్ అందించిన పాస్‌ను 'డి' ఏరియాలో అందుకున్న రిచార్లీసన్ బంతిని నియంత్రించి గాల్లోకి లేపాడు. ఆ వెంటనే గాల్లో ఉన్న బంతిని బైసైకిల్ కిక్‌తో సెర్బియా గోల్‌పోస్ట్‌లోకి పంపించాడు. ఈ కళ్లు చెదిరే గోల్‌తో బ్రెజిల్ ఆధిక్యం 2-0కు పెరిగింది. ఆ తర్వాత కూడా బ్రెజిల్ దూకుడు కొనసాగినా మరో గోల్ చేయలేకపోయింది.

నెమార్‌పైనే గురి...

కెరీర్‌లో మూడో ప్రపంచకప్ ఆడుతున్న బ్రెజిల్ స్టార్ ప్లేయర్ నెమార్‌ను నిలువరించాలనే లక్ష్యంగా సెర్బియా ఈ మ్యాచ్‌లో ఆడింది. ఈ క్రమంలో ఏకంగా తొమ్మిదిసార్లు నెమార్‌పై సెర్బియా ఆటగాళ్లు ఫౌల్స్ చేశారు. నెమార్‌ను నిలువరించాలనే వ్యూహంతో సెర్బియా బరిలోకి దిగినా వినిసియస్, రిచార్లీసన్ సమన్వయంతో ఆడి ప్రత్యర్థి ఆశలను వమ్ము చేశారు.

17 గత 20 ప్రపంచకప్‌లలో బ్రెజిల్ జట్టు తాము ఆడిన తొలి మ్యాచ్‌లో అజేయంగా నిలిచింది. ఇందులో 17 విజయాలు, 3 'డ్రా' ఉన్నాయి. చివరిసారి బ్రెజిల్ 1934 ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్‌లో 1–3తో స్పెయిన్ చేతిలో ఓడిపోయింది.

మ్యాచ్ గణాంకాలు

బ్రెజిల్		సెర్బియా
9	లక్ష్యంపై షాట్‌లు	0
59 %	బంతి ఆధీనం	41 %
581	పాస్‌లు	406
7	ఫౌల్స్	12
0	ఎల్లో కార్డులు	3
6	కార్నర్‌లు	4



ఖతర్ ఖేల్ ఖతమ్

ఖతర్ ఆటగాళ్లకు (రెడ్ జెర్సీ) సెనెగల్ ప్లేయర్ల ఓదార్పు

సెనెగల్ చేతిలో 1–3తో ఓటమి ● గ్రూప్ దశలోనే నిష్క్రమించిన ఆతిథ్య జట్టు

లక్షల కోట్లు వెచ్చించిన ఖతర్‌కు ఆతిథ్య భాగ్యమే మిగిలింది. ముందుకెళ్లే ఆనందం దూరమైంది. రెండు వరుస పరాజయాలతో ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. మిగిలిన ఆఖరి పోరులో నెదర్లాండ్స్‌పై గెలిస్తే సంతృప్తికరంగా మెగా టోర్నీని ముగించవచ్చు.

దోహా: ప్రపంచకప్‌లో ఖతర్ ఖేల్ ఖతమైంది. వరుసగా రెండో లీగ్ మ్యాచ్‌లోనూ ఖతర్ జట్టు పరాజయం చవిచూసింది. గ్రూప్ 'ఎ'లో శుక్రవారం జరిగిన పోరులో సెనెగల్ 3-1 గోల్స్ తేడాతో ఖతర్‌ను ఓడించింది. దీంతో ఆతిథ్య జట్టు మరో మ్యాచ్ మిగిలుండగానే నిష్క్రమణ ఖాయమైంది. 92 ఏళ్ల వరల్డ్‌కప్ చరిత్రలో పేలవమైన ప్రదర్శన ఇచ్చిన ఆతిథ్య జట్టుగా ఖతర్ నిలిచిపోనుంది. నిర్వహణ హక్కులు రావడం మొదలు 12 ఏళ్లుగా ఖతర్ ఫుట్‌బాల్ జట్టు సన్నద్ధత కోసం పడిన కష్టం, చిందించిన చెమట తీరా టోర్నీకొచ్చే సరికి మూడు మ్యాచ్‌ల ముచ్చట (లీగ్ దశ)గా మిగిలిపోయింది. మరోవైపు తమ తొలి మ్యాచ్‌లో నెదర్లాండ్స్ చేతిలో 0–2తో ఎదురైన పరాజయం నుంచి సెనెగల్ కోలుకుంది. ముందుకెళ్లాలంటే తప్పక గెలిచి తీరాల్సిన పోరులో ఖతర్‌ను ఓడించి మెగా టోర్నీలో నిలిచింది. సెనెగల్ జట్టు తరఫున తొలి అర్ధభాగంలో బౌలయె డియా (41వ ని.లో), రెండో అర్ధభాగంలో ఫమర డిదియో (48వ ని.లో), చెయిక్ డియింగ్ (84వ ని.లో) గోల్స్ చేశారు. మొత్తానికి 78వ నిమిషంలో మొహమ్మద్ ముంటారి గోల్ చేయడం ద్వారా ఖతర్ జట్టులో ప్రపంచకప్‌లో స్కోరు చేసిన ఆటగాడిగా నిలిచాడు.

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X ట్యునీషియా
మధ్యాహ్నం గం. 3:30 నుంచి

సౌదీ అరేబియా X పోలాండ్
సాయంత్రం గం. 6:30 నుంచి

ఫ్రాన్స్ X డెన్మార్క్
రాత్రి గం. 9:30 నుంచి

అర్జెంటీనా X మెక్సికో
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

స్పోర్ట్స్ 18, జియో సినిమా చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఇరాన్ అద్భుతం

- 'స్టాపేజ్' టైమ్‌లో రెండు గోల్స్
- వేల్స్‌పై గెలుపుతో నాకౌట్ బెర్త్ రేసులో ఆసియా జట్టు



ఇరాన్ ఆటగాళ్ల సంబరం

దోహా: వరల్డ్ కప్ తొలి పోరులో ఇంగ్లండ్ చేతిలో చిత్తుగా ఓడిన ఇరాన్ రెండో మ్యాచ్‌లో సత్తా చాటింది. శుక్రవారం జరిగిన గ్రూప్ 'బి' పోరులో ఇరాన్ 2–0 గోల్స్ తేడాతో వేల్స్‌ను ఓడించి నాకౌట్ అవకాశాలను మెరుగుపర్చుకుంది. ఇరాన్ రెండు గోల్స్ కూడా 'స్టాపేజ్ టైమ్'లోనే వచ్చాయి. ఇరాన్ తరఫున రూజ్‌బె చెష్మీ (90+8వ నిమిషం), రామిన్ రెజాయిన్ (90+11వ నిమిషం) గోల్స్ సాధించారు. 'స్టాపేజ్' టైమ్ అంటే మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఎవరైనా ఆటగాళ్లు గాయపడితే ఆటను నిలిపివేస్తారు. ఆ సమయాన్ని నిర్ణీత 90 నిమిషాల తర్వాత జోడిస్తారు. అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించి ఇప్పుడు ఓటమి పాలైన వేల్స్‌కు ముందంజ వేసే అవకాశాలు సన్నగిల్లాయి. మంగళవారం ఇంగ్లండ్‌తో జరిగే పోరులో గెలిస్తేనే ప్రిక్వార్టర్స్ చేరుతుంది. మ్యాచ్ 'డ్రా' అయినా నిష్క్రమిస్తుంది. ఇరాన్ తమ చివరి మ్యాచ్‌లో అమెరికాతో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో ఎవరు గెలిస్తే వారు నాకౌట్‌కు అర్హత సాధిస్తారు.

1958లో ఏకైక ప్రపంచకప్ ఆడిన వేల్స్ 64 ఏళ్ల తర్వాత ఈ సారి అర్హత సాధించింది. ఇరాన్‌తో కీలక పోరులో స్టార్ ఆటగాడు గ్యారెత్ బేల్ వైఫల్యంతో పాటు గోల్ కీపర్ వేన్ హెనెస్సీ స్వయంకృతం జట్టు ఓటమికి కారణంగా నిలిచాయి. తొలి మ్యాచ్‌లో జాతీయ గీతం పాడేందుకు నిరాకరించిన ఇరాన్ ఆటగాళ్లు ఈసారి మాత్రం ఆలోచన మార్చుకొని జాతీయ గీతాలాపనతో బరిలోకి దిగారు. ఇరు జట్లూ హోరాహోరీగా తలపడటంతో మ్యాచ్ ఆసక్తికరంగా సాగింది. తొలి అర్ధ భాగం ముగిసేసరికి ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. అయితే మ్యాచ్ చివరకు వచ్చేసరికి వేల్స్ ఆట పట్టు తప్పింది. 86వ నిమిషంలో అసహనంతో తన ఏరియా దాటి ముందుకొచ్చిన వేల్స్ కీపర్ హెనెస్సీ ప్రత్యర్థి ఆటగాడు మెహదీ తరెమీని ప్రమాదకరంగా అడ్డుకున్నాడు. ముందుగా ఎల్లో కార్డు చూపించిన రిఫరీ ఆ తర్వాత వీడియో రీప్లే చూసి రెడ్ కార్డుతో హెనెస్సీని బయటకు పంపించాడు. దాంతో వేల్స్ 10 మంది ఆటగాళ్లకే పరిమితమైంది. ప్రపంచకప్ చరిత్రలో రెడ్ కార్డు ద్వారా బయటకు వెళ్లిన మూడో గోల్ కీపర్‌గా హెనెస్సీ నిలిచాడు. ఈ సమయంలో మరింత జోరుగా దాడులు చేసిన ఇరాన్ ఫలితం సాధించింది. డిఫెండ్ చేసుకునే క్రమంలో జో అలెన్ కొట్టిన కిక్‌తో బంతి నేరుగా చెష్మీ వద్దకే చేరింది. దాంతో 20 అడుగుల దూరం నుంచి అతను అద్భుతమైన కిక్ కొట్టగా సబ్‌స్టిట్యూట్ గోల్ కీపర్ డ్యానీ వార్డ్ చేతులెత్తేశాడు. ఈ ప్రపంచకప్‌లో నమోదైన 42వ గోల్ కాగా, బాక్స్ బయట నుంచి కొట్టింది ఇదొక్కటే కావడం విశేషం! అప్పటికే బాగా అలసిపోయిన వేల్స్‌పై దూకుడు పెంచిన ఇరాన్ మరో మూడు నిమిషాలకే మరో ఫీల్డ్ గోల్‌తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

1 ఆరోసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న ఇరాన్ జట్టు తొలిసారి ఈ మెగా ఈవెంట్‌లో యూరోప్ జట్టుపై విజయం సాధించింది. గతంలో యూరోప్ జట్ల చేతిలో ఏడు మ్యాచ్‌ల్లో ఓడిన ఇరాన్, రెండు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకుంది.

3 ఓవరాల్‌గా తమ ప్రపంచకప్ చరిత్రలో ఇరాన్ గెలిచిన మ్యాచ్‌లు. 1998లో అమెరికాపై తొలి విజయం అందుకున్న ఇరాన్, 2018లో మొరాకో జట్టును ఓడించింది.

మ్యాచ్ గణాంకాలు

ఇరాన్		వేల్స్
6	లక్ష్యంపై కొట్టిన షాట్‌లు	3
38 %	బంతి ఆధీనం	62 %
298	పాస్‌లు	500
10	ఫౌల్స్	9
2	ఎల్లో కార్డులు	1
0	రెడ్ కార్డులు	1
7	కార్నర్‌లు	2

విశ్వనాథ్‌కు స్వర్ణం



న్యూఢిల్లీ: ప్రపంచ యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. శుక్రవారం జరిగిన పురుషుల 48 కేజీల విభాగంలో విశ్వనాథ్ సురేశ్ విజేతగా నిలిచాడు. స్పెయిన్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో ఫైనల్లో తమిళనాడుకు చెందిన విశ్వనాథ్ 4–1తో సుయోమ్ రోనెల్ (ఫిలిప్పీన్స్)పై గెలిచాడు. మరోవైపు మహిళల 48 కేజీల విభాగంలో భావన శర్మ రజత పతకం సాధించింది. ఫైనల్లో భావన 0–5తో జనియెవా (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయింది.

నెదర్లాండ్స్, ఈక్వెడార్ మ్యాచ్ 'డ్రా'



గాప్కో, వాలెన్సియా

దోహా: ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో మరో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. నెదర్లాండ్స్, ఈక్వెడార్ జట్ల మధ్య శుక్రవారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్ 1–1తో 'డ్రా' అయింది. ఈ మ్యాచ్ ఫలితంతో గ్రూప్ 'ఎ'లో ఉన్న ఆతిథ్య ఖతర్ జట్టు ప్రస్థానం గ్రూప్ దశలోనే ముగిసింది. ఆట ఆరో నిమిషంలో కోడి గాప్కో గోల్‌తో నెదర్లాండ్స్ 1–0తో ఆధిక్యంలో నిలిచింది. విరామ సమయం వరకు ఆధిక్యంలో నిలిచిన 'ఆరెంజ్ జట్టు' రెండో అర్ధభాగంలో తడబడింది. ఆట 49వ నిమిషంలో ఈక్వెడార్ ప్లేయర్ ఎనెర్ వాలెన్సియా గోల్ సాధించి స్కోరును 1–1తో సమం చేశాడు. ఒక విజయం, ఒక 'డ్రా'తో ప్రస్తుతం గ్రూప్ 'ఎ'లో నెదర్లాండ్స్, ఈక్వెడార్ నాలుగు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి. తమ గ్రూప్ చివరి లీగ్ మ్యాచ్‌లను ఈ రెండు జట్లు 'డ్రా' చేసుకుంటే నాకౌట్ దశకు (ప్రిక్వార్టర్ ఫైనల్స్) అర్హత సాధిస్తాయి.



ఈసారి జాతీయ గీతాలాపన!

ఇరాన్ ఫుట్‌బాల్ జట్టు రెండో మ్యాచ్ సమయానికి నిరసన విషయంలో కాస్త తగ్గింది! తమ దేశంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఇంగ్లండ్‌తో జరిగిన గత మ్యాచ్‌కు ముందు జాతీయ గీతం పాడేందుకు ఆటగాళ్లు నిరాకరించారు. అయితే వేల్స్‌తో జరిగిన రెండో పోరులో మాత్రం వారు జాతీయ గీతం పాడారు. గత మ్యాచ్ సమయంలో జరిగిన ఘటనతో తమ దేశాన్ని అవమానించినట్లయిందని, మరోసారి అలా చేస్తే తీవ్ర చర్యలు ఉంటాయని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. మరోవైపు ఖతర్‌లో ప్రపంచకప్ చూసేందుకు వచ్చిన అభిమానులు కూడా తమ ఆటగాళ్ల చర్య పట్ల అసంతృప్తి వ్యక్తం చేయడం కూడా మరో కారణం. వేల్స్ జాతీయ గీతం పూర్తి కాగానే స్టాండ్స్‌లో ఉన్న ఇరాన్ ప్రేక్షకులు తమ గీతాన్ని గట్టిగా పాడేందుకు సిద్ధమైపోవడంతో ఆటగాళ్లు కూడా శ్రుతి కలిపారు. జెండా పట్టుకున్న ఒక అభిమాని భావోద్వేగానికి గురై ఏడ్చేయడం కూడా అందరి దృష్టినీ ఆకర్షించింది. అయితే మైదానం బయట మాత్రం ఇరాన్ ప్రభుత్వ అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం మాత్రం కొనసాగింది.





అయ్యర్

భారీ స్కోరు చేసినా...

తొలి వన్డేలో భారత్ గెలవాల్సిన స్కోరే చేసింది. టాపార్డర్ బ్యాటర్స్ ధావన్, శుబ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ అర్ధసెంచరీలతో అదరగొట్టారు. కానీ బౌలింగ్ వైఫల్యంతో ఓడిపోయింది. దీంతో 306 పరుగులు చేసినా కూడా టీమిండియా ఏడు వికెట్ల తేడాతో పరాజయం చవిచూసింది. న్యూజిలాండ్ కెప్టెన్ విలియమ్సన్, వికెట్ కీపర్ టామ్ లాథమ్ వీరోచిత బ్యాటింగ్‌తో భారత్‌ను ఓడించి 1–0తో ఆధిక్యంలో నిలిపారు.

- తొలి వన్డేలో భారత్ పరాజయం
- అయ్యర్, ధావన్, శుబ్‌మన్ గిల్ అర్ధ సెంచరీలు వృథా
- అజేయ సెంచరీతో కివీస్‌ను గెలిపించిన లాథమ్
- విలియమ్సన్ కెప్టెన్సీ ఇన్నింగ్స్
- రేపు హామిల్టన్‌లో రెండో వన్డే

ఆక్లాండ్: న్యూజిలాండ్ పర్యటనలో టి20 సిరీస్ నెగ్గి జోరుమీదున్న భారత్‌కు వన్డే సిరీస్‌లో శుభారంభం లభించలేదు. తొలి వన్డేలో న్యూజిలాండ్ ఏడు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ముందుగా భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసింది. కెప్టెన్ శిఖర్ ధావన్ (77 బంతుల్లో 72; 13 ఫోర్లు), శుబ్‌మన్ గిల్ (65 బంతుల్లో 50; 1 ఫోర్ 3 సిక్సర్లు), శ్రేయస్ అయ్యర్ (76 బంతుల్లో 80; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. ఆఖర్లో వాషింగ్టన్ సుందర్ (16 బంతుల్లో 37 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ ఆట ఆడాడు. న్యూజిలాండ్ బౌలర్లలో సౌతీ, ఫెర్గూసన్ చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం కివీస్ 47.1 ఓవర్లలో మూడే వికెట్లు కోల్పోయి 309 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' టామ్ లాథమ్ (104 బంతుల్లో 145 నాటౌట్; 19 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ చేశాడు. కెప్టెన్ కేన్ విలియమ్సన్ (98 బంతుల్లో 94 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీకి 6 పరుగుల దూరంలో నిలిచాడు. వన్డే అరంగేట్రం చేసిన ఉమ్రాన్ మాలిక్ 2 వికెట్లు తీయగా... అర్ష్‌దీప్‌కు ఒక్క వికెట్ కూడా దక్కలేదు. రెండో వన్డే ఆదివారం హామిల్టన్‌లో జరుగుతుంది.



విలియమ్సన్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ధావన్ (సి) అలెన్ (బి) సౌతీ 72; గిల్ (సి) కాన్వే (బి) ఫెర్గూసన్ 50; అయ్యర్ (సి) కాన్వే (బి) సౌతీ 80; పంత్ (బి) ఫెర్గూసన్ 15; సూర్యకుమార్ (సి) అలెన్ (బి) ఫెర్గూసన్ 4; సామ్సన్ (సి) ఫిలిప్స్ (బి) మిల్నే 36; సుందర్ (నాటౌట్) 37; శార్దుల్ (సి) లాథమ్ (బి) సౌతీ 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1-124, 2-124, 3-156, 4-160, 5-254, 6-300, 7-306. **బౌలింగ్:** టిమ్ సౌతీ 10-0-73-3, హెన్రీ 10-1-48-0, ఫెర్గూసన్ 10-1-59-3, సాన్‌ట్నర్ 10-0-56-0, ఆడమ్ మిల్నే 10-0-67-1.

న్యూజిలాండ్: అలెన్ (సి) పంత్ (బి) శార్దుల్ 22; కాన్వే (సి) పంత్ (బి) ఉమ్రాన్ 24; విలియమ్సన్ (నాటౌట్) 94; మిచెల్ (సి) సబ్–హుడా (బి) ఉమ్రాన్ 11; లాథమ్ (నాటౌట్) 145; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (47.1 ఓవర్లలో 3 వికెట్లకు) 309. వికెట్ల పతనం:** 1–35, 2–68, 3–88. **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 8.1–0–68–0, శార్దుల్ ఠాకూర్ 9–1–63–1, సుందర్ 10–0–42–0, ఉమ్రాన్ 10–0–66–2, చహల్ 10–0–67–0.



లాథమ్

సాక్షి బిజినెస్
శనివారం
26-11-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		విదేశీ సూచీలు (తొలిరెండు బుధవారం ముగింపు)			బులియన్ రూ.లలో ముంబై
సెన్సెక్స్ ▲ 21	నిఫ్టీ ▲ 29	నాస్‌డాక్	11,232	▲ 55	బంగారం (99.9 స్వచ్ఛత) 52,660 ▼ 53
62,294	18,513	డోజోన్స్	34,325	▲ 132	బంగారం (99.5 స్వచ్ఛత) 52,502 ▼ 53
		ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,487	▲ 20	వెండి (కేజీ) 62,266 ▲ 437
		డాక్స్	14,541	▲ 2	
		షాంఘై	3,102	▲ 12	
		నికాయ్	28,283	▼ 100	

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

హీరో వాహనాల రేట్లు పెంపు

డిసెంబర్ 1 నుండి రూ. 1,500 వరకూ పెరుగుదల



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహనాల తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ తమ మోటర్‌సైకిళ్లు, స్కూటర్ల ధరలను రూ. 1,500 వరకూ పెంచనున్నట్లు ప్రకటించింది. డిసెంబర్ 1 నుండి కొత్త రేట్లు అమల్లోకి వస్తాయని తెలిపింది. మోడల్స్, మార్కెట్లను బట్టి పెంపు పరిమాణం ఉంటుందని సంస్థ వివరించింది. 'ద్రవ్యోల్బణంపరమైన ఒత్తిళ్ల కారణంగా మోటార్‌సైకిళ్లు, స్కూటర్ల ధరలను పెంచక తప్పడం లేదు' అని హీరో మోటోకార్ప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ నిరంజన్ గుప్తా తెలిపారు. ధరల భారం ప్రభావం కస్టమర్లపై ఎక్కువగా పడకుండా వినూత్న ఫైనాన్సింగ్ ఆప్షన్లు కూడా అందించడం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. డిమాండ్ మెరుగుపడే సంకేతాలు కనిపిస్తున్న నేపథ్యంలో రాబోయే త్రైమాసికాల్లో పరిశ్రమ అమ్మకాలు పుంజుకోగలవని ఆశిస్తున్నట్లు గుప్తా వివరించారు.

జీఆర్‌టీ జ్యూయలర్స్ స్వర్ణ అవతారం ఆఫర్



హైదరాబాద్: జీఆర్‌టీ జ్యూయలర్స్ స్వర్ణ అవతారం ఆఫర్‌ను ప్రకటించింది. పాత బంగారాన్ని ఎక్స్ఛేంజ్ (మార్పిడి) చేసుకుంటే ప్రతి గ్రాముకు రూ. 50 అదనంగా పొందవచ్చు. ఈ ఆఫర్ పరిమిత కాలానికే వర్తిస్తుంది. ''కస్టమర్లు తమ పాత బంగారాన్ని అద్భుతమైన కొత్త ఆభరణాల కోసం స్వర్ణ అవతారం ఎక్స్ఛేంజ్ ఆఫర్‌ను వినియోగించుకోవాలి. ఇతర ఆఫర్లలాగే ఈ ఆఫర్ కూడా విజయవంతం అవుతుంది'' అని సంస్థ ఎండీ జీఆర్ ఆనంద్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-11-2022	
విశాఖ	540-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	539-00
విజయవాడ	539-00
రిటైల్ ధర (డజను)	78.00
25-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	536-00
వరంగల్	538-00
రిటైల్ ధర	6.00

హైబ్రిడ్ మోడళ్లపైనే టయోటా ఫోకస్

- వైస్ చైర్మన్ విక్రమ్ కిర్లోస్కర్
- ఇన్నోవా హైక్రాస్ విడుదల



ముంబై: దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలను భవిష్యత్తులో ప్రవేశపెడతాం. ప్రస్తుతానికి హైబ్రిడ్ మోడళ్లపైనే టయోటా కిర్లోస్కర్ ఫోకస్ చేసిందని కంపెనీ వైస్ చైర్మన్ విక్రమ్ కిర్లోస్కర్ తెలిపారు. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో హైబ్రిడ్లపై దృష్టిసారించారన్న ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ.. 'కర్బన ఉద్గారాలను తగ్గించడమే దేశ లక్ష్యం అని నేను భావిస్తున్నాను. మీరు దానిని సమగ్రంగా, శాస్త్రీయ ప్రాతిపదికన చూడాలి. అదే మేము చేస్తున్నాము' అని చెప్పారు. సమీప కాలంలో ఎలక్ట్రిక్ వాహనాలు తీసుకువచ్చే ఆలోచన లేదని స్పష్టం చేశారు. పునరుత్పాదక విద్యుత్తు వాటా కనీసం 50-60 శాతానికి చేరితే తప్పనిసరిగా ఎలక్ట్రిక్ వాహనాలను పరిచయం చేస్తామని స్పష్టం చేశారు. ఇన్నోవా హైక్రాస్ విడుదల సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఇవీ ఇన్నోవా హైక్రాస్ ఫీచర్లు..

మల్టీ పర్పస్ వెహికల్ ఇన్నోవా ప్లాట్‌ఫామ్‌పై హైక్రాస్ పేరుతో హైబ్రిడ్ వెర్షన్‌ను కంపెనీ ప్రవేశపెట్టింది. బుకింగ్స్ మొదలయ్యాయి. జనవరి మధ్యకాలం నుంచి డెలివరీలు ఉంటాయి. ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తోనూ లభిస్తుంది. సెల్ఫ్ చార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ సిస్టమ్‌తో 2 లీటర్ పెట్రోల్ ఇంజిన్ పొందుపరిచారు. మైలేజీ లీటరుకు 21.1 కిలోమీటర్లు అని కంపెనీ ప్రకటించింది. డైనమిక్ రాడార్ క్రూజ్ కంట్రోల్, ప్రీ కొలీషన్ సిస్టమ్, 6 ఎయిర్‌బ్యాగ్స్, వెహికల్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్ వంటి భద్రతా ఫీచర్లు ఉన్నాయి. ఈ-డ్రైవ్ సీక్వెన్షియల్ షిఫ్ట్ సిస్టమ్, 7-8 సీట్లు, పనోరమిక్ సన్‌రూఫ్ జోడించారు. ప్రపంచవ్యాప్తంగా ఇన్నోవా వాహనాలు 26 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. 2005లో భారత్‌లో ఇది రంగ ప్రవేశం చేసింది. ఇప్పటి వరకు 10 లక్షల పైచిలుకు ఇన్నోవాలు రోడ్డెక్కాయి. కంపెనీ మొత్తం అమ్మకాల్లో ఈ మోడల్ వాటా ఏకంగా 50 శాతం ఉంది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఎఫ్‌పీవో

రూ. 20,000 కోట్ల సమీకరణకు రెడీ



న్యూఢిల్లీ: పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీ గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్(ఏఈఎల్) భారీ నిధుల సమీకరణకు సిద్ధపడుతోంది. ఇందుకు ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్(ఎఫ్‌పీవో)ను చేపట్టనుంది. కొత్తగా ఈక్విటీని జారీ చేయడం ద్వారా రూ. 20,000 కోట్లు సమీకరించేందుకు తాజాగా సమావేశమైన బోర్డు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది. నిధులను గ్రూప్ భారీ విస్తరణ ప్రణాళికలకు వినియోగించనుంది. అదానీ గ్రూప్ పోర్టులు, ఇంధనం, సిమెంట్ తదితర పలు రంగాల్లో కార్యకలాపాలు విస్తరించిన సంగతి తెలిసిందే. గ్రూప్‌లోని బిజినెస్‌లకు ఇన్‌క్యుబేటర్‌గా వ్యవహరించే అదానీ ఎంటర్‌ప్రైజెస్ పౌర విమానయానం, డేటా సెంటర్లు తదితర పలు విభాగాలను కలిగి ఉంది. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్లకు 72.63 శాతం వాటా ఉంది. గత ఏడాది కాలంలో ఏఈఎల్ షేరు రెట్టింపునకుపైగా దూసుకెళ్లింది. శుక్రవారం రూ. 3,903 వద్ద ముగిసింది.

రికార్డు స్థాయిల వద్ద లాభాల స్వీకరణ

- ఫ్లాటుగా ముగిసిన సూచీలు
- 18,500 స్థాయి పైకి నిఫ్టీ



ముంబై: రికార్డు స్థాయిల వద్ద లాభాల స్వీకరణతో శుక్రవారం సూచీలు ఫ్లాటుగా ముగిశాయి. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు, క్రూడాయిల్ రికవరీలతో పరిమిత శ్రేణిలో కదలాడాయి. సెన్సెక్స్ ఉదయం 55 పాయింట్ల లాభంతో 62,3278 మొదలైంది. ఇంట్రాడేలో 175 పాయింట్లు బలపడి 62,448 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. అలాగే 62,115 పాయింట్ల వద్ద కనిష్ట స్థాయిని తాకింది. చివరికి 21 పాయింట్ల స్వల్ప లాభంతో 62,294 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 44 పాయింట్లు పెరిగి 18,528 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. రోజంతా 90 పాయింట్ల పరిధిలో కదలాడి 18,535 పాయింట్ల వద్ద ఏడాది గరిష్టాన్ని అందుకుంది. ఇంట్రాడేలో 18,445 వద్ద కనిష్టాన్ని తాకింది. మార్కెట్ ముగిసే సరికి 29 పాయింట్లు బలపడి 18,513 వద్ద ముగిసింది. చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.369 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్ల రూ.296 కోట్ల షేర్లను అమ్మేశారు.

థ్యాంక్స్ గివింగ్ డే సందర్భంగా అమెరికా మార్కెట్లకు గురువారం సెలవు. కోవిడ్ కేసుల పెరుగుదలతో చైనాలోని పలు ప్రాంతాల్లో లాక్‌డౌన్ విధించారు. దీంతో ఆసియా, యూరప్ మార్కెట్లు స్వల్పంగా బలహీనంగా ట్రేడయ్యాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- రిలయన్స్, విప్రో, మారుతీ షేర్లు 1.5% రాణించి రికార్డు ర్యాలీకి తోడ్పాటు అందించడమే కాకుండా సూచీల పతనాన్ని అడ్డుకున్నాయి.
- మధ్య తరహా షేర్ల ర్యాలీలో భాగంగా ప్రభుత్వ రంగ భెల్ షేరు 10% బలపడి రూ. 82 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది.
- యూటీఐ ఏఎంసీలో మొత్తం వాటా ఉపసంహరణకు కేంద్రం అనుమతినివ్వడంతో పీఎస్‌బీ షేరు 5% లాభపడి రూ.54 వద్ద స్థిరపడింది.

బీమాలో భారీ సంస్కరణలు

- కొత్త సంస్థల ప్రవేశ నిబంధనలు సరళతరం
- సాల్వెన్సీ రేషియో తగ్గింపు
- బీమా సంస్థలకు రూ.3,500 కోట్లు



న్యూఢిల్లీ: బీమా రంగంలో కీలకమైన సంస్కరణకు బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఆమోదముద్ర వేసింది. ముఖ్యంగా కొత్త సంస్థల ప్రవేశ నిబంధనలను సడలించింది. సాల్వెన్సీ రేషియోను సైతం తగ్గించింది. దీంతో ప్రస్తుత బీమా సంస్థలకు అదనంగా రూ.3,500 కోట్ల నిధులు అందుబాటులోకి రానున్నాయి. బీమా సేవలను మరింత మందికి చేరువ చేసే లక్ష్యంతో ఐఆర్‌డీఏఐ శుక్రవారం నాటి బోర్డ్ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకుంది. బీమా కంపెనీల్లో నేరుగా పెట్టుబడులు పెట్టేందుకు ప్రైవేటు ఈక్విటీ సంస్థలను (పీఈ) అనుమతించింది. సబ్సిడరీలు బీమా సంస్థలకు ప్రమోటర్లుగా మారేందుకు ఓకే చెప్పింది. 2047 నాటికి అందరికీ బీమా లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్టు ఐఆర్‌డీఏఐ ప్రకటించింది.

కీలక నిర్ణయాలు..

- బీమా రంగంలో సులభతరమైన వ్యాపార విధానాలకు వీలుగా, కొత్త సంస్థల రాకను ప్రోత్సహించేందుకు రిజిస్ట్రేషన్ నిబంధనలను సవరించనున్నట్టు ఐఆర్‌డీఏఐ తెలిపింది.
- కార్పొరేట్ ఏజెంట్లు ఇక మీదట గరిష్టంగా 9 బీమా సంస్థలతో టైఅప్ పెట్టుకోవచ్చు. ఈ పరిమితి ప్రస్తుతం 3గానే ఉంది. ఇన్సూరెన్స్‌ను మార్కెటింగ్ చేసే ఒక్కో సంస్థ గరిష్టంగా ఆరు బీమా సంస్థలతో ఒప్పందాలు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ పరిమితి 2గా ఉంది.
- సాధారణ బీమా సంస్థలు తమ నిధులను మరింత సమర్థవంతంగా వినియోగించుకునేందుకు గాను, క్రాప్ ఇన్సూరెన్స్ సాల్వెన్సీ రేషియోను 0.70 శాతం నుంచి 0.50 శాతానికి తగ్గించింది. దీనివల్ల కంపెనీలకు రూ.1,460 కోట్ల నిధులు అందుబాటులోకి వస్తాయి.
- ఇక జీవిత బీమా కంపెనీలకు సంబంధించి యూనిట్ లింక్డ్ ప్లాన్ల (యులిప్‌లు) సాల్వెన్సీ రేషియోను 0.80% నుంచి 0.60% చేసింది. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన సాల్వెన్సీ రేషియోను 0.10% నుంచి 0.05% చేసింది. దీనివల్ల జీవిత బీమా కంపెనీలకు రూ.2,000 కోట్లు అందుబాటులోకి వస్తాయి.
- బీమా కంపెనీ చెల్లించిన మూలధనంలో ఒక ఇన్వెస్టర్ 25%, ఇన్వెస్టర్లు ఉమ్మడిగా 50% వాటా కలిగి ఉంటే 'ఇన్వెస్టర్లు'గా పరిగణించనుంది. అంతకుమించితే ప్రమోటర్లుగా పరిగణిస్తారు. ఇప్పటి వరకు ఒక ఇన్వెస్టర్‌కు 10%, ఇన్వెస్టర్ల సమూహానికి 25% పరిమితి ఉంది.
- ప్రమోటర్లు 26 శాతం వరకు వాటాను తగ్గించుకునేందుకు కొత్త నిబంధన తీసుకొచ్చింది.

పీఎస్‌యూ వాటాల విక్రయంపై దృష్టి

- జాబితాలో కోల్ ఇండియా, హిందుస్తాన్ జింక్
- రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ సైతం
- 5-10 శాతం వాటా అమ్మకానికి ప్రణాళికలు



న్యూఢిల్లీ: పీఎస్‌యూ దిగ్గజాలలో కొద్దిపాటి వాటాల విక్రయంపై ప్రభుత్వం తాజాగా దృష్టిసారించింది. ఇంధన దిగ్గజం కోల్ ఇండియా, హిందుస్తాన్ జింక్‌తోపాటు ఎరువుల కంపెనీ రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్(ఆర్‌సీఎఫ్)లను ఇందుకు పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. దేశీ స్టాక్ మార్కెట్లు తాజాగా సరికొత్త గరిష్టాలకు చేరిన నేపథ్యంలో ఇందుకు తెరతీయాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తద్వారా జనవరి-మార్చి కాలంలో ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వం చూస్తున్నట్లు తెలియజేశాయి. రైల్వే రంగ పీఎస్‌యూసహా 5 కంపెనీలలో 5-10% వాటా విక్రయించే ప్రణాళికలు వేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆఫర్ ఫర్ సేల్: పీఎస్‌యూలలో వాటాల విక్రయానికి ప్రభుత్వం ఆఫర్ ఫర్ సేల్ విధానాన్ని పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం మార్కెట్లలో ఆశావహ పరిస్థితులు నెలకొన్న కారణంగా ప్రభుత్వానికి కనీసం రూ. 16,500 కోట్లవరకూ లభించవచ్చని అంచనా. ఆర్థిక వ్యవస్థ పటిష్టత, నిధుల సమీకరణ వంటి అంశాలు ప్రభుత్వానికి మద్దతివ్వగలవని నిపుణులు భావిస్తున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రభావంతో పెరుగుతున్న సబ్సిడీ బిల్లుకు తద్వారా కొంతమేర చెక్ పెట్టవచ్చని విశ్లేషిస్తున్నారు. కాగా.. పీఎస్‌యూ వాటాల విక్రయం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం (2022-23)లో రూ. 65,000 కోట్లను సమీకరించాలని ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది.


షేర్లు జూమ్

గత ఏడాది కాలాన్ని పరిగణిస్తే కోల్ ఇండియా షేరు 46%, ఆర్‌సీఎఫ్ 58% దూసుకెళ్లాయి. ఇక తాజాగా ఎన్‌ఎస్ఈలో కోల్ ఇండియా షేరు రూ. 232 వద్ద నిలవగా.. హింద్ జింక్ రూ. 297 వద్ద, ఆర్‌సీఎఫ్ రూ. 120 వద్ద ముగిశాయి.

సినిమా

మమమ్మాస్


టికెట్లు బాగా తెగాలంటే మాస్ ప్రేక్షకులు రావాలి. అందుకే ఏడాదికి రెండొందల సినిమాలు వస్తే.. వాటిలో తొంభై శాతం మాస్ సినిమాలే ఉంటాయి. ఆ మాస్ బొమ్మ (సినిమా) బాగుంటే ఇక మాస్ ప్రేక్షకులకు పండగ... వసూళ్లతో బాక్సాఫీస్‌కి పండగ. ప్రస్తుతం తెలుగులో రూపొందుతున్న 'మాస్ బొమ్మ'లపై ఓ లుక్కేద్దాం...


చిరంజీవి



బాలకృష్ణ


మాస్ పాత్రలకు పెట్టింది పేరు చిరంజీవి. తెరపై ఆయన మాస్ డైలాగులు, డ్యాన్స్‌లు చూస్తే థియేటర్లో మెగా అభిమానులు, ప్రేక్షకులు విజిల్స్‌తో రెచ్చిపోతారు. తాజాగా చిరంజీవి నటిస్తున్న 'వాల్తేరు వీరయ్య' చిత్రం అలాంటి ఫుల్ మాస్ కిక్ ఇవ్వనుంది. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ లుక్స్, టీజర్, 'బాస్ పార్టీ..' పాట ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. కేఎస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కానుంది. మరోవైపు 'వీరసింహారెడ్డి' అంటూ బాలకృష్ణ పక్కా మాస్‌గా కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ ఫ్యాన్స్‌కి కిక్ ఇచ్చేలా ఉన్నాయి. ఈ సినిమాలోని 'జై బాలయ్య..' అంటూ అదిరిపోయే మాస్ సాంగ్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం కూడా సంక్రాంతి బరిలో నిలుస్తోంది. కాగా అటు 'వాల్తేరు వీరయ్య', ఇటు 'వీరసింహారెడ్డి' చిత్రాల్లో శ్రుతీహాసనే కథానాయిక కావడం విశేషం. ఇకపోతే.. హీరో రవితేజకి మాస్ మహారాజా అనే ట్యాగ్‌లైన్ ఉంది. ఆయన సినిమాలో కచ్చితంగా మాస్ యాంగిల్ కనిపిస్తుంది. అలాంటి రవితేజ మరోసారి 'ధమాకా' చిత్రంతో మాస్ లుక్‌లో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. ఈ చిత్రం నుంచి 'డు డు..' అనే పాటని శుక్రవారం రిలీజ్ చేశారు. ఈ సినిమా డిసెంబరు 23న విడుదలవుతోంది. కాగా వరుస పాన్ ఇండియా సినిమాలతో బాక్సాఫీస్‌ని షేక్ చేస్తున్న ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సలార్'. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ మాస్ లుక్‌లో కనిపించనున్నారు ప్రభాస్. ఈ చిత్రం వచ్చే ఏడాది సెప్టెంబర్ 28న విడుదల కానుంది. అలాగే పవన్ కల్యాణ్ 'హరి హర వీరమల్లు' అంటూ మాస్‌గా రానున్నారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నిధీ అగర్వాల్ హీరోయిన్. పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో పవన్ కల్యాణ్ మాస్ లుక్‌లోనూ కనిపించనున్నారు. అదేవిధంగా 'పుష్ప' చిత్రంలో ఊర మాస్ లుక్‌లో కనిపించి సగటు సినీ ప్రేక్షకులు ఆశ్చర్యపోయేలా చేశారు అల్లు అర్జున్. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం గత ఏడాది డిసెంబరు 17న విడుదలై పాన్ ఇండియా స్థాయిలో వసూళ్లు రాబట్టింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప 2' రానుంది. తొలి భాగంలో ఊర మాస్‌గా కనిపించిన అల్లు అర్జున్ ద్వితీయ భాగంలో అంతకు మించి కనిపిస్తారని ఊహించవచ్చు. అదేవిధంగా ఎన్టీఆర్‌కి మాస్ పాత్రలు కొత్తేమీ కాదు. ఇప్పటికే ఆ పాత్రల్లో ప్రేక్షకులను అలరించిన ఆయన మరోసారి మాస్ లుక్‌లో కనిపించనున్నారు. ఎన్టీఆర్ హీరోగా రూపొందుతున్న 30వ చిత్రానికి కొరటాల శివ దర్శకుడు. అలాగే ఆయన హీరోగా తెరకెక్కనున్న 31వ చిత్రానికి 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ డైరెక్టర్. ఈ రెండు సినిమాల్లో ఎన్టీఆర్ మాస్ లుక్‌లో సందడి చేయనున్నారు. ఇకపోతే తన సహజమైన నటనతో నేచురల్ స్టార్ అనే ట్యాగ్‌ని సొంతం చేసుకున్న నాని కెరీర్‌లో తొలిసారి పూర్తి స్థాయి మాస్ పాత్రలో నటిస్తున్న సినిమా 'దసరా'. సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలో సాగే ఈ సినిమా కోసం ఊరమాస్ బ్లాక్ లుక్‌లోకి మారిపోయారు నాని. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 30న విడుదల కానుంది. ఇక తన కెరీర్‌లో అక్కినేని నాగచైతన్య ఇప్పటికే మాస్ పాత్రలు చేసినా ప్రేక్షకులు లవర్‌బాయ్‌గా, పక్కింటి కుర్రాడిలా చూస్తారు. తాజాగా ఆయన నటిస్తున్న తెలుగు-తమిళ చిత్రం 'కస్టడీ'. వెంకట్ ప్రభు డైరెక్టర్. కాగా ఈ నెల 23న నాగచైతన్య బర్త్ డే సందర్భంగా 'కస్టడీ' టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ లుక్ చూస్తే ఇప్పటి వరకు చేయని ఫుల్ మాస్ క్యారెక్టర్‌ని నాగచైతన్య చేస్తున్నారని స్పష్టం అవుతోంది. మరోవైపు అక్కినేని అఖిల్ కూడా మాస్ లుక్‌తో రానున్నారు. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో అఖిల్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'ఏజెంట్'. ఈ సినిమా కోసం పక్కా మాస్‌లుక్‌కి మారిపోయారు అఖిల్. తన పాత్ర కోసం ఫిజిక్‌ని సిక్స్‌ప్యాక్‌కి మార్చుకున్నారు. ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కానుంది.


ఈ హీరోలే కాదు.. ఇంకా పలువురు హీరోలు మాస్ లుక్‌లో మమమ్మాస్ అంటూ తెరపై సందడి చేయనున్నారు.



రవితేజ


ప్రభాస్


ఎన్టీఆర్


అల్లు అర్జున్


నాని


నాగచైతన్య


అఖిల్

వివాదంలో రష్మిక?


రష్మిక

కన్నడ చిత్రపరిశ్రమలో హీరోయిన్ రష్మికా మందన్నాకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయనే టాక్ వినిపిస్తోంది.. రిషబ్ శెట్టి దర్శకత్వంలో రక్షిత్ శెట్టి హీరోగా నటించిన కన్నడ చిత్రం 'కిర్రిక్ పార్టీ'తో రష్మికా మందన్నా హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఈ చిత్రం తర్వాత ఇతర భాషల్లో ముఖ్యంగా తెలుగులో సినిమాలు చేసి అగ్రకథానాయికల్లో ఒకరిగా చోటు సంపాదించుకున్నారు రష్మిక. కాగా కన్నడంలో డబ్బింగ్ చెప్పేందుకు తగిన సమయం లేదని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారట రష్మిక. అంతేకాదు.. తన తొలి చిత్రం ప్రొడక్షన్ హౌస్ గురించి, 'కాంతార' మూవీ గురించి రష్మిక చేసిన వ్యాఖ్యలు కన్నడిగుల మనోభావాలను దెబ్బతీశాయనే టాక్ ప్రచారం అవుతోంది. ఈ నేపథ్యంలో కన్నడ పరిశ్రమ నుంచి రష్మికను బ్యాన్ చేయాలని సోషల్ మీడియా వేదికగా కొందరు నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు.

కళాకారులు ప్రశ్నించాలి - ఆర్. నారాయణమూర్తి


ఆర్ నారాయణమూర్తి, గద్దర్, సత్యారెడ్డి

సత్యారెడ్డి నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'. మేఘనా లోకేష్, ఎంవీవీ సత్యానారాయణ, గద్దర్, అయోధ్య రామ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఆడియో వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన నటుడు, దర్శక-నిర్మాత ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ- ''విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు' అని నినాదాలు చేస్తుంటే దానిని ఈ రోజు ప్రైవేటీకరణ చేయడం న్యాయమా?.. కాదు' అని ప్రశ్నిస్తూ ఈ సినిమా తీశాడు సత్యారెడ్డి. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కళాకారులు, రాజకీయ పార్టీలు, నేతలు ప్రశ్నించాలి'' అన్నారు. ''ఈ సమస్య విశాఖపట్నం ప్రజలది మాత్రమే కాదు. తెలుగు ప్రజలందరిదీ'' అన్నారు గద్దర్. ''వేలాదిమంది కార్మికులు, లీడర్స్, విద్యార్థి సంఘాల నాయకులు మా సినిమాలోని పాటలో నటించారు'' అన్నారు సత్యారెడ్డి. దర్శకుడు నక్కిన త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, దాసరి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నువ్వు నా వెన్నెల...


ఆది, రియ

'వెన్నెల వెన్నెల.. నువ్వు నా వెన్నెల.. దైవమే ప్రేమగా పంపేనే నిన్నిలా...' అంటూ సాగుతుంది 'వెన్నెల వెన్నెల...' పాట. ఆది సాయికుమార్, రియా సుమన్ జంటగా కె.శశికాంత్ డైరెక్షన్‌లో రూపొందిన 'టాప్ గేర్' చిత్రంలోని పాట ఇది. సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరపరిచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అదించగా, సిద్ శ్రీరామ్ పాడారు. కేవీ శ్రీధర్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ మూవీలోని 'వెన్నెల వెన్నెల' అనే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: గిరిధర్ మామిడిపల్లి.

లవ్.. సస్పెన్స్


సాక్షి, కోలా బాలకృష్ణ

కోలా బాలకృష్ణ, సాక్షి చౌదరి జంటగా నిర్ణయ్ పల్నాటి దర్శకత్వంలో రూపొందిన సినిమా 'నేనెవరు'. భీమినేని శివప్రసాద్, తన్నీరు రాంబాబు నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ''లవ్, సస్పెన్స్ అండ్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఆర్‌జీ సారథి, కెమెరా: సామల భాస్కర్, సహనిర్మాతలు: పూనమ్ చంద్, కుమావత్, కిరణ్ కుమార్ మోటూరి.

నైపుణ్య శిక్షణకు త్రైపాక్షిక ఒప్పందం

సాక్షి, అమరావతి: డిజిటల్ టెక్నాలజీలో నైపుణ్య శిక్షణ ఇచ్చే విధంగా ఏపీ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, ఎడ్యునెట్ ఫౌండేషన్, ఏపీనైపుణ్యాభివృద్ధి సంస్థల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. తాడేపల్లిలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ హేమచంద్రారెడ్డి, ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ సీఈవో సత్యనారాయణ, ఎడ్యునెట్ ఫౌండేషన్ డైరెక్టర్ ఆశిష్ అరోరా సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్, క్లౌడ్ టెక్నాలజీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి హైఎండ్ టెక్నాలజీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

డిసెంబర్ 4, 5 తేదీల్లో ఏపీలో రాష్ట్రపతి పర్యటన

సాక్షి, అమరావతి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రంలో రెండురోజులు పర్యటించనున్నారు. డిసెంబర్ 4, 5 తేదీల్లో ఆమె విజయవాడ, విశాఖపట్నంలలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాష్ట్రపతి డిసెంబర్ 4న ఉదయం విజయవాడ చేరుకుంటారు. విజయవాడలో ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం పౌరసన్మానం చేస్తుంది. రాయచోటి-అంగల్లు సెక్షన్ జాతీయ రహదారిని, జాతీయ రహదారి-205పై నాలుగులేన్ల ఆర్వోబీ-అప్రోచ్ రోడ్లను, కర్నూలులోని ఐటీసీ జంక్షన్ వద్ద నిర్మించిన ఆరులేన్ల గ్రేడ్ సెపరేటెడ్ నిర్మాణాలను రాష్ట్రపతి ప్రారంభిస్తారు. ముదిగుబ్బ-పుట్టపర్తి రహదారి విస్తరణ పనులకు భూమిపూజ చేస్తారు. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇచ్చే విందుకు రాష్ట్రపతి హాజరవుతారు. తరువాత విశాఖపట్నం వెళతారు. విశాఖపట్నం బీచ్‌రోడ్డులో నిర్వహించే భారత నౌకాదళ దినోత్సవాల్లో పాల్గొని నౌకాదళ విన్యాసాలను వీక్షిస్తారు. ఆరోజు రాత్రి విశాఖపట్నంలో బసచేసి, 5వ తేదీ ఉదయం ఢిల్లీ వెళతారు. రాష్ట్రపతి పాల్గొనే కార్యక్రమాలకు ప్రభుత్వం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో రాష్ట్రపతి పర్యటన వివరాలను ఇంకా అధికారికంగా ఖరారు చేయాల్సి ఉంది.

ముక్తకంఠంతో మూడు రాజధానుల నినాదం

- విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్రకు మేలు
- ఇచ్ఛాపురంలో మూడు రాజధానులకు మద్దతుగా బహిరంగ సభ
- వికేంద్రీకరణకు జైకొట్టిన నాయకులు, మేధావులు



సభకు హాజరైన అశేష జనవాహిని

ఇచ్ఛాపురం: శ్రీకాకుళం జిల్లాలో మూడు రాజధానుల నినాదం మరోసారి మార్మోగింది. విశాఖ రాజధాని అయితే ఉత్తరాంధ్రతో పాటు ఉభయ గోదావరి జిల్లాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతాయని వక్తలు ముక్తకంఠంతో అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌ను రాజధాని చేయడంవల్ల ఆ ఒక్క ప్రాంతానికే అభివృద్ధి పరిమితమైందని.. అందుకే అలాంటి పొరపాటు మరోసారి జరగకుండా మూడు రాజధానులు ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని వారు చెప్పారు. ఇచ్ఛాపురంలోని వైఎస్సార్ ప్రజాప్రస్థాన విజయ వాటిక టూరిజం పార్కులో శుక్రవారం మూడు రాజధానులకు మద్దతుగా బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ.. శివరామకృష్ణన్ కమిటీ నివేదిక సూచనల మేరకే మూడు రాజధానుల నిర్మాణం చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారని అన్నారు. విశాఖ వాసులు విశాల దృక్పథం గలవారని, ఆ ప్రాంతాన్ని పరిపాలన రాజధానిగా చేయడానికి అన్ని విధాలా అర్హమైనదన్నారు. శివరామకృష్ణన్ కమిటీ కూడా ఇదే చెప్పిందని, కానీ.. ఆ కమిటీ నివేదికను అప్పటి సీఎం చంద్రబాబు పెడచెవిన పెట్టారని వారు విమర్శించారు. సభలో పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు కార్యక్రమానికి సంఘీభావం తెలుపుతూ.. తన వర్గీయులకు లబ్ధిచేకూర్చేందుకే చంద్రబాబు హైదరాబాద్‌లో పదేళ్లు ఉండే అవకాశాన్ని వదిలేసి అమరావతిని రాజధానిగా ప్రకటించారని గుర్తుచేశారు. దేశంలో చాలా రాష్ట్రాలు అభివృద్ధిని వికేంద్రీకరణ చేశాయని ఆయన ఉటంకించారు. ప్రజలంతా ఈ నిర్ణయానికి మద్దతు పలకాలని మంత్రి కోరారు. అంతకుముందు.. సోంపేటలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, బ్యూటిఫికేషన్ అండ్ గ్రీనింగ్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, సీడాప్‌చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, మామిడి శ్రీకాంత్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ పిలక రాజలక్ష్మి, డీసీఎంఎస్ చైర్మన్ సల్లా సుగుణ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వలసలు ఉండవు



విశాఖ రాజధాని అయితే ఉత్తరాంధ్రలో వలసలు ఉండవు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. దీనిపై బురద జల్లేందుకే అమరావతి రైతు దీక్షలు అంటూ ప్రతిపక్షాలు ప్రజలను మభ్యపెడుతున్నాయి. భావితరాల కోసం విశాఖ రాజధాని నిర్ణయాన్ని సమర్థించాలి.

– పిరియా విజయ, జెడ్పీ చైర్‌పర్సన్

ఉత్తరాంధ్ర అభివృద్ధి



విశాఖను రాజధాని చేయడంవల్ల ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుంది. తద్వారా ఈ ప్రాంతానికి చెందిన యువతకు ఉద్యోగావకాశాలు పెరిగి నిరుద్యోగ సమస్య తీరుతుంది.

– హనుమంతు లజపతిరాయ్, నాన్ పొలిటికల్ జేఏసీ కన్వీనర్

రాష్ట్రమంతా అభివృద్ధి ఫలాలు



మూడు రాజధానులు ఏర్పాటుచేయడంవల్ల రాష్ట్రం నలుమూలలా అభివృద్ధి ఫలాలు అందుతాయి. ఈ కారణంగా అన్ని ప్రాంతాల వారూ అభివృద్ధి చెందుతారు. ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా అంతా కలిసిమెలిసి ఉంటారు. – దానేటి శ్రీధర్, ప్రముఖ వైద్యుడు

అన్ని రంగాల్లోనూ అభివృద్ధి



వికేంద్రీకరణ చేయడంవల్ల అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడం సాధ్యమవుతుంది. విశాఖను కార్యనిర్వాహక రాజధాని చేయడంవల్ల ఉత్తరాంధ్రతో పాటు రాజమహేంద్రవరం తదితర ప్రాంతాలూ అభివృద్ధి చెందుతాయి. ఒకేచోట రాజధానిని కేంద్రీకరించడంవల్ల ఇతర ప్రాంతాల అభివృద్ధి సాధ్యంకాదు.

– జి. తులసీరావు, ప్రొఫెసర్

‘ఇప్పటం’ అబద్ధాలు ఇంకా..

- 27న పవన్‌కళ్యాణ్ చెక్కుల పంపిణీ
- పిటిషనర్లు రూ.లక్ష చొప్పున కట్టాలన్న హైకోర్టు

సాక్షి, అమరావతి: తప్పుడు అఫిడవిట్లు సమర్పించి సానుకూల ఉత్తర్వులు పొందడంపై కన్నెర్ర చేస్తూ 14 మంది ఇళ్ల యజమానులు రూ.లక్ష చొప్పున ఖర్చుల కింద చెల్లించాలని సాక్షాత్తూ హైకోర్టు స్పష్టమైన తీర్పు వెలువరించిన తర్వాత కూడా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ‘ఇప్పటం’ అబద్ధాలను ఇంకా కొనసాగించేందుకు సన్నద్ధం కావడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఈ నెల 27వతేదీన పవన్‌కళ్యాణ్ మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఇప్పటం ఇళ్ల యజమానులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చెక్కులను అందజేస్తారని ఆ పార్టీ పేర్కొంది.

ఒక్క ఇంటినీ కూల్చకున్నా..

ఇప్పటంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని కట్టిన నిర్మాణాలను రూ.1.65 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నగర పాలక సంస్థ అధికారులు ఈ నెల 4వ తేదీన ఆక్రమణలు తొలగించిన విషయం తెలిసిందే. మానవతా దృక్పథంతో ఇళ్ల జోలికి వెళ్లకుండా ఆక్రమించి కట్టిన ప్రహరీ గోడలు, మెట్లు లాంటి వాటినే అధికారులు తొలగించగా ప్రభుత్వం ఇళ్లను కూల్చి వేసిందంటూ పవన్ కళ్యాణ్ ఉద్రిక్తతలు రేకెత్తించేందుకు ప్రయత్నించారు. ఓ వర్గం మీడియా కూడా తప్పుడు కథనాలను ప్రచురించింది. అయితే జనసేన సభకు భూములిచ్చిన రైతులెవరు వారిలో లేరని సాక్ష్యాధారాలతో ఇప్పటికే రుజువైంది.

తెలంగాణ

పాస్‌పోర్టులో ఇంటి పేరు ఉండాల్సిందే

- యూఏఈ సర్కార్ తాజా నిబంధన

మోర్తాడ్ (బాల్కొండ): తమ దేశానికి వచ్చే పర్యాటకులు, వర్క్ వీసా పొందినవారు పాస్‌పోర్టులలో ఇంటిపేరును తప్పనిసరిగా జత చేయించుకోవాలని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం నిర్దేశించింది. యూఏఈకి వచ్చేవారి వివరాలు స్పష్టంగా ఉండాలనే ఉద్దేశంతో అక్కడి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. ఈ నిర్ణయం మేరకు భారతీయులు ఎవరైనా తమ పాస్‌పోర్టులో ఇంటిపేరు లేకపోతే నమోదు చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని యూఏఈలోని భారత విదేశాంగ శాఖ అధికారులు వెల్లడించారు. కొందరి పాస్‌పోర్టులలో కాని ఆధార్, పాన్‌కార్డు, ఓటర్ కార్డులలో ఇంటి పేరు ఉండకుండా కేవలం పేరు మాత్రమే ఉంటుంది. పేరు ఒక్కటే ఉండటం వల్ల ఆయా వ్యక్తుల స్పష్టమైన వివరాలు తెలియడం లేదనే ఉద్దేశంతో యూఏఈ ప్రభుత్వం ఈ సవరణలను చేపట్టింది. ఇదిలా ఉండగా ఎవరైనా పెళ్లి చేసుకోక ముందు పాస్‌పోర్టు తీసుకుని ఉంటే అందులో భర్త లేదా భార్య(స్పౌస్) పేరు ఉండదు. అలాంటి వారు కూడా తమ జీవిత భాగస్వామి పేరును నమోదు చేయించుకోవాలని దుబాయ్‌లోని భారత కాన్సులేట్ జనరల్ కోరారు. గతంలో ఇలాంటి నిబంధనలు లేక పోవడంతో అనేక మంది పాస్‌పోర్టులలో వివరాలు స్పష్టంగా లేవు. కొత్త నిబంధనల వల్ల పాస్‌పోర్టులలో పూర్తి వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంది.



యూఏఈలో రెన్యూవల్‌కు ఇక్కడ విచారణ

యూఏఈలో ఉపాధి పొందుతున్నవారు తమ పాస్‌పోర్టు రెన్యూవల్‌కు అక్కడి భారత రాయబార కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఇక్కడ ప్రత్యేక పోలీసు విభాగం(స్పెషల్ బ్రాంచ్) అధికారులు విచారణ జరుపుతున్నారు. విదేశాల్లో ఉన్న వారు పాస్‌పోర్టు రెన్యూవల్‌కు గడువు సమీపిస్తే తాము ఉండే దేశంలోని భారత రాయబార కార్యాలయంలో రెన్యూవల్ చేసుకునేవారు. పాత పాస్‌పోర్టునే రెన్యూవల్ చేసుకోవడం వల్ల ఎలాంటి విచారణ నిర్వహించకపోయేవారు. కానీ ఇప్పుడు మాత్రం భారత రాయబార కార్యాలయం ఇచ్చిన సమాచారంతో పాస్‌పోర్టు రెన్యూవల్ చేసుకునేవారి ఇంటి వద్దకు ఎస్‌బీ అధికారులు వచ్చి వివరాలను నమోదు చేసుకుంటుండటం గమనార్హం. పాస్‌పోర్టుల జారీ పారదర్శకంగా ఉండాలన్న కారణంతోనే ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

మాజీ మంత్రి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ నివాసం ముట్టడికి యత్నం

- అయ్యప్ప దీక్షలో నమాజు టోపీ ధరించడం, మసీదుకు వెళ్లడంపై నిరసన
- బీజేవైఎం చర్యలపై మండిపడుతున్న ప్రజలు

బీజేవైఎం అల్లరి చర్య

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: హిందూ దేవుళ్లను వాడుకుంటూ.. హిందువులను రెచ్చగొడుతూ రాజకీయాలు చేసే భారతీయ జనతా పార్టీ యువమోర్చా శుక్రవారం నెల్లూరు జిల్లాలో మరో అల్లరి చర్యకు పాలపడింది. మాజీ మంత్రి, నెల్లూరు నగర శాసన సభ్యుడు పి.అనిల్‌కుమార్ యాదవ్ అయ్యప్ప దీక్షలో ఉన్నారు. ఇటీవల నెల్లూరు నగరంలో నిర్వహించిన ఇస్తిమా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనిల్‌కుమార్ యాదవ్ అయ్యప్ప దీక్షలో ఉండగా నమాజ్ టోపీ ధరించడాన్ని వ్యతిరేకిస్తూ బీజేవైఎం శుక్రవారం ఆయన నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించింది. ‘హిందువుల ద్రోహి అనిల్ కుమార్‌యాదవ్.. హిందువులకు క్షమాపణ చెప్పాలి’ అని నినాదాలు చేస్తూ పెద్ద డ్రామాకు తెర లేపడం చర్చనీయాంశమైంది. ఆనాడే హిందూ ముస్లిం భాయ్ భాయ్ అనేందుకు నిదర్శనంగా.. శబరిమలకు వచ్చే ప్రతి భక్తుడు మొదట తన మిత్రుడైన వావరు స్వామి మసీదును సందర్శించి, టెంకాయ కొట్టిన అనంతరమే తనను దర్శించాలి అంటూ అయ్యప్ప స్వామే చెప్పినట్లు అయ్యప్ప మాలధారులు పరమ పవిత్రంగా పూజించే శ్రీధర్మ శాస్త్రమే చెబుతుంది. బీజేవైఎం నేతలు మాత్రం దీనిని విస్మరించి, అయ్యప్ప మాలధారణలో మసీదుకు వెళ్లడం, నమాజు టోపీ ధరించడం తప్పంటూ నిరసనలు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరమ పవిత్రమైన ఇరుముడితో మసీదు ప్రవేశం అపవిత్రం కానిది.. సాధారణ మాలధారణతో మసీదు ప్రవేశం, నమాజు టోపీ ధరించడం అపవిత్రం ఎలా అవుతుందని ప్రజలు నిలదీస్తున్నారు. పురాణాలను కూడా వ్యతిరేకిస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.